www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


రంజాన్ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని మీర్ ఆలం ఈద్గాహ్ వద్ద ముస్లింల ప్రార్థనలు

మంగళవారం | 1-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 2 |
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా2.33 తదుపరి పంచమి; నక్షత్రం: భరణి ఉ.11.07 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా.9.05-రా.11.25; దుర్ముహూర్తం: ఉ.8.39-ఉ.9.28, రా.10.16-రా.11.02; అమృతఘడియలు: ఉ.6.50-ఉ.8.16; రాహుకాలం: మ.3.00-సా.4.30; సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 6.24 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హెచ్‌సీఏ, ఎస్‌ఆర్‌హెచ్ వివాదం..

సీఎం సీరియస్

విజిలెన్స్ విచారణకు ఆదేశం.. విచారణాధికారిగా కొత్తకోట

ఎస్‌ఆర్‌హెచ్‌ను వేధిస్తే సహించేది లేదని సీఎం హెచ్చరిక

ఉచితంగా కాదు.. డబ్బులకే అడిగాం.. హెచ్‌సీఏ వెల్లడి

ఇచ్చిన హామీని ఎస్‌ఆర్‌హెచ్ నిలబెట్టుకోలేదని ఆరోపణ

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్‌ఆర్‌హెచ్) యాజమాన్యం మధ్య నెలకొన్న వివాదంపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అందుకు కారకులైనవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వివాదంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. కాంప్లిమెంటరీ పాసుల విషయంలో తమపై హెచ్‌సీఏ ఒత్తిడి తెస్తోందని, వేధింపులకు

మిగతా 3వ పేజీలో...



సీఎం రేవంత్‌ను కలిసిన వాన్‌గార్డ్ ప్రతినిధులు, చిత్రంలో సీఎస్

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ జీసీసీ

ఏడాది చివరికి ప్రారంభం.. 4 ఏళ్లలో 2,300 ఉద్యోగాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సంస్థ ప్రతినిధుల భేటీ 12

కంచ గచ్చిబౌలిలో ప్రభుత్వం వేలం వేయాలనుకుంటున్న భూమిని పెద్ద ఎత్తున ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్న దృశ్యం



రగడ.. రగడ

కంచ గచ్చిబౌలి భూములు మావే: సర్కార్.. కాదు మావే: హెచ్‌సీయూ

534 ఎకరాలను 2004లోనే సర్కారుకు స్వాధీనం చేసిన వర్సిటీ

బదులుగా గోపనపల్లిలో 397 ఎకరాలు హెచ్‌సీయూకిచ్చిన సర్కారు

అప్పట్లోనే ఐఎంజీకి.. న్యాయ వివాదాలు.. ప్రభుత్వభూములేనన్న సుప్రీం

తర్వాత ఆ భూములు టీజీఐఐసీకి.. స్వాధీనం చేసుకోవాలని సూచన

వర్సిటీ రిజిస్ట్రార్ సమ్మతితో నిరుడు సర్వే.. హద్దుల గుర్తింపు: ప్రభుత్వం

టీజీఐఐసీ చెప్పేదంతా అబద్ధం.. సర్వే జరగలే.. హద్దులూ గుర్తించలే

వెనక్కి తీసుకోవాలంటే కమిటీ ఆమోదం తప్పనిసరి: వర్సిటీ రిజిస్ట్రార్

నాడు భూములు అమ్మొద్దన్నవ్.. నువ్వు చేస్తోందేంటి రేవంత్?: కేటీఆర్

విద్యార్థినుల జుట్టు పట్టి లాక్కెళ్తారా?.. మానవత్వం లేదా?: బండి

పోలీసుల తీరు గర్హనీయం .. ఖండించిన విద్యార్థి యువజన సంఘాలు

హైదరాబాద్, రాయదుర్గం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేలం వేయాలనుకుంటున్న కంచ గచ్చిబౌలి భూములపై రగడ కొనసాగుతోంది! రాత్రి పగలు తేడా లేకుండా దాదాపు 50 ఎక్స్‌కవేటర్లతో ఆ భూములను చదును చేసే కార్యక్రమాన్ని సర్కారు ముమ్మరంగా చేస్తుంటే.. ఆ భూములు వర్సిటీవేనని, వాటిని తమకు అప్పగించాలంటూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులు ఆందోళన తీవ్రం చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ చదును చేసే కార్యక్రమాలను అడ్డుకున్న విద్యార్థులు.. సోమవారం వివిధ రాజకీయ పార్టీలను ఆశ్రయించారు. వారికి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు మద్దతు పలికాయి. వేలాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే, ఆ భూములు ప్రభుత్వానివేనంటూ టీజీఐఐసీ ఆధారాలను బయటపెట్టింది. సోమవారం ఉదయం, సాయంత్రం రెండు ప్రకటనలను విడుదల చేసింది. ప్రస్తుతం వివాదం నెలకొన్న భూములను

మిగతా 13వ పేజీలో...

సర్కారీ స్పెషాలిటీ

రాజధానిలో 3 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు

సనత్‌నగర్‌లో కార్డియాక్, కార్డియోథొరాసిక్

ఎల్బీనగర్‌లో న్యూరాలజీ, న్యూరోసైన్స్

అల్వాల్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ స్పెషాలిటీ

ఒక్కో టిమ్స్‌నూ ఒక్కో స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

జూన్‌నాటికి అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్

మిగిలిన రెండూ ఈ ఏడాది చివరినాటికి

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటిదాకా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైనవన్నీ కూడా జనరల్ ఆస్పత్రులే. చాలా తక్కువగా స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేశారు. క్యాన్సర్ రోగులకు ఎంఎన్‌జే, చిన్నారుల కోసం నీలోఫర్, మానసిక రోగుల కోసం మెంటల్ ఆస్పత్రి, క్షయ రోగులకు టీబీ ఆస్పత్రి వంటివే ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు పెద్దగా లేవనే చెప్పాలి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్మిస్తున్న టిమ్స్ (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రులను మూడు స్పెషాలిటీ ఆస్పత్రులుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో టిమ్స్‌ను ఒక్కో స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దబోతున్నారు. సనత్‌నగర్ టిమ్స్‌లో కార్డియాక్, కార్డియోథొరాసిక్, అల్వాల్ టిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఎల్బీనగర్ టిమ్స్‌ను న్యూరాలజీ, న్యూరోసైన్స్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ఇప్పటికే ఉన్న గాంధీ, ఉస్మానియాలను జనరల్ ఆస్పత్రులుగా కొనసాగించనున్నారు. ఆ రెండు ఆస్పత్రుల్లో ఉన్న కార్డియాక్, గ్యాస్ట్రో, న్యూరాలజీ విభాగాలను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు తరలించనున్నారు. ఆ మూడు.. మూడు రకాల స్పెషాలిటీలుగా మారబోతున్న నేపథ్యంలో ఇక్కడ

మిగతా 12వ పేజీలో...

రేపు బీసీల పోరుగర్జన

ఢిల్లీకి అఖిలపక్ష నేతలు.. కాంగ్రెస్ తరపున హాజరు కానున్న మహేశ్‌గౌడ్, పొన్నం, సురేఖ

ధర్నాలో పాల్గొననున్న కనిమొళి, అసద్, మధుసూదనా చారి, శ్రీనివాస్‌గౌడ్, డి.రాజా

ఇప్పటికే ఢిల్లీలో బీసీ సంఘాల నేతలు.. చర్లపల్లి నుంచి బయల్దేరిన ప్రత్యేక రైలు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న మహాధర్నాలో పాల్గొనేందుకు.. రాష్ట్రంలోని అఖిలపక్ష పార్టీల నేతలు ఢిల్లీ బాట పట్టారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన మహాధర్నాకు రావాలంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, మజ్లిస్, వామపక్షాలు, టీజేఎస్‌తోపాటు బీజేపీ నేతలను బీసీ సంఘాల ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ధర్నాలో పాల్గొనేందుకు అఖిల పక్ష పార్టీల నాయకులు ఢిల్లీకి వెళ్తున్నారు. అధికార కాంగ్రెస్ నుంచి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతోపాటు బీసీ ఎంపీలు సురేశ్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, వాకిటి శ్రీహరి, మకన్ సింగ్ రాజ్ ఠాకూర్, వీర్లపల్లి శంకరయ్య, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరుకానున్నారు. వీరందరూ మంగళవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళుతున్నారు. ఈ బృందం... బీసీ మహాధర్నాలో పాల్గొనడమే కాకుండా.. బుధ, గురు వారాల్లో కేంద్ర ప్రభుత్వ పెద్దలను, వివిధ పార్టీల నాయకులను కలిసి బీసీ బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చే అంశంపై మద్దతు ఇవ్వాలని కోరనుంది. ఈ విషయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సహకారాన్ని తీసుకోనుంది. మహాధర్నాలో ఆయన కూడా పాల్గొనేందుకు ఆస్కారం ఉందని బీసీ సంఘాల నేతలు చెబుతున్నారు. ఇక, బీఆర్‌ఎస్ నుంచి మధుసూధనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మిగతా 12వ పేజీలో...

వేతనజీవులకు పన్ను ఉపశమనం

నేటి నుంచి అమల్లోకి



రూ.12.75లక్షల దాకా ఆదాయంపై పన్ను ఉండదు

టీడీఎస్, టీసీఎస్ నిబంధనలు, బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ తదితరాల్లోనూ మార్పులు

న్యూఢిల్లీ, మార్చి 31: కొత్త ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ సంవత్సరంలో పన్ను చెల్లింపుదారులు, వేతన జీవులు, వినియోగదారులకు సంబంధించిన కొన్ని మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని భారీగా పెంచడంతోపాటు సవరించిన ఆదాయం పన్ను శ్లాబులు అమల్లోకి రానున్నాయి. యూపీఐ నిబంధనల్లో మార్పులు, ఇతర మార్పులు అమల్లోకి రాబోతున్నాయి. వాటి గురించి చూద్దాం...

బడ్జెట్‌లో అనూహ్య ప్రకటన..

దేశంలోని వేతన జీవులు ఊహించని విధంగా 2025 బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదాయ పన్ను మినహాయింపునకు సంబంధించిన ప్రకటన చేశారు. రూ.12 లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జించే వారు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రూ.75వేల స్టాండర్డ్ డిడక్షన్‌ను కలిపితే

మిగతా 2వ పేజీలో...



దంతెవాడలో ఎన్‌కౌంటర్

మహిళా మావోయిస్టు రేణుక మృతి

ఆమె దివంగత మావోయిస్టు శాఖమూరి అప్పారావు భార్య 3

ఆమెపై రూ.45 లక్షల రివార్డు.. రేణుక స్వస్థలం జనగామ జిల్లాలోని కడవెండి

యువవికాసం దరఖాస్తుల గడువు

14 వరకు పెంపు

పథకం ప్రగతిపై మంత్రులకు సమాచారం ఇచ్చి సలహాలు తీసుకోండి 12

అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

ఆస్తి పన్నుపై 5% రాయితీ

ఎర్లీబర్డ్‌తో ఏప్రిల్ 30 దాకా అవకాశం 13

ఈ మూడు నెలలూ మంటలే!

పెరగనున్న పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు

సాధారణం కంటే అధికంగా వడగాడ్పులు

అనేకచోట్ల 45 డిగ్రీలు, కొన్నిచోట్ల అంతకు మించి.. హీట్‌వేవ్ జోన్‌లో ఏపీ, తెలంగాణ

వేసవి ఉపశమన ప్రణాళికలు అవసరం

ప్రజలను అప్రమత్తం చేయాలి: ఐఎండీ

రాష్ట్రంలో నేడు, రేపు వర్ష సూచన



విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే రెండు నెలల నుంచి ఎండలు, వడగాడ్పులకు దేశంలో అనేక ప్రాంతాలు అట్టుడికిపోతున్నాయి. ఇక రానున్న మూడు నెలల్లో కూడా ఎండ తీవ్రత, వడగాడ్పులు అంతకుమించి ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదుకానున్నట్లు పేర్కొంది. ముఖ్యంగా హీట్‌వేవ్ జోన్‌లో ఉన్న దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడతాయన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వేసవి నుంచి గట్టెక్కడానికి కేంద్ర, రాష్ట్రాల పరిధిలోని విపత్తుల నిర్వహణ సంస్థలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని భారత వాతావరణ శాఖ తొలిసారిగా సూచనలు చేసింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల వేసవి సీజన్‌కు

మిగతా 14వ పేజీలో...



ఎవ్వర్నీ వదలం

అన్ని దేశాలపైనా ప్రతీకార సుంకాలు

ట్రంప్ పునరుద్ఘాటన.. రేపటి నుంచే మోత

'మినహాయింపు'పై భారత్ ఆశలు

ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఉత్కంఠ

వాషింగ్టన్, మార్చి31: ప్రతీకార సుంకాల విషయంలో ఏ దేశానికీ మినహాయింపు లేదని, అన్ని దేశాలపై విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన ఏప్రిల్ 2 లిబరేషన్ డే నుంచి అన్ని దేశాలపై టారిఫ్‌లు విధించడం ఖాయమన్నారు. 10, 15 దేశాలపై మాత్రమే సుంకాలు విధిస్తారనే ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. అమెరికా పూర్వ వైభవం పొందాలంటే తమతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వాణిజ్యం జరిపే అన్ని దేశాలపై సుంకాలు విధించాల్సిందేనని, ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించారు. గతంలో ప్రధాని

మిగతా 10వ పేజీలో...

దైవదర్శనానికి వచ్చిన వివాహితపై

గ్యాంగ్ రేప్!

నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండపేటలోని ఆలయానికి అర్ధరాత్రి బంధువుతో కలిసి వచ్చిన మహిళ

ఆమెపై ఆలయ తాత్కాలిక ఉద్యోగి కన్ను.. మిత్రులకు మెసేజ్

బంధువును చెట్టుకు కట్టేసి మహిళపై ఏడుగురి అత్యాచారం

అదుపులో నిందితులు.. బాధితురాలికి వైద్య పరీక్షలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న నాగర్‌కర్నూలు ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్/ఊర్కొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తనపై గుర్తుతెలియని ఏడుగురు సామూహిక అత్యాచారం జరిపినట్లు ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితకు ముగ్గురు పిల్లలు. భర్తతో విభేదాల కారణంగా కొన్నాళ్లుగా అతడికి దూరంగా ఉంటోంది. శనివారం రాత్రి 11 గంటలకు తన బంధువుతో

మిగతా 3వ పేజీలో...



12

ఔటర్‌పై టోల్ పెంపు

కి.మీ.కు 4-5% పెంచుతూ నిర్ణయం

సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి

హైదరాబాద్-బెజవాడ హైవేపై తగ్గింపు

రూ. 10 నుంచి 60 వరకు తగ్గిన ధర

ఎన్వీఎస్ రెడ్డికి మళ్లీ చాన్స్? 3

మెట్రో రెండో దశ ప్రాజెక్టు నేపథ్యంలో హెచ్ఎంఆర్‌లో కొనసాగించే యోచన

సెప్టెంబరులో మోదీ రిటైర్మెంట్!!

» ఆయన టైం అయిపోయింది: సంజయ్ రౌత్



నాగపూర్/ముంబై, మార్చి 31: ప్రధాని మోదీ సెప్టెంబర్లో పదవీవిరమణ చేయనున్నారని ఉద్ధవ్ శివసేన సీనియర్ నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సంఘ్ పరివార్ దేశంలో నాయకత్వ మార్పు కోరుకుంటోందని.. రిటైర్మెంట్ ప్రణాళికలు, తన వారసుడెవరో చర్చించడానికే మోదీ ఉగాదినాడు నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించారని సోమవారం ముంబైలో విలేకరులతో అన్నారు. 75 ఏళ్ల వయసు దాటిన బీజేపీ నేతలు పదవీ విరమణ చేస్తున్నారని.. సెప్టెంబర్లో మోదీకి కూడా 75 ఏళ్లు వస్తాయని గుర్తుచేశారు. గత 10-11 ఏళ్లలో ఆయన ఇక్కడకు రాలేదని.. ఇప్పుడు సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్‌కు టాటా, బైబై చెప్పడానికే వచ్చారని వ్యాఖ్యానించారు. 'మోదీ టైం అయిపోయింది. ఆయన వారసుడు మహారాష్ట్ర నుంచే ఉంటారు' అని రౌత్ తెలిపారు. అయితే, రౌత్ వ్యాఖ్యలను మహారాష్ట్ర సీఎం, బీజేపీ సీనియర్ నేత ఫడణవీస్ తోసిపుచ్చారు. 2029లోనూ ప్రధాని మోదీయేనన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు బిషప్‌ల సంఘం మద్దతు

న్యూఢిల్లీ, మార్చి 31: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ చట్టం సవరణలకు సోమవారం కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా (సీబీసీఐ) మద్దతు తెలిపింది. ఈ విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించి రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని అన్ని పార్టీలను కోరింది. వక్ఫ్ బిల్లు ఆమోదం పొందేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో క్రైస్తవ సంఘం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకొంది. ప్రస్తుత చట్టంలోని నిబంధనలను ఉపయోగించుకొని కేరళ వక్ఫ్‌బోర్డు మునాంబాం ప్రాంతంలోని 600కుపైగా కుటుంబాల ఇళ్లను వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిందని తెలిపింది. తరాలుగా నివసిస్తున్న వారి ఇళ్లను వక్ఫ్ ఆస్తిగా ప్రకటించడంపై మూడేళ్లుగా న్యాయపోరాటం కొనసాగుతోందని పేర్కొంది. ఇలాంటి వివాదాల పరిష్కారానికి చట్ట సవరణే ఏకైక మార్గమని అభిప్రాయపడింది.

త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు!

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

రాచరిక పాలన కోసం నేపాల్‌లో ఆందోళనలు

ఖట్మాండూ, మార్చి 31: రాచరికాన్ని పునరుద్ధరించాలని, తమ రాజు జ్ఞానేంద్ర షా తిరిగి రావాలని కోరుతూ నేపాల్ ప్రజలు కొన్నిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. రాజధాని ఖట్మాండూ వీధుల్లో వేలాది మంది రోడ్లపైకి వస్తున్నారు. కొన్నేళ్లుగా దేశంలో కొనసాగుతున్న రాజకీయ అస్థిర పరిస్థితులతో విసిగిపోయామని, తమకు మిగిలివున్న ఆప్షన్ 'రాజు తిరిగి రావడమే..' అని ఆందోళనకారులు నినదిస్తున్నారు. నేపాల్‌లో దాదాపు రెండున్నర శతాబ్దాల పాటు కొనసాగిన రాచరిక పాలన 2008లో అంతమై.. ప్రజాస్వామ్య పాలన మొదలైంది. అనంతరం కాలంలో రాజకీయ అస్థిరత కారణంగా అనేక ప్రభుత్వాలు మారాయి. రాజు జ్ఞానేంద్ర దిగిపోయిన తర్వాత ప్రజలు 17 ఏళ్లలో 13 ప్రభుత్వాలను చూశారు. సంస్కరణలను అమలు చేయడానికి లేదా స్పష్టమైన దార్శనికత చూపేందుకు ఏ ప్రభుత్వం కూడా పదవీ కాలం చివరి వరకు కొనసాగలేదు. అవినీతి కుంభకోణాలు ఎక్కువయ్యాయి.

బాలుడి నిర్లక్ష్య డ్రైవింగ్‌తో రెండేళ్ల చిన్నారి మృతి

న్యూఢిల్లీ, మార్చి 31: ఢిల్లీలో ఓ మైనర్ నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా రెండేళ్ల చిన్నారి మృత్యువాత పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పహర్‌గంజ్ ప్రాంతంలో ఓ చిన్నారి ఇంటి బయట వీధిలో ఆడుకుంటోంది. ఆ సమయంలో 15 ఏళ్ల బాలుడు కారు నడుపుతూ అటుగా వచ్చాడు. చిన్నారికి ఓ మీటరు దూరంలో కారును ఆపేసి అందులోనే ఉన్నాడు. అయితే మళ్లీ కారు చిన్నగా కదులుగా చిన్నారి వైపునకు దూసుకొచ్చింది. దాంతో చిన్నారి కారు చక్రాల కింద పడి తీవ్ర గాయాలపాలై చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి, ఆ మైనర్ తండ్రిని అదుపులోకి తీసుకున్నారు.

19 నుంచి శ్రీనగర్‌కు వందేభారత్ రైలు

న్యూఢిల్లీ, మార్చి 31: కశ్మీర్‌లోయలో పొడవైన సొరంగాలు, ఎత్తయిన బ్రిడ్జిలు, సొగసైన ప్రకృతి అందాల మధ్య రయ్..మని దూసుకుపోవడానికి వందే భారత్ రైళ్లు సిద్ధమవుతున్నాయి. కశ్మీర్‌ను నేరుగా దేశంలోని ఇతర రైల్వే లైన్లతో కలపడానికి రెడీ అవుతున్నాయి. ఉధంపూర్-కశ్మీర్-బారాముల్లా మధ్య 272 కి.మీ. రైల్ లింక్ ప్రాజెక్టు పూర్తయిన నేపథ్యంలో జమ్మూ-కత్రా-శ్రీనగర్ మధ్య వందే భారత్ రైలును నడపాలని నిర్ణయించారు. ఈనెల 19న ప్రధాని మోదీ కాత్రాలో ఆ రైలును ప్రారంభించనున్నారు. ప్రస్తుతం జమ్మూ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్న కారణంగా తొలుత కత్రా నుంచి ఈ రైలు సేవలు మొదలుకానున్నాయి. వందే భారత్ ప్రారంభమైతే కశ్మీర్‌కు నేరుగా రైలును నడపాలన్న డిమాండ్‌ను నెరవేర్చినట్లు అవుతుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో 119 కి.మీ. పొడవైన మొత్తం 38 సొరంగాలు ఉండగా, అందులో 12.75 కి.మీ. పొడవుండే టి-49 అనే సొరంగం దేశంలోనే అత్యంత పొడవైనదని తెలిపారు. అలాగే ఈ ప్రాజెక్టులో 927 బ్రిడ్జిలు ఉండగా.. వీటి మొత్తం పొడవు 13 కి.మీ.లు అని అధికారులు చెప్పారు. వీటిలో ప్రపంచంలోనే ఎత్తయిన చీనాబ్ రైల్వే ఆర్చి బ్రిడ్జి కూడా ఉందని అన్నారు.

బంగాళాఖాతానికి మేమే సంరక్షకులం: యూనస్

న్యూఢిల్లీ, మార్చి 31: "ఈశాన్య రాష్ట్రాలకు సముద్ర మార్గమే లేదు. బంగ్లాదేశే వాటికి సముద్ర మార్గాన్ని అందిస్తోంది. బంగాళాఖాతానికి మేమే ఏకైక సంరక్షకులం. బంగ్లాదేశ్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా చైనా తన వ్యాపారాన్ని విస్తరించుకోవచ్చు" అని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానమంత్రి మహ్మద్ యూనస్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. యూనస్ ఇటీవల చైనాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యూనస్ తన పర్యటనలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా సమావేశమయ్యారు. తీస్తా నదీ జలాల నిర్వహణ కోసం 50 సంవత్సరాల మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని జిన్‌పింగ్‌ను కోరారు.

రుణం ఇవ్వలేదని ఆ బ్యాంకుకే కన్నం

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రుణం అడిగితే ఇవ్వలేదన్న కక్షతో బ్యాంకుకే కన్నం వేశాడు ఓ దుండగుడు. ముఠాను ఏర్పాటు చేసుకుని, రూ.కోట్ల విలువైన బంగారాన్ని అపహరించాడు. పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. దక్షిణ భారతదేశంలో సంచలనం రేపిన దావణగెరె జిల్లాలోని న్యామతి పట్టణంలోని ఎస్‌బీఐ శాఖలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12.95 కోట్ల విలువైన 17.750 కిలోల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రధాన నిందితుడు విజయకుమార్ తమిళనాడు వాసి. సోదరుడు అజయకుమార్‌తో కలసి కొన్నేళ్ల క్రితం న్యామతికి వలస వచ్చాడు. రుణం కోసం అతడు స్థానిక ఎస్‌బీఐ శాఖకు వెళ్లగా అధికారులు తిరస్కరించారు. దీంతో విజయకుమార్ తన తమ్ముడు అజయకుమార్, బావమరిది పరమానంద, న్యామతికే చెందిన చంద్రు, హొణ్ణాళికి చెందిన మంజునాథ్, అభిషేక్‌తో కలిసి పథకం వేశాడు. వారు 2024, అక్టోబరు 26న రాత్రి బ్యాంకు లాకర్లలోని 17.750 కేజీల బంగారాన్ని అపహరించారు. ఆ బంగారాన్ని తమిళనాడు మధురైలోని ఓ తోటలో పాడుపడిన బావిలో దాచారు. అయితే, పోలీసుల దర్యాప్తులో నిజం వెల్లడైంది. విజయకుమార్ ఇచ్చిన సమాచారంతో బావిలో దాచిన బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మయన్మార్‌పై మరో పిడుగు!

» నేటి నుంచి భారీ వర్షాలు

» భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ఇక్కట్లే

» సహాయక చర్యలకూ ఆటంకాలు

నేపిదా(మయన్మార్), మార్చి 31: భూప్రకోపానికి గురైన మయన్మార్‌పై ఇప్పుడు మరో పిడుగు పడనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.. బంగాళాఖాతంలో గల్ఫ్ ఆఫ్ మర్తబాన్‌కు సమీపంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా.. ఏప్రిల్ 1 నుంచి మయన్మార్ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. ఇప్పటికే భూకంపం ప్రభావం దేశవ్యాప్తంగా ఉండడం.. 60-70% ఇళ్లు, ఆస్పత్రులు, ప్రార్థన మందిరాలు, మఠాలు దెబ్బతినగా.. పునరావాస కేంద్రాలు లేక.. పౌరులు ఆరుబయటే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తే.. భూకంప బాధితుల పరిస్థితి గోరుచుట్టుపై రోకటిపోటుగా మారే ప్రమాదముందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సహాయక చర్యలకు కూడా భారీ వర్షాలు ఆటంకంగా మారే ప్రమాదముంది. భూకంప ప్రభావిత ప్రాంతాలైన ముయి, ఖోట్సాంగ్ మినహా.. సికాయ్, మాంటాలే, నాంగ్, పఖో, షామ్ ప్రావిన్సుల్లో సోమవారం సాయంత్రం నుంచే వర్షాల ప్రభావం మొదలైందని మయన్మార్ విపత్తు నిర్వహణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఏప్రిల్ 4-6 తేదీల్లోనూ మరో అల్పపీడన సూచన ఉందని, అప్పుడు గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్ నుంచి గల్ఫ్ ఆఫ్ మర్తబాన్ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలుంటాయని మయన్మార్ వాతావరణ విభాగం అధికారి ఓవెన్ నై హెచ్చరించారు.

సహాయానికి.. మిలటరీ అడ్డంకులు

భూకంప విధ్వంసం కవరేజీకి వచ్చే అంతర్జాతీయ మీడియాను నిషేధిస్తూ మయన్మార్ మిలటరీ సర్కారు(సైనిక మండలి) ప్రతినిధి జనరల్ ఝూవో మ్యుంగ్‌థాంగ్ ఉత్తర్వులు జారీ జారీచేశారు. పలు అంతర్జాతీయ మీడియా సంస్థల నుంచి మిలటరీ ప్రభుత్వానికి అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. విదేశీ మీడియా ప్రతినిధులకు ప్రస్తుతం సౌకర్యవంతమైన వసతులు లేవని, దాంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. కాగా.. రెండు వారాల కాల్పుల విరమణను ప్రకటించిన మిలటరీ సర్కారు.. రెబల్స్ ప్రాంతాల్లో వైమానిక దాడులను యథావిధిగా కొనసాగిస్తోంది. హెలికాప్టర్లు, డ్రోన్లతో జరిపిన దాడుల్లో పదుల సంఖ్యలో రెబల్స్ చనిపోయారని థాయ్‌లాండ్ కేంద్రంగా పనిచేస్తున్న మయన్మార్ మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. ఆస్పత్రులన్నీ భూకంప బాధితులతో నిండిపోగా.. మిలటరీ సర్కారు ఆంక్షలను విధిస్తోందని.. ఈ విధానం సరికాదంటూ ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆగ్రహం వ్యక్తం చేసింది. సహాయక బృందాలను అడ్డుకోవొద్దని కోరింది.



సైవిల్లా భవన శిథిలాల నుంచి గర్భిణిని కాపాడుతున్న సహాయక బృందాలు

మసీదుల్లో 700 మంది మృతి

భూకంపం సంభవించిన రోజు రంజాన్ మాసంలో చివరి శుక్రవారం(జుమాతుల్‌విదా) కావడంతో ముస్లింలు పెద్ద సంఖ్యలో మసీదులకు వెళ్లారు. భూకంపం కారణంగా దేశంలోని 60కి పైగా మసీదులు కూలిపోగా.. వాటిల్లో ప్రార్థనలు చేస్తున్న 700 మంది మృతిచెందినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒక్క రఖై మసీదులోనే 59 మంది మృతిచెందారని తెలిపింది.

మృత్యువుతో గర్భిణి పోరాటం

సైవిల్లాలో భూకంప శిథిలాల కింద చిక్కుకున్న 29 ఏళ్ల ఓ గర్భిణి.. 12 గంటల పాటు మృత్యువుతో పోరాడింది. చైనా రెస్క్యూ బృందాలు ఈ ప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టగా.. శనివారం రాత్రి ఆ గర్భిణి మూలుగు వినిపించడంతో జాగ్రత్తగా స్లాబును కట్ చేసి, ఆమెను కాపాడారు. మాండలేలోని 'గ్రేట్‌వాల్' హోటల్‌లో మరో గర్భిణిని మయన్మార్ అగ్నిమాపకశాఖ కాపాడింది. మరోవైపు, మాండలే సమీపంలోని బంగారు గనిలో 27 మృతదేహాలను వెలికి తీశామని పియర్స్ టౌన్‌షిప్ మిలటరీ కౌన్సిల్ అధికారులు చెప్పారు. భూకంప మరణాల సంఖ్య 3,034కు చేరుకుందని, థాయ్‌లాండ్ కేంద్రంగా పనిచేస్తున్న డెమోక్రాటిక్ వాయిస్ ఆఫ్ బర్మీస్(డీవీబీ) వెల్లడించింది.

ముగ్గురు మనవరాళ్లను కాపాడిన బామ్మ

మాండలేలోని 11అంతస్తుల సైవిల్లా భవనం ఆరో అంతస్తులో 75 ఏళ్ల వయసున్న ఓ బామ్మ తన కొడుకు, కోడలు, ముగ్గురు మనవరాళ్లతో ఉంటోంది. శుక్రవారం నాటి భూకంపంతో ఆ భవనం కుప్పకూలిపోయింది. ఆ సమయంలో బామ్మ, ఆమె మనవరాళ్లు మాత్రమే ఫ్లాట్‌లో ఉన్నారు. శిథిలాలు మీదపడి రక్తపు గాయాలైనా.. ఆ బామ్మ భయపడలేదు. బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఓ సుత్తి ఆమె చేతికి దొరికింది. దాన్ని మనవరాళ్లకు ఇచ్చి, గోడలను పగులగొట్టి.. బయటపడాలని సూచించింది. ఆ మనవరాళ్లు కష్టపడి ఓ రంధ్రం చేసి, బయటకు రాగలిగారు. అయితే.. ఆ రంధ్రం చిన్నదిగా ఉండడంతో బామ్మ మాత్రం బయటకు రాలేకపోయారు. అంతలో తదనంతర ప్రకంపనలతో శిథిలాలు మరింత కుంగాయి. అయితే.. బయటకు వచ్చిన ముగ్గురు మనవరాళ్లు సోమవారం రెస్క్యూ బృందాలను వెంట తీసుకొచ్చి, తమ బామ్మను కాపాడుకున్నారు.

బాంబులేస్తారా.. మేమూ తడాఖా చూపిస్తాం

» భూగర్భ కేంద్రాల వద్ద లాంచ్‌ప్యాడ్స్‌పై క్షిపణులను సర్వసన్నద్ధం చేశాం


» ట్రంప్‌కు ఖమేనీ ఘాటు హెచ్చరిక

న్యూఢిల్లీ, మార్చి 31: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఇరాన్ ఘాటు హెచ్చరిక చేసింది. అణు ఒప్పందానికి ఇరాన్ దిగిరాకుంటే బాంబుల మోత మోగిస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలను ఖండిస్తూనే.. ఏం జరిగినా ఎదురుదాడి చేసేందుకు, తమ తడాఖా చూపించేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. "అణు ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే బాంబు దాడులు చేస్తాం. ఈ దాడులు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఉంటాయి." అని అమెరికా అధ్యక్షుడు ఆదివారం హెచ్చరించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఇరాన్ కూడా అంతే తీవ్రంగా స్పందించింది. "అయితే... మేం కూడా సిద్ధంగా ఉన్నాం. మా తడాఖా చూపిస్తాం. ఎదురుదాడులు చేస్తాం. అమెరికా బాంబులు వేస్తే చూస్తూ చేతులు ముడుచుకుని కూర్చోం. అన్ని భూగర్భ కేంద్రాల వద్ద లాంచ్ ప్యాడ్‌లపై క్షిపణులను సర్వసన్నద్ధం చేశాం. ప్రపంచ వ్యాప్తంగా అమెరికాతో సంబంధం ఉన్న ఏ ఒక్క ప్రాంతాన్నీ వదిలి పెట్టబోం" అని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ వ్యాఖ్యానించినట్టు ఇరాన్ మీడియా 'టెహ్రాన్ టైమ్స్' పేర్కొంది.



అమెరికా కాలు దువ్వితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఖమేనీ హెచ్చరించినట్లు తెలిపింది. "ఎలాంటి వైమానిక దాడులనైనా తిప్పికొడతాం. అమెరికాతో సంబంధం ఉన్న ఏ ఒక్క ప్రాంతాన్నీ వదిలిపెట్టేది లేదు" అని ఖమేనీ అన్నట్టు 'టెహ్రాన్ టైమ్స్' వెల్లడించింది. మరోవైపు, అణు ఒప్పందంపై అమెరికాతో నేరుగా చర్చించేందుకు ఇరాన్ నూతన అధ్యక్షుడు పెజెష్కియాన్ విముఖత వ్యక్తం చేశారు. అయితే, ఒమన్ ద్వారా మధ్యవర్తిత్వ చర్చలు మాత్రం కొనసాగుతాయని ఆయన సంకేతాలు ఇచ్చారు.

లోకం తీరు



30 లక్షల మంది అఫ్గాన్‌లను బహిష్కరించనున్న పాక్

» గౌరవప్రదంగా తిప్పి పంపాలని తాలిబాన్ సర్కార్ డిమాండ్

పెషావర్, మార్చి 31: తాలిబాన్లు అధికారంలోకి రావడాన్ని అంగీకరించక పొరుగుదేశమైన పాకిస్థాన్‌కు వలసవచ్చిన అఫ్గానిస్థాన్ వాసులకు కష్టకాలం ఎదురయింది. వారిని తమ దేశం నుంచి బహిష్కరించాలని పాకిస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది. పాకిస్థాన్‌లోని వివిధ ప్రాంతాల్లో తలదాచుకుంటున్న దాదాపు 30 లక్షల మంది అఫ్గాన్‌లను బలవంతంగా తిప్పిపంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. స్వస్థలాలకు స్వచ్ఛందంగా వెళ్లిపోయేందుకు ఇచ్చిన గడువు సోమవారం ముగియడంతో అరెస్టులు, బలవంతంగా పంపివేయడం వంటి చర్యలకు దిగనుంది. రంజాన్ సెలవులు ముగిసిన వెంటనే ఏప్రిల్ పదో తేదీ నుంచి కార్యాచరణ చేపట్టనుంది. ఈ చర్యను ఐక్యరాజ్యసమితితో పాటు, మానవ హక్కుల సంఘాలు, అఫ్గాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఖండించాయి. 2021లో అఫ్గానిస్థాన్‌ను తాలిబాన్లు చేజిక్కించుకోవడంతో లక్షలాది మంది పాకిస్థాన్ వచ్చి ఆశ్రయం పొందారు. ఇది స్థానికులకు ఇబ్బందికరంగా మారడంతో వారిని తిప్పిపంపించి వేయాలని పాకిస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది. అక్రమంగా ఉంటున్న విదేశీయులను బహిష్కరిస్తామంటూ 2023 అక్టోబరు నుంచి కార్యాచరణ ప్రారంభించింది. గత 18 నెలల్లో 8.45 లక్షల మంది అఫ్గాన్లు తిరిగి వెళ్లిపోయారని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ షో అనే సంస్థ తెలిపింది. ఇంకా 30 లక్షల మంది ఉన్నారని పాక్ ప్రభుత్వం చెబుతోంది. అయితే, అఫ్గాన్లను బహిష్కరించాలని పాకిస్థాన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకొందని తాలిబన్ సర్కారు విమర్శించింది. "పరస్పర అంగీకారంతో ఒక వ్యవస్థ ద్వారా శరణార్థులను గౌరవప్రదంగా పంపంచాలని పాకిస్థాన్‌ను కోరాం" అని శరణార్థుల శాఖ అధికార ప్రతినిధి ముతాలిబ్ హక్కానీ చెప్పారు.

రష్యాకు కీలక రక్షణ పరికరాలు

» హెచ్‌ఏఎల్ ద్వారా చేరాయన్న న్యూయార్క్ టైమ్స్

» ఖండించిన భారత విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ, మార్చి 31: రష్యాకు ఆయుధాలు సరఫరా చేసే ఓ నిషేధిత సంస్థకు భారతకు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) కీలకమైన రక్షణ పరికరాలను విక్రయించిందన్న న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని భారత విదేశాంగ శాఖ(ఎంఈఏ) సోమవారం తీవ్రంగా ఖండించింది. హెచ్ఏఎల్ అన్ని అంతర్జాతీయ నిబంధనలను పాటిస్తుందని వివరించింది. అంతేగాక కఠినమైన భారత చట్టాలు, నియంత్రణలను ఏ భారత కంపెనీ అయినా తప్పనిసరిగా పాటించాలని తెలిపింది. ఇలాంటి కథనాలు ప్రచురించే ముందు ఆ విషయాన్ని తెలుసుకోవాలని, కాని న్యూయార్క్ టైమ్స్ అవేవీ పట్టించుకోలేదని పేర్కొంది. న్యూయార్క్ టైమ్స్ మార్చి 28న ఈ కథనం ప్రచురించింది. బ్రిటీషు వైమానిక ఉత్పత్తుల సంస్థ హెచ్ఆర్ స్మిత్ గ్రూపు సంస్థ 2 మిలియన్ డాలర్ల విలువైన ట్రాన్స్‌విటర్లు, కాక్‌పిట్ పరికరాలు తదితర కీలక రక్షణ పరికరాలను హెచ్ఏఎల్‌కు సరఫరా చేసిందని అందులో తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో వాటిపై నిషేధం ఉందని అయితే.. అమెరికా, బ్రిటన్ నిషేధించిన రష్యన్ ఆయుధ తయారీ సంస్థ రొసొబొరొనెక్స్‌పోర్ట్‌కు హెచ్‌ఏల్ వాటిని సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. కాగా హెచ్ఆర్ స్మిత్ న్యాయవాది నిక్ వాట్సన్ న్యూయార్క్ టైమ్స్‌తో మాట్లాడుతూ.. తమ సంస్థ విక్రయాలు చట్టబద్ధమైనవని చెప్పారు. తమ సంస్థ భారత్‌కు సరఫరా చేసిన పరికరాలు సైనిక కార్యకలాపాలకు పనికిరావని చెప్పారు.

వేతనజీవులకు పన్ను ఉపశమనం

(మొదటిపేజీ తరువాయి)

మొత్తంగా రూ.12.75 లక్షల వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. కొత్త పన్ను విధానంలో శ్లాబులను కూడా సవరించారు. ఈ ప్రకటనలు వేతన జీవులకు భారీ ఊరటను కల్పించాయి. కొత్త పన్ను విధానంలో సెక్షన్ 87ఏ కింద లభించే పన్ను రిబేటును రూ.25 వేల నుంచి రూ.60 వేలకు పెంచారు. ఏప్రిల్ 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి.

టీడీఎస్, టీసీఎస్‌ల్లో మార్పులు..

బ్యాంకు ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను చెల్లించేవారికి ఊరట కల్పిస్తూ ఏప్రిల్ 1 నుంచి టీడీఎస్ పరిమితిని ప్రభుత్వం పెంచింది. సీనియర్ సిటిజన్లకు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ వర్తింపు పరిమితి రూ.లక్షకు పెరగనుంది. దీంతో వార్షిక వడ్డీ ఆదాయం రూ.లక్ష దాటితే టీడీఎస్ వర్తిస్తుంది. 60 ఏళ్ల లోపు వారికి రూ.40 వేల నుంచి రూ.50వేలకు పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) పరిమితి కూడా పెరగనుంది. ఇది విదేశీ ప్రయాణాలు, పెట్టుబడులు, ఇతర లావాదేవీలను ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం రూ.7 లక్షలకు పైగా విదేశాలకు పంపే సొమ్ము పై ఏ అవసరం కోసం పంపుతున్నారన్న ఆధారంగా 0.5 శాతం నుంచి 20 శాతం వరకు టీసీఎస్ చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ నుంచి ఈ పరిమితి రూ.10 లక్షలకు పెరగనుంది.

నూతన పెన్షన్ స్కీమ్..



పాత పెన్షన్ స్కీమ్ స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమల్లోకి రానుంది. ఇది దాదాపు 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులను ప్రభావితం చేయనుంది. కనీసం 25 ఏళ్ల సర్వీసు ఉన్న ఉద్యోగులు చివరి 12 నెలల సగటు బేసిక్ వేతనంలో 50 శాతానికి సమానంగా పెన్షన్‌ను పొందడానికి అవకాశం ఉంటుంది.

వినియోగంలోలేని నంబర్లకు యూపీఐ సేవల నిలిపివేత

యూపీఐ లావాదేవీలకు కొత్త భద్రతా చర్యలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అమల్లోకి తెస్తోంది. ఇందులో భాగంగా వినియోగంలోలేని నంబర్లకు అనుసంధానమైన యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఫోన్ నంబర్లు చాలా కాలం పాటు పని చేయకుండా ఇనాక్టివ్‌గా ఉంటే వాటికి అనుసంధానంగా ఉన్న గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్స్ సేవలు రద్దు కానున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇవి అమల్లోకి వస్తుంది. ఇనాక్టివ్ ఫోన్ నంబర్లతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇనాక్టివ్ నంబర్లను బ్యాంకులు, థర్డ్ పార్టీ యూపీఐ ప్రొవైడర్లయిన ఫోన్ పే, గూగుల్ పేలు తప్పనిసరిగా తొలగించాల్సి ఉంటుంది. యూపీఐ లైట్‌లోని బ్యాలెన్స్‌ను తిరిగి బ్యాంక్ ఖాతాకు బదిలీచేసుకునే సదుపాయం కూడా ఏప్రిల్ నుంచి అందుబాటులోకి వస్తుంది.

ఎన్‌పీఎస్ వాత్సల్యకు పన్ను ప్రయోజనాలు

పిల్లల భవిష్యత్తు దృష్ట్యా దీర్ఘకాలం పెట్టుబడి పెట్టే వారి కోసం తెచ్చిన ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం కింద 2025-2026 ఆర్థిక సంవత్సరంలో పన్ను మినహాయింపు పొందడానికి అవకాశం ఉంది. సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద రూ.50వేల పన్ను ప్రయోజనాలు కల్పించారు. పాత పన్ను విధానంలో పన్ను చెల్లించే వారు దీన్ని వినియోగించుకోవచ్చు. కొత్త పన్ను విధానంలో ఈ మినహాయింపు ఉండదు.

బ్యాంకుల్లో కనీస నిల్వ...

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ), కెనరా బ్యాంకు సహా ప్రధాన బ్యాంకులు ఏప్రిల్ 1 నుంచి ఖాతాల్లో కనీసంగా ఉండాల్సిన నిల్వను సవరించనున్నాయి. కస్టమర్లు తమ ఖాతాలో కనీస నిల్వను ఉంచని పక్షంలో అందుకు పెనాల్టీలను చెల్లించాల్సి ఉంటుంది.

వివాహ బంధంపై కత్తి!

వివాహేతర సంబంధాలు, క్షణికావేశంలో జీవిత భాగస్వాముల హత్యలు

» ఇలా భారత్‌లో ఏటా 275 మంది భర్తలు, 225 మంది భార్యల మరణాలు

» ఐక్యరాజ్య సమితి అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 31: భార్యాభర్తల మధ్య జగడాలు, గిల్లికజ్జాలు మామూలే. టీవీలో ప్రోగ్రామ్ చూడటం దగ్గర నుంచి రిమోట్ కంట్రోల్, మొబైల్ ఫోన్, సోషల్ మీడియా వరకు.. చిన్న పెద్ద విషయాలకు దంపతులు గొడవ పడుతూనే ఉంటాయి. కానీ, భార్యభర్తల మధ్య పొరపొచ్చాలు ఇటీవలికాలంలో అత్యంత అపాయకర వైషమ్యాలుగా రూపుదాల్చి.. చివరకు హత్యలకు సైతం దారితీస్తున్న తీరు తీవ్ర కలవరం కలిగిస్తోంది. వివాహ బంధం గతంలో ఎన్నడూ లేనంతగా నెత్తురోడటం ఈ రోజున ప్రపంచవ్యాప్త ధోరణిగా మారింది. అదీ అత్యంత దారుణంగా, క్రూరమైన పద్ధతుల్లో ఈ హత్యలు జరుగుతున్నాయి. ఈ ధోరణుల పట్ల ఐక్యరాజ్యసమితి సైతం ఆందోళన వెలిబుచ్చింది. భారతదేశంలో ఏటా 275 మంది భర్తలు, 225 మంది భార్యలు వేర్వేరు ఘటనల్లో జీవిత భాగస్వాముల చేతుల్లో హతమవుతున్నారని ఐరాస అధ్యయనం తేల్చింది. ప్రస్తుతం మన దేశ జనాభా 140 కోట్లు. ఇంత జనాభా ఉన్న చోట ఎన్నెన్నో నేరాలు జరుగుతుంటాయి. అందులో కొన్ని ఘటనలు ప్రత్యేకంగా ప్రజల దృష్టిని తమ వైపు తిప్పుకొంటాయి. ఈ జాబితాలో భార్యాభర్తల పరస్పర హత్యాకాండలు చేరడం భయాందోళనలకు గురి చేస్తున్నదని ఐరాస వ్యాఖ్యానించింది. ఐరాస నివేదికను అనుసరించి.. 2023లో ప్రపంచవ్యాప్తంగా యాభై వేలమంది మహిళలు, ఆడపిల్లలు కడతేరారు. ఇందులో 60% కేసుల్లో వారిని భర్తలు, సహచరులు లేక కుటుంబసభ్యులే హతమార్చారు. సహ భాగస్వామిని చంపిన తర్వాత మృతదేహాలను డ్రమ్ముల్లోనూ, ఫ్రిజ్‌ల్లోనూ, సూట్‌కేసుల్లోనూ, భూమి అడుగున, మంచం కింద దాచేస్తున్నారు. చాలా సందర్భాల్లో అవశేషాలను మాయం చేయడానికి మృతదేహాన్ని ముక్కలు చేసి ప్రెషర్ కుక్కర్‌లో ఉడికిస్తున్నారు. కత్తించిన శరీర భాగాలను సూట్‌కేసుల్లో సర్ది మారుమూల, నిర్మానుష్య ప్రదేశాల్లోనూ, నీటి కుంటల్లోనూ పడేస్తున్నారు. దీంతో మీడియా ఇటువంటి ఘటనలను రిపోర్టు చేయడం ఒక సవాల్‌గా మారిందని ఐరాస అధ్యయనం తెలిపింది. ఇటీవలి నేరాల నుంచి ఇటువంటి ఉదాహరణలు కొన్ని ప్రస్తావించింది. తాను ప్రేమించిన అనురాగ్ అనే వ్యక్తి కోసం, తాను పెళ్లాడిన దిలీప్‌ను ప్రగతి అనే యువతి చంపించింది. వారి పెళ్లి జరిగిన 15 రోజులకే ఈ హత్య జరిగింది. వివాహానంతర హిందూ క్రతువులో భాగంగా తనకు లభించిన నగదును సుపారీగా ఇచ్చి ప్రగతి ఈ ఘాతుకానికి పాల్పడింది. ఈ కేసును ఐరాస తన అధ్యయనంలో ప్రస్తావించింది.



ప్రతి 11 నిమిషాలకు ఒక మహిళ బలి

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మహిళల, ఆడపిల్లల హత్యల గురించి ఐక్యరాజ్యసమితి అనుబంధ డ్రగ్స్ అండ్ క్రైమ్ విభాగం ఒక అధ్యయనం జరిపింది. ఇందులో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ప్రతి 11 నిమిషాలకు ఒక మహిళ హత్యకు గురవుతున్నట్టు గుర్తించింది. సగటున రోజుకు 140 మంది యువతులు, ఆడపిల్లలు ఇలా తమ గృహాల్లో కడతేరుతున్నారు. ఇవి 2023 లెక్కలు. 2022లో ఇటువంటి కేసులు ఆఫ్రికాలో అధికంగా నమోదయ్యాయి. అయితే, ఏడాది తిరిగేటప్పటికి ఆఫ్రికాను ఆసియా రెండోస్థానానికి నెట్టివేయడం గమనార్హం. 58 శాతం హత్యా ఘటనలు వివాహ బంధంతో ముడిపడి ఉండగా, అందులో 42 శాతం ఘటనల్లో పురుషులే బాధితులుగా ఉన్నారు. స్త్రీల విషయంలో కనిపించే లింగ వివక్ష కోణం భారత్‌లో జరుగుతున్న నేరాల్లో పెద్దగా కనిపించడం లేదని ఐరాస వ్యాఖ్యానించింది.



తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎంఆర్ ఈఐఎస్) ప్రెసిడెంట్, వైస్ చైర్మన్ ఫహీం ఖురేషీ నివాసంలో విందుకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. చిత్రంలో ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, గడ్డం వంశీ, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తదితరులు

హెచ్‌సీఏ, ఎస్‌ఆర్‌హెచ్ వివాదం..
సీఎం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

గురి చేస్తోందని ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం ఆరోపించిన విషయం తెలిసిందే.! హెచ్‌సీఏ తీరు మారకపోతే.. హైదరాబాద్ నుంచి ఐపీఎల్ వేదికను మార్చుకుంటామని హెచ్చరించింది. దీంతో ఈ వివాదం ముదిరి.. సీఎం దృష్టికి వెళ్లింది. దీంతో.. ఆయన విచారణకు ఆదేశిస్తూ.. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని విచారణాధికారిగా నియమించారు. సమగ్ర విచారణ జరిపి, నివేదిక ఇవ్వాల్సిందిగా ఆయనను ఆదేశించారు. ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల కోసం ఎవరు ఇబ్బంది పెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూనిఫాం ఆఫీసర్లయినా, ఇతరులెవరైనా ఉపేక్షించేది లేదన్నారు. కాగా.. ఈ అంశంపై హెచ్‌సీఏ స్పందించింది. తాము కోటాకు మించి కాంప్లిమెంటరీ పాసులను ఎన్నడూ అడగలేదని పేర్కొంటూ.. సోమవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. "హెచ్‌సీఏ క్లబ్ సెక్రటరీలకు ఇచ్చే పాసులు సరిపోక.. మరికొన్ని పాసులను డబ్బులిచ్చి కొనుగోలు చేయడానికి అవకాశమివ్వాలని కోరాం. అందుకు ఎస్‌ఆర్‌హెచ్ అంగీకరించింది. ఆ తర్వాత ఇలా ఈమెయిల్స్‌ను లీక్ చేయడం పద్ధతికాదు" అని ఆ ప్రకటనలో వివరించింది. స్టేడియంలో సీట్ల మార్పు సమయంలో.. ఆరెంజ్ రంగు సీట్లకు అయ్యే వ్యయంలో రూ.10 కోట్ల వరకు సీఎస్ఆర్ నిధుల కింద అందజేస్తామని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు కమిటీ ముందు పేర్కొన్న ఎస్‌ఆర్‌హెచ్.. ఆ హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించింది. ఆ నిధులను అడిగితే.. స్టేడియానికి రంగులు వేయడానికి ఖర్చుచేశామని చెప్పిన ఎస్‌ఆర్‌హెచ్.. పనుల వివరాలు మాత్రం చెప్పడం లేదని వివరించింది. ఇప్పటికైనా ఈమెయిల్ రాయబారాలను కట్టిపెట్టి, సమస్య పరిష్కారానికి హెచ్‌సీఏ కార్యవర్గంతో చర్చించేందుకు ముందుకు రావాలని ఎస్‌ఆర్‌హెచ్‌ను కోరింది.

ఎన్వీఎస్ రెడ్డికి మళ్లీ ఛాన్స్?

- హెచ్ఎంఆర్‌లో కొనసాగించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్ సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మరికొంత కాలం పాటు హెచ్ఎంఆర్ సంస్థలో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కీలకంగా భావిస్తున్న రెండో దశ ప్రాజెక్టు నేపథ్యంలో ఆయన సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల సేవలను పునరుద్ధరించడంలో భాగంగా తాజాగా విడుదల చేసే నోటిఫికేషన్ ద్వారా ఎన్వీఎస్ రెడ్డికి చోటు కల్పించనున్నట్లు సమాచారం. ఆయనతోపాటు మరో ఏడుగురు మెట్రో చీఫ్ ప్రాజెక్టు ఆఫీసర్లు, సీనియర్ ఇంజనీర్లను కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. పదవీ విరమణ చేసి, కాంట్రాక్టుపై పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

మెట్రో రెండో దశ నేపథ్యంలో..

రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రెండో దశ ప్రాజెక్టును కీలకంగా భావిస్తోంది. ఓల్డ్‌సిటీ, ఎయిర్‌పోర్టు, ఫోర్త్‌సిటీ, నార్త్ సిటీ లాంటి ప్రాంతాలకు సైతం మెట్రో రైలును నడిపించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పార్ట్-ఏ కింద 5 కారిడార్లు, పార్ట్-బీ కింద 3 కారిడార్లను ప్రతిపాదించింది. కాగా, పార్ట్-ఏ లోని 5 కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌ను 5 నెలల క్రితం కేంద్రానికి పంపించారు. మరికొద్ది రోజుల్లోనే దీనికి అనుమతి లభించే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది. మోదీ సర్కార్ డీపీఆర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే పనులను త్వరగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించి కీలక విషయాలపై అవగాహన కలిగిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సేవలు తప్పనిసరి అని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్న తరుణంలో ఆయన సేవలను మరికొంతకాలం వినియోగించుకోనున్నట్లు తెలుస్తోంది.

5 లక్షల కొత్త రేషన్ కార్డులు

ఇప్పటి వరకు 1.26 లక్షల లబ్ధిదారుల ఎంపిక.. మరో 4.32 లక్షల అర్జీలపై అధికారుల కసరత్తు

- ఈ నెలలోనే కార్డుల పంపిణీ పూర్తయ్యే అవకాశం
- జాబితాలో పేరుంటే ఈ నెల నుంచే సన్న బియ్యం



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపిక క్రమంగా కొలిక్కి వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల నుంచి పేదలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తుండగా.. ఈ ఏప్రిల్‌తో లబ్ధిదారుల ఎంపిక, కార్డులజారీ ప్రక్రియ పూర్తయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవైపు ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తూనే.. మరోవైపు లబ్ధిదారుల లెక్క తేల్చే పనిలో పౌరసరఫరాల శాఖ నిమగ్నమైంది. అయితే కొత్త కార్డుల జారీ ప్రక్రియ కాస్త ఆలస్యమైనా.. లబ్ధిదారుల జాబితాలో పేర్లుంటే చాలు.. సన్న బియ్యం పంపిణీ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించటం ఆశావహులకు ఊరటనిచ్చింది.

రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన, ప్రజావాణి, మీ-సేవ కేంద్రాల్లో సుమారు 18 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో కూడా రేషన్‌కార్డులు లేనివారు వివరాలను వెల్లడించారు. కానీ, ఇప్పటి వరకు 1.26 లక్షల మంది లబ్ధిదారులను మాత్రమే అధికారులు ఎంపిక చేశారు. ఇంకా లక్షల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డునే ప్రాతిపదికగా తీసుకుంటున్న విషయం విదితమే. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి 'ఎల్వోసీ' (లెటర్ ఆఫ్ క్రెడిట్)కి దరఖాస్తు చేసుకోవాలన్నా, ఆస్పత్రి బిల్లులు సమర్పించి సీఎం రిలీఫ్ ఫండ్ పొందాలన్నా రేషన్‌కార్డు ఉండాల్సిందే. పెళ్లిళ్లు చేసుకొని వేరుగా కాపురాలు పెట్టిన పిల్లలు.. కుటుంబ సభ్యుల పేర్ల నమోదు, తీసివేతల కోసం పలు కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. దరఖాస్తులు లక్షల సంఖ్యలో రావటంతో వాటిని వడపోసి, అర్హత కలిగిన కుటుంబాలను ఎంపిక చేయటానికి జాప్యమవుతోంది. ఇప్పటి వరకు 1.26 లక్షల కుటుంబాలను ఎంపిక చేశారు. అయితే వీరికి కొత్త కార్డులు జారీ చేయలేదు. లబ్ధిదారుల జాబితాలో మాత్రం పేర్లున్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఈ 1.26 లక్షల కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ఇవికాకుండా మరో 4.32 లక్షల కుటుంబాలపై కసరత్తు చేస్తున్నారు. ఇవికాకుండా 1.50 లక్షల మంది ఒంటరి సభ్యుల దరఖాస్తులు వచ్చాయి. వీరిలో కొందరు పాత కార్డుల్లోకి వెళ్తారా..? కొత్తగా ఎంపిక చేసిన 1.26 లక్షల జాబితాలోకి వెళ్తారా..? 4.32 లక్షల కార్డుల్లోకి చేరుతారా..? అన్నది పూర్తిస్థాయి కసరత్తు తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. త్వరలోనే లెక్క తేలుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ కసరత్తు పూర్తయితే 5 లక్షల నుంచి ఐదున్నర లక్షల కుటుంబాల ఎంపిక పూర్తవుతుంది. కానీ దరఖాస్తుల సంఖ్యకు.. ఎంపిక చేసే లబ్ధిదారుల సంఖ్యకు పోల్చి చూస్తే చాలా తేడా ఉంది. సుమారు 10 లక్షల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు కొంతకాలంగా చెబుతూ వస్తున్నారు. కానీ ఇందులో 50 నుంచి 55 శాతం వరకే కార్డులు పంపిణీ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోవైపు మీ-సేవ కేంద్రాలతోపాటు, ప్రతి సోమవారం కలెక్టర్లు నిర్వహించే ప్రజావాణిలో ఇప్పటికీ దరఖాస్తులు వస్తున్నాయి. అయితే సమగ్ర కుల గణన సర్వేను ప్రాతిపదికగా తీసుకొని ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

టెండర్ దశలోనే కార్డుల ముద్రణ

కొత్త రేషన్ కార్డుల ముద్రణ ఇంకా ప్రారంభం కాలేదు. 'పీవీసీ క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డుల' ముద్రణ బాధ్యతలు అప్పగించటానికి ఈ నెల 11న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ టెండర్లు పిలిచింది. అదే రోజు నుంచి టెండరు బిడ్లు స్వీకరిస్తోంది. 17న ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించింది. టెండర్ల నమోదుకు ఈ నెల 25 వరకు గడువిచ్చి.. టెండర్లు స్వీకరించింది. ఈ ప్రక్రియ ఎప్పుడు ముగుస్తుందో..? లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడు పూర్తవుతుందో..? కార్డులు ఎప్పుడు జారీ చేస్తారో..? అని ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఈ నెల 30 నుంచి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ కోటా నుంచి సన్న బియ్యం వస్తాయా..? లేదా..? అని ఆశావహులు ఆందోళనకు గురవుతున్నారు. అయితే లబ్ధిదారుల జాబితాలో పేరుంటే చాలు.. సన్న బియ్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించటంతో ఆశావహులు ఊపిరి పీల్చుకున్నారు.

చెంప దెబ్బలు.. బూతు మాటలు

- బాలికను కొడుతూ దుర్భాషలాడిన ప్రిన్సిపాల్
- వీడియో వైరల్.. వికారాబాద్ పాఠశాలలో ఘటన



విద్యార్థినులను కొడుతున్న ప్రిన్సిపాల్

వికారాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని కొత్త గడీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల మరోసారి వార్తల్లోకెక్కింది. గత నెలలో ఈ బడి పై నుంచి ఓ బాలిక దూకిన ఘటనను మరువక ముందే.. తాజాగా పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులను బూతులు తిడుతూ కొట్టిన వీడియో వైరల్‌గా మారింది. ముగ్గురు విద్యార్థినులను తన గదిలోకి పిలిపించుకున్న ప్రిన్సిపాల్ సాయిలత.. 'మీరు బయటకు వెళ్లడానికి కారణమేంటి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము వెళ్లడం తప్పేనంటూ విద్యార్థినులు చెప్పే ప్రయత్నం చేస్తుండగా.. 'మీకు నోరెట్ల వస్తది..' అంటూ చేయి చేసుకున్నారు. ఓ విద్యార్థినిని పలుమార్లు చెంప దెబ్బలు కొట్టిన ప్రిన్సిపాల్.. ఆ బాలికపై నోరు పారేసుకున్నారు. విద్యార్థినులపై చేయి చేసు కోవడమే కాకుండా వారి తల్లిదండ్రులను కూడా తిట్టారు. కాగా, ప్రిన్సిపాల్ ఇలా చేయడం కొత్తేమీ కాదని విద్యార్థినులు చెబుతున్నారు. బడిలో టీచర్లు తమపై ఇష్టానుసారం చేయిచేసుకుంటున్నా.. బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారని వాపోతున్నారు. తమను దండించేందుకు ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా కర్రలు తెప్పించారని చెబుతున్నారు. ప్రిన్సిపాల్, కొందరు ఉపాధ్యాయుల తీరు వల్ల పాఠశాలలో ఉండాలంటేనే విద్యార్థినులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత నెలలో ఈ పాఠశాల భవనం పై నుంచి ఓ విద్యార్థిని కిందకు దూకింది. ఆ ఘటన తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్.. ప్రిన్సిపాల్‌ను మందలించారు. అయినా ప్రిన్సిపాల్, సిబ్బంది తీరు మారలేదు.



నడిరోడ్డుపై రేంజ్ రోవర్ కారు దగ్ధం

నార్కట్‌పల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై మంటలు అంటుకుని రేంజ్ రోవర్ కారు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారు కాలి బూడిద కాగా రూ.2 కోట్లకు పైగా ఆస్తినష్టం సంభవించినట్లు అంచనా. ఏపీలోని చిత్తూరు అన్నమయ్య జిల్లాకు చెందిన యలగచర్ల శివప్రసాద్, శివకుమార్ కాంట్రాక్టర్లు. వీరు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో స్థిరపడ్డారు. శివప్రసాద్, గోవర్ధన్, మేక వినోద్‌లు కలిసి సోమవారం రేంజ్ రోవర్ కారు (టీఎస్ 09 ఈజెడ్-9699)లో గుంటూరు జిల్లాలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొని హైదరాబాద్‌కు బయలుదేరారు. నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శివారు (ఆర్చి) వద్దకు చేరుకోగానే కారు బానెట్‌లో నుంచి పొగలు రావడంతో వెంటనే ముగ్గురు కిందకు దిగిపోయారు. ఆ వెంటనే గాలికి మంటలు చెలరేగి ఫైరింజన్ సిబ్బంది వచ్చేలోగా 30 నిమిషాల్లోపే కారు కాలి బూడిదైంది.

సీఎం సభకు జనం తరలింపుపై ఘర్షణ

- 15మందికి గాయాలు., పలు బైక్‌ల ధ్వంసం
- సూర్యాపేట జిల్లా కిష్టాపురంలో ఘటన

మేళ్లచెర్వు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్ సభకు జనం తరలింపుపై ఇద్దరు యువకుల మధ్య వాగ్వాదం ఇరువర్గాల ఘర్షణకు దారితీసింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఆదివారం సీఎం సభకు తన తండ్రే ఎక్కువ మందిని తరలించాడని చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన యువకుడు జమాన్‌సైదా, "కాదు.. మా మా నాన్నే ఎక్కువ మందిని తరలించాడు" అని అదే గ్రామానికి చెందిన సుల్తాన్ మధ్య ఆదివారం వాగ్వాదం జరిగింది. కొద్దిసేపటికి ఇది ఇరువర్గాల మధ్య ఘర్షణగా మారింది. ఘర్షణలో 15మందికి గాయాలయ్యాయి. ఆరుగురి ఇళ్లలోని గృహోపకరణాలు, ఐదు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని, పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉదయం 5.30 గంటలకే వీఐపీ బ్రేక్ దర్శనాలు

- వేసవి రద్దీ దృష్ట్యా ఏప్రిల్ 15 నుంచి జూన్ 30 వరకు సిఫార్సు లేఖలపై బ్రేక్ దర్శనాల రద్దు.. టీటీడీ నిర్ణయం

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాల సమయం మార్పుపై రానున్న శని, ఆదివారాల్లో టీటీడీ ట్రయల్ రన్ నిర్వహించనుంది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను మొదటి గంట అంటే ఉదయం 5.30 గంటలకు కేటాయించేవారు. అయితే రాత్రివేళల్లో కంపార్టుమెంట్లలో వేచిఉండే భక్తులకు ఉదయం త్వరితగతిన దర్శనం చేయించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో వీఐపీ బ్రేక్‌ను ఉదయం 10.30 గంటలకు మార్చారు. ఈ విధానంపై పలువురు వీఐపీల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఉదయం కల్యాణోత్సవం, ఉదయం టైంస్లాట్‌లు కలిగిన రూ.300 ప్రత్యేక దర్శనం, సర్వదర్శనం భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కారణాలతో వీఐపీ బ్రేక్‌ను తిరిగి పూర్వపుపద్ధతిలో వేకువజాము 5.30 గంటలకే ప్రారంభించాలని టీటీడీ నిర్ణయించింది. అలాగే వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎప్పటిలానే సిఫార్సు లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలను రద్దు చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 30వ తేదీ వరకు సిఫార్సులను రద్దు చేయనున్నట్టు తెలిసింది.

వృద్ధులకు ఆఫ్‌లైన్‌లోనూ శ్రీవారి దర్శన టోకెన్లు!

తిరుమల వేంకటేశ్వరుడి దర్శనం విషయంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు తొలగించేలా టీటీడీ నిర్ణయం తీసుకుంది. వీరికి జారీచేసే దర్శన టోకెన్లను ఆన్‌లైన్‌కు మాత్రమే పరిమితం చేసిన గత అధికారుల నిర్ణయాన్ని మారుస్తూ బోర్డు తాజాగా తీర్మానం చేసింది. పాత ఆఫ్‌లైన్ విధానాన్ని కూడా పునరుద్ధరించాలని నిర్ణయించింది.

కొడాలి నాని ఆరోగ్యం తీవ్ర ఆందోళనకరం!

- మూడు రక్త నాళాలు బ్లాక్ సర్జరీ చేయలేని పరిస్థితి
- హైదరాబాద్ ఏఐజీ నుంచి ముంబైకి తరలింపు



హైదరాబాద్ సిటీ/మచిలీపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆరోగ్య పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనను కుటుంబ సభ్యులు సోమవారం హైదరాబాద్ నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. కొడాలి నాని గ్యాస్ట్రిక్ (జీర్ణకోశ) సమస్యతో ఐదు రోజుల క్రితం ఏఐజీ ఆస్పత్రిలో చేరారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే మూడు రక్త నాళాలు చాలా వరకు బ్లాక్ అయ్యాయని వైద్యులు నిర్ధారించారు. సర్జరీ చేసేందుకు కొడాలి ఆరోగ్య పరిస్థితి సహకరించదని వైద్యులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. దీంతో... కొడాలి నానిని సోమవారం మెరుగైన చికిత్స కోసం బేగంపేట విమానాశ్రయం నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. సుప్రసిద్ధ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండా చైర్మన్‌గా ఉన్న ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో నానిని చేర్పించినట్లు తెలిసింది. డాక్టర్ పాండాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుంది. 2009లో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్‌కు కూడా ఆయనే శస్త్ర చికిత్స చేశారు.

ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

కాకినాడ ఓడరేవు నుంచి ఎగుమతి ప్రారంభం.. జెండా ఊపి ప్రారంభించిన మంత్రి ఉత్తమ్

- విదేశాలకు బియ్యం ఎగుమతి ఆరంభం మాత్రమేనని వ్యాఖ్య
- తొలి విడతగా 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం రవాణా



బియ్యం ఎగుమతులకు జెండా ఊపుతున్న తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్/ కాకినాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో తెలంగాణలోనే అత్యధికంగా వరి పండుతుందని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దీనికి గత వానాకాలంలో పండిన 153 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యమే నిదర్శనమని తెలిపారు. సముద్ర మార్గంలో ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం ఎగుమతిని ప్రారంభించడానికి సోమవారం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో కాకినాడకు చేరుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కాకినాడ నౌకాశ్రయంలో ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానికంగా రాష్ట్ర అవసరాలు తీర్చుకోవడంతోపాటు ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రానికి బియ్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దక్షిణ ఆగ్నేయాసియా, ఆఫ్రికా ఖండ దేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. ఆగ్నేయాసియాకు బియ్యం ఎగుమతి చేసే చారిత్రక ప్రక్రియ ప్రారంభమైందని.. తద్వారా ప్రపంచ బియ్యం ఎగుమతి మార్కెట్‌లోకి తెలంగాణ ప్రవేశించిందన్నారు. ఫిలిప్పీన్స్- తెలంగాణ ప్రభుత్వాల మధ్య పలు దఫాల సంప్రదింపుల తర్వాత లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం, ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎగుమతికి ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా తొలిసారి ఫిలిప్పీన్స్‌కు 12,500 మెట్రిక్ టన్నుల ఎంటీయూ-1010, ఐఆర్-64 రకాల బియ్యం.. కాకినాడ నుంచి ఎగుమతి చేస్తున్నామని, ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. 14 శాతం కంటే తక్కువ తేమ గల నాణ్యతా ప్రమాణాలతో కూడిన బియ్యం పంపుతున్నట్లు చెప్పారు. దీనివిలువ రూ.45 కోట్లు ఉంటుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పౌరసరఫరాల సంస్థ ద్వారా ఫిలిప్పీన్స్ పౌరసరఫరాల సంస్థకు బియ్యం ఎగుమతి చేస్తున్నామన్నారు. రాష్ట్ర రైతులకు మేలు చేయడానికే ప్రపంచ దేశాల్లో బియ్యం మార్కెట్ చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో ప్రతిఏటా ప్రతి పంట గతానికంటే ఎక్కువ దిగుబడి సాధించడానికి తమ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. ఈ వానా కాలం సీజన్‌లో రాష్ట్రంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తే, యాసంగిలో 122 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితోపాటు ఈ ఏడాది సుమారు 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

సీఎంఆర్ బిల్లుల మంజూరులో జాప్యం

రాష్ట్రం నుంచి కేంద్రానికి, ఎఫ్‌సీఐకి సరఫరా చేస్తున్న బియ్యం.. సీఎంఆర్ బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతుందని మంత్రి ఉత్తమ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం వడ్డీభారాన్ని మోయాల్సి వస్తున్నదని చెప్పారు.



ఎన్‌కౌంటర్ ప్రాంతంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, ఇతర సామగ్రి

దంతెవాడలో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు రేణుక మృతి

జనగామ, చర్ల, చింతూరు, అల్వాల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో బీజాపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దు అడవుల్లో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణకు చెందిన మహిళా మావోయిస్టు గుమ్మడవెల్లి రేణుక అలియాస్ భాను అలియాస్ చైతే అలియాస్ సరస్వతి అలియాస్ దమయంతి మృతి చెందారు. దివంగత కేంద్ర కమిటీ సభ్యుడు శాఖమూరి అప్పారావు భార్య, మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ సభ్యురాలైన రేణుకపై తెలంగాణలో రూ.20 లక్షలు, ఛత్తీస్‌గఢ్‌లో రూ.25 లక్షల రివార్డులు ఉన్నాయి. బీజాపూర్, దంతెవాడ సరిహద్దులోని ఇకేలీ బెలినార్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో బలగాలు సోమవారం కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య రెండు గంటల పాటు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో రేణుక మృతి చెందారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఇన్సాస్ రైఫిల్, పేలుడు పదార్థాలు, ల్యాప్‌టాప్, ఇతర వస్తువులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కాగా, గతవారం బీజాపూర్, దంతెవాడ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సారయ్య అలియాస్ సుధాకర్(తెలంగాణ) మృతి చెందిన సంగతి తెలిసిందే.

ఎల్ఎల్‌బీ చేసి మావోయిస్టుగా..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన రేణుక ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన తర్వాత 1996లో మావోయిస్టు పార్టీలో చేరారు. 2003లో డివిజన్ కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొందారు. 2020 నుంచి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా, రీజనల్ బ్యూరో ప్రెస్ టీమ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో వెలువడే పలు పత్రికలకు రేణుక సంపాదకురాలిగా వ్యవహరించారు. 2005లో కేంద్ర కమిటీ సభ్యుడు శాఖమూరి అప్పారావు అలియాస్ రవిని ఆమె పెళ్లి చేసుకున్నారు. 2010లో నల్లమల్ల అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అప్పారావు మరణించారు. రేణుక సోదరుడు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు జీవీకే ప్రసాద్ అలియాస్ సుఖ్‌దేవ్ అలియాస్ గుడ్సా ఉసెండి 2014లో తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. రేణుక తల్లిదండ్రులు గుమ్మడవెల్లి సోమయ్య- జయమ్మలు అల్వాల్ ప్రాంతం వెంకటాపురంలోని రామచంద్రయ్య కాలనీలో ఉంటున్నారు. రేణుక చనిపోయిన విషయం తెలుసుకున్న వారు కన్నీరుమున్నీరయ్యారు. మావోయిస్టు పార్టీలోకి వెళ్లినప్పటి నుంచి రేణుకతో తమకు సంబంధాలు లేవని తల్లిదండ్రులు చెప్పారు. కాగా, మంగళవారం ఉదయానికి రేణుక మృతదేహాన్ని ఆమె స్వగ్రామానికి తీసుకురానున్నారు. ఇందుకోసం ఆమె అన్న జీవీకే ప్రసాద్ ఛత్తీస్‌గఢ్‌కు చేరుకున్నారు.

దైవదర్శనానికి వచ్చిన వివాహితపై గ్యాంగ్ రేప్!

(మొదటి పేజీ తరువాయి)

కలిసి నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండపేట మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ దర్శనానికి వచ్చింది. ఇద్దరూ స్వామివారిని దర్శించుకొని సమీపంలోని ఓ చెట్టు కింద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఆ ఆలయ తాత్కాలిక ఉద్యోగి వీరిని చూసి.. తన స్నేహితులకు సమాచారమిచ్చాడు. కొద్దిసేపటికి ఓ ఆరుగురు అక్కడికొచ్చారు. ఆ ఉద్యోగి సహా ఏడుగురు మద్యం మత్తులో ఆ యువతి, ఆమెతో పాటు వచ్చిన బంధువుతో గొడవపడ్డారు. అనంతరం వివాహితతో వచ్చిన వ్యక్తిని చెట్టుకు కట్టేసి.. ఆమెను పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం జరిపారు. బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఘటనా స్థలాన్ని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పరిశీలించారు. నిందితులను ఊర్కొండపేటకు చెందిన మహేశ్ గౌడ్, మార్పాకుల ఆంజనేయులుగౌడ్, మట్ట ఆంజనేయులు గౌడ్, సాదిక్ బాబా, కౌకుంట్ల హరీశ్‌గౌడ్, వాగుల్దాస్ మణికంఠ గౌడ్, ఎల్లికట్టకు చెందిన కార్తీక్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రాత్రి వారిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు సమాచారం. మరో ఇద్దరు కూడా వీరికి సహకరించినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరి ఆచూకీ కూడా తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.

పత్తి రైతుపై విత్తన భారం!

- తాజాగా రూ.864 నుంచి 901కి పెరిగిన ధర

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులపై విత్తన భారం ఏటా పెరుగుతూనే ఉంది. అటు కేంద్రం నుంచి గానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ... నయా పైసా సబ్సిడీ లేకపోవడం, ప్రైవేటు విత్తన కంపెనీలు, డీలర్ల నుంచి కొనుగోలు చేయాల్సి రావడం.. రైతులకు శాపంగా మారింది. తాజాగా 2025-26 సంవత్సరానికి బీజీ-2 పత్తి విత్తన ప్యాకెట్ (475 గ్రాములు) ధరను రూ.901 గా నిర్ణయిస్తూ కేంద్ర వ్యవసాయశాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. గత ఏడాది(2024-25)ఒక ప్యాకెట్ ధర రూ.864 ఉండగా... ఈ ఏడాది రూ.37 అదనంగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2021-22 లో పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.767 ఉండగా, 2022-23లో రూ.810, 2023- 24లో రూ.853, 2024-25లో 864, ఈ ఏడాది రూ.901కి పెరిగింది. రాష్ట్రంలో ఏటా సగటున 50లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. ఎకరాకు కనీసం రెండు విత్తన ప్యాకెట్లు సరిపోయే అవకాశం ఉన్నా... రైతులు మూడు ప్యాకెట్ల చొప్పున వినియోగిస్తున్నారు. విత్తనాలు నాటిన తర్వాత వర్షాలు సకాలంలో పడకపోయినా, అధిక వర్షాలతో విత్తనాలు ముురిగిపోయినా, వరదనీటికి కొట్టుకుపోయినా... రెండోసారి పత్తి విత్తనాలు నాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో విత్తనాలకే రూ.2,706 నుంచి రూ.3,604 వరకు రైతులు ఖర్చు చేయాల్సి వస్తోంది.

విత్తన సబ్సిడీకి ఎదురుచూపులు

పత్తి విత్తనాల సరఫరాను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావాలని వ్యవసాయ రంగ నిపుణులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నా.. కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో విత్తనాభివృద్ధి సంస్థ క్రియాశీలకంగా పనిచేస్తోంది. ఆరు తడి పంటలు, పచ్చిరొట్ట, సోయాబీన్ విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. అదేతరహాలో పత్తి విత్తనాలను కూడా తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా పంపిణీ చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పొరుగు ప్రళయం

ప్రకృతి విపత్తుల ప్రియధాత్రి మయన్మార్! సుస్థిర ప్రజాస్వామ్య పాలనకు నోచుకోలేకపోతున్న దురదృష్ట దేశమది. ఈ రెండు వాస్తవాలూ, మయన్మార్ ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న దుస్థితికి నిలువెత్తు దర్పణాలు.

గత వందేళ్లలో మయన్మార్ 14 భూకంపాలను చవి చూసింది. వాటిలో కొన్ని గత శుక్రవారం నాటి భూ ప్రళయం లాంటివే. మయన్మార్ భౌగోళిక ఉనికి, భూభౌతిక వ్యవస్థ ఆ దేశాన్ని తరచు భూకంపాల తాకిడికి గురిచేస్తుంది. మార్చి 28 నాటి మహా ఉత్పాతం 1956 అనంతరం మయన్మార్‌ను కుదేలు చేసిన భూ కంపాలలో తీవ్రమైనది. భూమాత ఆగ్రహం వందలాది ప్రజల ప్రాణాలను హరించి వేసింది, భౌతిక ఆస్తులను, చారిత్రక కట్టడాలను ధ్వంసం చేసింది. ఆధ్యాత్మిక సంస్కృతికీ తీవ్ర విఘాతం కలిగించింది. భూకంప కేంద్రానికి చేరువలో ఉన్న మాండలే నగరంలో ప్రతి రెండో గృహమూ కూలి పోవడమో లేక తీవ్రంగా దెబ్బతినడమో జరిగింది. రిక్టర్ స్కేల్‌పై 7.7 పాయింట్ల తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం పొరుగుదేశం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌ను కూడా కుదిపివేసింది.

అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతూ రెండు కోట్ల మంది ప్రజలు దైనందిన మనుగడకు అంతర్జాతీయ మానవతాపూరిత సహాయ చర్యలపై ఆధారపడి ఉన్న క్లిష్ట సమయంలో మయన్మార్ ఈ పెను భూకంపానికి గురయింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని నాలుగేళ్ల క్రితం కూల్చివేసి అధికారాన్ని కైవసం చేసుకున్న సైనికాధికారుల దుర్మార్గ పాలనతో మయన్మార్ ఎడతెగని సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. సైనిక పాలకులను సాయుధంగా వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామ్య శక్తుల అధీనంలోని ప్రాంతాలను స్వాధీనం చేసుకునేందుకు సైనిక పాలకులు నిరంతర యుద్ధం చేస్తున్నారు. గత శుక్రవారం నాడు భూ ప్రళయం సంభవించిన మూడు గంటల వ్యవధిలోనే ప్రతిఘటనా శక్తుల నియంత్రణలోని ప్రాంతాలపై వైమానిక దాడులు నిర్వహించారు. ఆ దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గత నాలుగేళ్లుగా సైనిక పాలకుల చేతుల్లో హతమయి సమాధుల్లో ఉన్న వారి ఎముకలు సైతం సైనిక పాలకుల ఈ ప్రస్తుత దుర్మార్గానికి వణికిపోతున్నాయని ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

తొలుత కోవిడ్ విలయం, ఆ వెన్వెంటనే అంతర్యుద్ధం ప్రారంభమవడంతో మయన్మార్‌లో ప్రతి నలుగురిలో ఒకరు పేదరికంతో కునారిల్లుతున్నారు. దాదాపు నలభై లక్షల మంది అంతర్గత నిర్వాసితులుగా బతుకులు ఈడుస్తున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితిలో మయన్మార్ మరో భూ ప్రళయంతో మాటల్లో వర్ణించలేని దురవస్థల పాలయింది. 1948లో స్వాతంత్ర్యం పొందిన తరువాత అత్యధిక కాలం అధికారంలో ఉన్న సైనిక పాలకులు బయటి ప్రపంచంతో సంబంధాలను నిరాకరించే విచిత్ర వ్యక్తులు. 2008లో కనీసం లక్షన్నర మందిని బలిగొన్న పెను తుపాను సంభవించిన ఆపత్సమయంలో కూడా అంతర్జాతీయ సహాయాన్ని నిరాకరించిన జడబుద్ధులు. అయితే ఈసారి ప్రళయం సంభవించిన వెంటనే అంతర్జాతీయ సహాయాన్ని అంగీకరిస్తామని సైనిక పాలకుడు మిన్ అంగ్ హ్లేయింగ్ ప్రకటించాడంటే పరిస్థితి ఎంత ఘోరంగా, మరెంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో మయన్మార్‌లో యుఎస్ ఎయిడ్ కార్యకలాపాలు నిలిచిపోవడంతో సహాయ కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మయన్మార్‌లో భూకంపం సంభవించిన రోజునే యుఎస్ ఎయిడ్ సంస్థలో ఉద్యోగులు అందరినీ తొలగించనున్నట్టు , ప్రపంచ వ్యాప్తంగా ఆ సహాయ సంస్థ కార్యకలాపాలను నిలిపివేయనున్నట్టు ట్రంప్ ప్రభుత్వం కాంగ్రెస్‌కు చెప్పింది. 2024లో యుఎస్ ఎయిడ్ మయన్మార్‌లో సహాయ సేవలకు 240 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇది ఆ దురదృష్టకర దేశవాసులకు అందించిన మొత్తం మానవతాపూరిత సహాయంలో మూడోవంతుగా ఉన్నది. అయితే గత జనవరి 20న రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత మయన్మార్‌లో యుఎస్ ఎయిడ్ సహాయ కార్యక్రమాలు 18 నుంచి 3కు తగ్గిపోయాయి. కొన్ని దేశాల దిగుమతులపై సుంకాల విధింపును నెలరోజుల పాటు వాయిదా వేసిన ట్రంప్ ప్రభుత్వం మయన్మార్‌లోని మానవతా సంక్షోభం దృష్ట్యా కనీసం కొన్ని నెలల పాటు అయినా ఆ దేశంలో తమ సహాయ కార్యక్రమాలను పునరుద్ధరించి ఎందుకు కొనసాగించకూడదు? వాతావరణ మార్పు యుగంలో సంభవిస్తున్న ప్రాకృతిక విపత్తులు మన నైతిక వివేకానికి సవాళ్లు విసరడం లేదూ?

సమీప, సుదూర దేశాలలో ఎక్కడైనా ప్రాకృతిక విపత్తులు సంభవించినా అత్యవసర సహాయాన్ని అందించడంలో ముందుండే భారత్ ఇప్పుడు మయన్మార్ విషయంలోనూ అంతే జరూరుగా ప్రతిస్పందించింది. వసుధైవ కుటుంబకం అన్న భారతీయ నాగరికతా ఆదర్శాన్ని ఔదలదాల్చిన న్యూఢిల్లీ 'ఆపరేషన్ బ్రహ్మ' పేరిట భారీ ఎత్తున సహాయ కార్యకలాపాలకు పూనుకున్నది. ఇప్పుడు మయన్మార్ కష్టాల్లోనూ అదే విధంగా వ్యవహరిస్తూ మరింత సమున్నత బాధ్యతను నిర్వర్తించాల్సిన బాధ్యత న్యూఢిల్లీపై ఉన్నది. మయన్మార్‌లో సుస్థిర ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు పూనుకోవడమే ఆ కర్తవ్యం. దూరాలు కరిగిపోయి, వాస్తవ కాలాలు ఏకమైపోతున్న ప్రస్తుత యుగంలో ఆపత్సమయాలలోనే కాకుండా సాధారణ రోజుల్లో సైతం ఇరుగు పొరుగు దేశాలలోని ప్రజల బాగోగుల విషయమై శ్రద్ధ చూపడం 'విశ్వగురు'గా ప్రభవించేందుకు ఆరాటపడుతున్న భారత్ విధ్యుక్త ధర్మం కాదూ?

'జాతీయ విద్య'లో త్రిభాషా సూత్రం తిరకాసు!

త్రిభాషా సూత్రం ఇప్పుడు మళ్లీ ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది. తమిళనాడు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పి.ఎమ్.శ్రీ ఒప్పందంపై సంతకం పెట్టకపోవడం, త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించడం, అసలు 'జాతీయ విద్యా విధానం–2020'ని తిరస్కరించడంతో కేంద్రం తమిళనాడుకు ఇవ్వవలసిన విద్యారంగ నిధులు రెండువేల కోట్ల రూపాయిలు నిలిపివేసింది. దీంతో ఇది పెద్ద చర్చగా మారింది. కేంద్రం ఒక విద్యా విధానాన్ని రూపొందించి, దానిని రాష్ట్రాలు తప్పనిసరిగా అమలు జరపాలని నిర్బంధించడం, అమలు చేయకపోతే నిధులు ఆపివేస్తామనడం అన్యాయమైన విషయం. ఇంతకు ముందెన్నడూ ఇలా జరగలేదు. రాజ్యాంగకర్తలు విద్యను రాష్ట్ర జాబితాలో పెట్టారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యను ఉమ్మడి జాబితాలోకి మార్చింది. తిరిగి విద్యను రాష్ట్ర జాబితాకు మార్చాలనే డిమాండు ముందుకు వస్తున్న తరుణంలో కేంద్ర విద్యావిధానాన్ని ప్రతి రాష్ట్రం విధిగా అమలు జరపాలని నిర్బంధం చేయడం ప్రస్తుత చర్చకు కారణం అయింది.

కేంద్ర ప్రభుత్వం జూలై 29, 2020న 'జాతీయ విద్యా విధానం–2020' (ఎన్.ఇ.పి–2020) పేరున ఒక విధాన పత్రాన్ని ప్రకటించింది. దీనిని ఏ దశలో కూడా పార్లమెంటులో చర్చకు పెట్టలేదు. అటువంటప్పుడు వివిధ రాష్ట్రాల చట్టసభల్లో చర్చకు పెట్టడం అనే సమస్యే తలెత్తదు. దీనిని జాతీయ విద్యా విధానం అనడం కంటే కేంద్ర ప్రభుత్వ విద్యా విధానం అనడం సబబుగా ఉంటుంది. ఈ విద్యా విధానంలో చాలా సమస్యలున్నాయి. ఎ) ఇది విద్యా వ్యాపారాన్ని రద్దు చేయలేదు సరికదా, ప్రభుత్వ విద్యా సంస్థలకు నిధులు నిరాకరిస్తూ, ప్రతి విశ్వవిద్యాలయం తనకు అవసరమైన నిధులను తానే సమకూర్చుకోవాలని చెప్తుంది. ఇది ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫీజుల పెంపుదలకు, పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య నిరాకరణకు కారణమవుతున్నది. ఈ మధ్య విడుదల అయిన యు.జి.సి ముసాయిదా విధానంలో విశ్వవిద్యాలయాల్లో పదోన్నతులు కోరే అభ్యర్థులు విశ్వవిద్యాలయాలకు నిధులు సమకూర్చే ప్రాజెక్టులను చేపట్టాలని, పదోన్నతి కల్పించడంలో వివిధ రూపాల్లో వారు సమకూర్చగల నిధులు ఒక ప్రధాన అంశంగా ఉంటాయని ప్రతిపాదించిన విషయం విదితమే. బి) ఈ విధానం విద్యారంగ విషయాలపై అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం చేతుల్లో కేంద్రీకరిస్తుంది. పాఠశాల పాఠ్యపుస్తకాలను సొంతంగా రాసుకునే హక్కు కూడా రాష్ట్రాలకు లేదు. వాటిని కేంద్రమే రూపొందిస్తుంది, రాష్ట్రాలు ఉపయోగించుకోవాలి. ఈ కేంద్ర విద్యా విధానం ప్రకారం దేశవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో కోర్సులు, చివరికి పరిశోధనలు (నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా) కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. ముందుగా సూచించిన యు.జి.సి సర్క్యులర్ 'రాష్ట్రాలు స్థాపించి నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయాలకు ఉప కులపతుల నియామకంలో' రాష్ట్ర ప్రభుత్వాలకు పాత్రలేని విధానాన్ని ప్రతిపాదించింది. అయితే ఈ విషయం కొత్తది కాదు. ఇది ఎన్.ఇ.పి–2020లో ఉంది. సి) ఈ విద్యావిధానం సామాజిక న్యాయానికి పాతర వేసింది. 66 పేజీల విధాన పత్రంలో 'సామాజిక న్యాయం' అన్న పదబంధంగాని, రిజర్వేషన్లు అనే పదం గాని కనిపించదు. మరల యు.జి.సి సర్క్యులర్‌లోనే రిజర్వేషన్లు నీరుగార్చడానికి సాక్ష్యాలు కనిపిస్తాయి. యు.జి.సి సర్క్యులర్‌లో ఎస్సీ, ఎస్టీ, నాన్ క్రీమీలేయర్ బీసీ, ఇ.బి.సి, అంగవైకల్యం ఉన్న వారికి నిర్దిష్ట శాతాల్లో రిజర్వేషన్ ఇస్తున్నట్లు పేర్కొనలేదు. 5శాతం మార్కులు వెసులుబాటు మాత్రం ప్రతిపాదించారు. డి) ఈ విద్యా విధానం 'భారత జ్ఞాన వ్యవస్థ' పేరుతో కాషాయీకరణకు, చరిత్ర వక్రీకరణకు, కాలం చెల్లిన భావాల వ్యాప్తికి, చివరికి భూత వైద్యానికి ప్రాతిపదికలు ఏర్పాటు చేసింది. ఇ) ఎన్.ఇ.పి–2020 పాలక పార్టీ వ్యక్తులు వారికి ఎటువంటి విద్యా సంబంధమైన అర్హతలు లేకపోయినా ప్రొఫెసర్లు కావడానికి దారులు వేసింది. ఈ విషయానికి కూడా మనం జాతీయ విద్యా విధానం పత్రం చదవవలసిన అవసరం లేదు. యు.జి.సి సర్క్యులర్‌లోనే 'ఎటువంటి విద్యా సంబంధమైన అర్హతలు లేని వారికి' వారి 'ఇతర సమర్థతలను' దృష్టిలో ఉంచుకుని 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్'గా విశ్వవిద్యాలయాలు నియమించవచ్చని ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాల్లో పాలక పార్టీ వ్యక్తుల (ప్రస్తుతం బి.జె.పి; ఆర్.ఎస్.ఎస్) చొరబాటుకు ఇది రాజమార్గం. మరి ఇది ఒక్క తమిళనాడు సమస్య ఎలా అవుతుంది. ఈ సమస్యలతో పాటు భాషా విధానం కూడా ప్రధానంగా ఉంది.



srini

> 'ఎన్.ఇ.పి–2020' చట్టం కాదు, దానిని రాష్ట్రాలు అమలు చేయవలసిన అవసరం లేదు. దీనిని అమలు చేయమని తమిళనాడును కాని మరొక రాష్ట్రాన్ని కాని బలవంతం పెట్టే అధికారం కేంద్రానికి లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ హిందీని, సంస్కృతాన్ని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించడం ద్వారా దేశ ప్రజల ఐక్యతకు, ప్రాదేశిక సమగ్రతకు నష్టం కలిగిస్తున్నది.

భాషా విధానం దీర్ఘకాలంగా మన దేశంలో ఒక సమస్యగా ఉంది. 'వైవిధ్యంలో ఐక్యత' అనే భావం ఔన్నత్యం చూడలేకపోవడం, ఏకత్వం ద్వారానే ఐక్యత సాధ్యమవుతుందని అనుకోవడం వల్ల సమస్య వస్తున్నది. దేశ ప్రజలందరూ హిందీ నేర్చుకుంటే దేశ ప్రజల ఐక్యత, ప్రాదేశిక సమగ్రత సాధ్యం అవుతాయనే భావన ఆనాటి కాంగ్రెస్‌లో కూడా ఉన్నది. కమ్యూనిస్టులు ఈ భావనకు గురి కాలేదు కాని, కొన్ని రకాల సోషలిస్టులు కూడా ఈ భావజాలానికి నీరు పోశారు. అనేక చర్చల తరువాత 'భారత రాజ్యాంగ పరిషత్' హిందీని అఖిల భారత అధికార భాషగా గుర్తించి, 1965 వరకు ఆంగ్లం కూడా అధికార భాషగా కొనసాగించవచ్చని పేర్కొంది. సహజంగానే 1965లో ఈ సమస్య మళ్లీ ముందుకొచ్చింది. తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం తీవ్రంగా పెరిగింది. ఇతర దక్షిణాది రాష్ట్రాల ప్రజలు కూడా గొంతు కలిపారు. కేంద్రం వెనక్కి తగ్గింది. అధికార భాష అనే సమస్యతో పాటు మరి రెండు సమస్యలున్నాయి ఒకటి బోధనా మాధ్యమం, రెండవది భాషల బోధన. బోధనా మాధ్యమం విషయానికి వస్తే కొఠారీ కమీషన్, '1986 నాటి జాతీయ విద్యా విధానం' మాతృభాషా మాధ్యమాన్నే అత్యున్నత స్థాయి వరకు సిఫారసు చేశాయి. 2010 ఏప్రిల్ 1 నుంచి అమలులో ఉన్న 'బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం–2009' ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో 8వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాన్నే నిర్దేశిస్తున్నది. 'జాతీయ విద్యా విధానం 2020' మాత్రం 5వ తరగతి వరకు మాత్రమే మాతృభాషా మాధ్యమాన్ని సిఫారసు చేసి, 'వీలయితే 8వ తరగతి వరకు' అనే మాట చేర్చింది.

కొఠారీ కమిషన్, ఇంకా 1986లో వచ్చిన జాతీయ విద్యావిధానం కూడా త్రిభాషా విధానాన్నే సిఫారసు చేశాయి. కొన్ని ప్రధానమైన, ఆపైన ప్రమాదకరమైన వెసులుబాట్లతో మోడీ 2.0 కాలంలో వచ్చిన 'జాతీయ విద్యావిధానం–2020' కూడా త్రిభాషా విధానాన్ని ప్రతిపాదించింది. ఈ త్రిభాషా విధానంలో మాతృభాష కాని ఆంగ్లం కాని తప్పనిసరి కాదు! తాము తమిళ్, ఆంగ్లం విద్యార్థులకందిస్తామని, మూడవ భాష (హిందీ, సంస్కృతం, ఇంకా దేనినీ) తప్పనిసరి చేయమని తమిళనాడు తెగేసి చెప్పింది. ఎన్.ఇ.పి–2020లో కనీసం రెండు దేశీయ భాషలు నేర్చుకోవాలని ఉంది గాని, అందులో ఒకటి వాడుకలో లేని సంస్కృతం కూడా కావచ్చు. సంస్కృతాన్ని ప్రోత్సహించడానికే ఇటువంటి విధానాన్ని తీసుకువచ్చారు. విశ్వవిద్యాలయ స్థాయిలో సంస్కృత సాహిత్యాన్ని పరిశోధించడానికి కొద్ది మంది ఆసక్తి ఉన్న విద్యార్థులు సంస్కృతం నేర్చుకోవడం వేరు, బాలబాలికలందరికీ సంస్కృతాన్ని ఒక సబ్జెక్ట్ చేయడం వేరు.

ఈ పాలసీ కింద ఇప్పటికే అవకాశవాద విధానాలనవలంబిస్తున్న తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మార్పేమీ ఉండదు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, హిందీ (మూడు భాషలు, అందులో కనీసం రెండు దేశీయ భాషలు) అందిస్తున్నారు. ఇది 'ఎన్.ఇ.పి–2020' మూసలోనే ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు బోధించరు, ఆంగ్లం, హిందీ, సంస్కృతం బోధిస్తారు. సంస్కృతం 'స్కోరింగ్ సబ్జెక్టు'!

కొత్త 'జాతీయ విద్యా విధానం'లో విద్యార్థులకు మాతృభాషను తప్పనిసరిగా అందించాలనే సిఫారసు లేనందున మార్కెట్ శక్తులకు ఇబ్బంది లేదు. కొత్త విద్యా విధానంలో ఆంగ్లం కూడా తప్పనిసరి కాదు, కాబట్టి గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ప్రధానంగా పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో, కాలక్రమంలో, విద్యార్థులకు ఆంగ్ల భాషా బోధనను పూర్తిగా తిరస్కరించి గుజరాతీతో పాటు హిందీ, సంస్కృతాలను వారిపై రుద్దవచ్చు. సంఘ్‌పరివార్ అజెండా ముందుకు తీసుకు వెళ్ళవచ్చు. భోజ్‌పురి, మగధి, మైథిలి వంటి సుమారు 25 భాషలను మింగివేసి విస్తరించిన హిందీ అనేక రాష్ట్రాల్లో ప్రజల మాతృభాషగా చలామణి అవుతున్నది. ఆ రాష్ట్రాలు 'ఎన్.ఇ.పి–2020' వరకు ద్విభాషా విధానాన్నే అమలు చేశాయి. కొత్త త్రిభాషా విధానం కింద సంస్కృతం బోధన ప్రారంభించారు.


'ఎన్.ఇ.పి–2020' చట్టం కాదు, దానిని రాష్ట్రాలు అమలు చేయవలసిన అవసరం లేదు. దీనిని అమలు చేయమని తమిళనాడును కాని మరొక రాష్ట్రాన్ని కాని బలవంతం పెట్టే అధికారం కేంద్రానికి లేదు. హిందీని, సంస్కృతాన్ని బలవంతంగా రుద్దకూడదు. కేంద్ర ప్రభుత్వం మాట అలా ఉంచి.. వైవిధ్యాన్ని ఆమోదిస్తేనే, గౌరవిస్తేనే ఐక్యత బలపడుతుందని హిందీ బెల్ట్ ప్రజలు తెలుసుకోవడం ఎంతైనా అవసరం. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ హిందీని, సంస్కృతాన్ని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించడం ద్వారా దేశ ప్రజల ఐక్యతకు, ప్రాదేశిక సమగ్రతకు నష్టం కలిగిస్తున్నది.

■ **డి. రమేష్ పట్నాయక్**
కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ

జనగణనకు జై కొడదాం!

మన దేశంలో దశాబ్దానికి ఒకసారి జనగణన జరగడం సర్వసాధారణం. పరిపాలనా సౌలభ్యం, ఆర్థికాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, వనరుల సమ పంపిణీ, దేశాభివృద్ధికి ప్రణాళిక రచించడం తదితర అంశాల దృష్ట్యా జనగణన ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నది. మన దేశంలో 2011లో చివరిసారిగా జనగణన జరిగింది. ఆ తర్వాత 2021లో జరగాల్సిన జనాభా లెక్కల ప్రక్రియ కరోనా మహమ్మారి కారణంగా వాయిదా పడుతూ వస్తున్నది. దేశంలో పరిస్థితులు చక్కబడటంతో ఈ ఏడాది లేదా వచ్చే ఏడాది మొదట్లో కచ్చితంగా జనగణన ప్రక్రియ చేపట్టాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే, దేశ జనాభా లెక్కలపై ఒక స్పష్టత వస్తేనే డీ లిమిటేషన్‌తో పాటు మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు మార్గం సుగమం అవుతుంది. అయితే ఇప్పటికీ జనగణనపై ఎలాంటి ప్రకటన చేయలేదంటే కేంద్ర ప్రభుత్వానికే ఈ అంశంపై స్పష్టత లేదని మనకు అర్థమవుతున్నది.

దేశంలో జనగణనతో పాటు డీ లిమిటేషన్ ప్రక్రియలకు ఎంతో చరిత్ర ఉన్నది. ప్రతి పదేండ్లకోసారి జనగణన జరిగినట్టే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు నాలుగుసార్లు డీ లిమిటేషన్ ప్రక్రియ జరిగింది. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశంలో ఆసేతు హిమాచలం వరకు అన్ని ప్రాంతాలకు సమన్యాయం, సమ ప్రాతినిధ్యం కల్పించేందుకు, సమతుల్యత పాటించేందుకుగాను డీ లిమిటేషన్ ప్రక్రియను అమలుచేశారు. స్వాతంత్ర్యానంతరం 1951లో మొదటిసారి జనగణన ప్రక్రియ చేపట్టారు. ఆ మరుసటి ఏడాది 1952లో జస్టిస్ చంద్రశేఖర అయ్యర్ నేతృత్వంలో మొట్టమొదటి డీ లిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ సిఫారసుల ఆధారంగా 1952లో మొదటిసారిగా నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1961 జనాభా లెక్కల ఆధారంగా 1962లో రెండోసారి నియోజకవర్గాల పునర్విభజన చేశారు. ఈసారి 494 నియోజకవర్గాలను 522కు పెంచారు. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలలో అసెంబ్లీ నియోజకవర్గాలను కూడా పెంచారు. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉమ్మడి ఏపీ ఏర్పడినాక జరిగిన మొదటి డీ లిమిటేషన్ ప్రక్రియ ఇదే కావడం గమనార్హం, అనంతరం 1971 జనగణన ఆధారంగా 1976లో మూడోసారి నియోజకవర్గాల పునర్విభజన చేశారు. జస్టిస్ జేఎల్ కపూర్ నేతృత్వంలోనే డీ లిమినేషన్ కమిషన్ సిఫారసు ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 522 నుంచి 543కు పెంచారు. అంతేకాదు, 2001 వరకు లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ చేశారు. అప్పటికే 1971 జనగణన ఆధారంగా ఉత్తర, దక్షిణ రాష్ట్రాలలో జనాభా వ్యత్యాసాన్ని గ్రహించిన నాటి కేంద్ర ప్రభుత్వం కొన్నేండ్ల పాటు యథాతథ స్థితిని కొనసాగించాలని 42వ రాజ్యాంగ సవరణ చేసింది. పాతికేండ్ల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా డీ లిమిటేషన్ చేపట్టారు. జస్టిస్ కుల్దీప్ సింగ్ కమిషన్ సిఫారసుల మేరకు లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగానే ఉంచారు. దాంతోపాటు 2026 తర్వాత జరిగే మొదటి జనగణన ఆధారంగా మాత్రమే డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని 84వ రాజ్యాంగ సవరణ చేశారు.



> జనాభా లెక్కలు తీస్తేనే డీ లిమిటేషన్ అయినా, మహిళా రిజర్వేషన్లు అయినా అమలుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల రాజకీయ పార్టీలు, మేధావులు, ఆలోచనాపరులు తొలుత జనగణన జరపాలని డిమాండ్ చేయాలి. అలా చేస్తేనే రాజ్యాంగ సవరణ చేసి 2031కు ముందే డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్లను సులభంగా అమలు చేసుకోవచ్చు.

ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం జనగణన చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుండటంతో సరికొత్త వివాదం రాజుకున్నది. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తుండటంతో దక్షిణాదిన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల సంఖ్య పెంచితే దక్షిణాదికి భారీ నష్టం జరుగుతుందన్నది నూటికి నూరుపాళ్లు నిజం. జనాభా నియంత్రణను పాటించాలన్న కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు అమలు చేశాయి. గత రెండు దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విజయం సాధించగా, ఉత్తరాదిలో భారీగా జనాభా పెరిగింది. ఈ నేపథ్యంలో దక్షిణాదిలో నియోజకవర్గాల సంఖ్య చాలా తక్కువగా, ఉత్తరాదిలో భారీగా పెరిగే ఆస్కారం ఉన్నది. ఇదే జరిగితే జనాభా నియంత్రణను పాటిస్తూ, అభివృద్ధిలో దూసుకువెళ్తున్న దక్షిణాదికి అన్యాయం జరిగినట్టవుతుంది. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గుతుంది. దక్షిణాది అవసరం లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఏర్పడుతుంది. తద్వారా ఢిల్లీలో మన వాణి వినిపించే అవకాశం లేకుండా పోతుంది. అందుకే, 1971 జనగణన ఆధారంగా ప్రస్తుతం కొనసాగుతున్న నిష్పత్తి ప్రకారమే ఆయా రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్యను పెంచాలని వాదనలు వినిపిస్తున్నాయి.

దేశంలో ఇప్పటికీ 1971 నాటి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలు కొనసాగుతున్నాయి. 2026 తర్వాత జరిగే జనగణన వరకు దీని పొడిగించారు. వాస్తవానికి 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం, 2026 తర్వాత జరిగే మొదటి జనగణన ఆధారంగా డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలి. ఇప్పుడు జరుగబోయేది 2021 జనాభా లెక్కలు. అంటే రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు వీల్లేదు. అందుకు రాజ్యాంగం అనుమతించదు.

2026 తర్వాత జరుగబోయే జనగణన అంటే 2031 లెక్కల ప్రకారం పునర్విభజన జరగాల్సి ఉన్నది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా పెరగాల్సి ఉన్నది. అందుకు ముందుగా జనగణన జరగాలి. జనాభా లెక్కలు తీస్తేనే డీ లిమిటేషన్ అయినా, మహిళా రిజర్వేషన్లు అయినా అమలుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల రాజకీయ పార్టీలు, మేధావులు, ఆలోచనాపరులు తొలుత జనగణన జరపాలని డిమాండ్ చేయాలి. అలా చేస్తేనే రాజ్యాంగ సవరణ చేసి 2031కు ముందే డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్లను సులభంగా అమలు చేసుకోవచ్చు. ఇదంతా జరగాలంటే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం 2025లో జనగణన మొదలు పెట్టి 2026లో ప్రకటించాల్సిందే. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆశిద్దాం.



○ **బోయినపల్లి వినోద్‌కుమార్**
న్యాయవాది, పార్లమెంట్ మాజీ సభ్యులు

ఎవరు బాగున్నారని?

లోకంలో ఏది బాగుందని
దేశంలో ఎవరు బాగున్నారని
దిగువనోళ్లు దిగబడి దారిద్ర్యంలో
ఎగువనోళ్లు ఎగబాకుతూ సంపదల్లో
విషాదాల కొమ్మలకు తలకిందులుగా
వేళ్లాడబడిన జీవితాశలు
మాయామోహాల సంకెళ్లలో
గోసగోసగా గడ్డురోజులు

రాజ్యం! రచ్చల రగడల లొల్లి
అబద్ధాల అత్యాచారాల గల్లి
ఉచితాల ఊరడింపులు ఫ్రాడ్‌లు
హామీల సయ్యాటలు స్కామ్‌లు
తెగబలిసిన లంచావతారాలు
బురదల్లో కూరుకుపోయిన విలువలు

వినోదమంటూ వికృత చేష్టలు
క్రైమ్ అండ్ వయలెన్స్!
వ్యాపార మృగాల చిత్రప్రదర్శనలు
కోట్ల కలెక్షన్లకు తెరిచిన
రాబడుల మృత్యువు గేట్లు
జీవన నైతికత్వానికి తూట్లు

ఇన్సానియత్ ముర్దాబాద్!
గుండాగర్దీ జిందాబాద్!
ఉన్మాదించిన వెర్రివేషాలు
బూతుపురాణాలు తిట్ల వడగళ్ల
వ్యభిచార రాకెట్లు డ్రగ్స్ మాఫియాలు
అకాలం కౌగిట్లో 'మనిషి' శిలాజాలు

అసహన జ్వాలలు అశాంతి మంటలు
యుద్ధం! యుద్ధం! విధ్వంసం!
అగులు బుగులుపుట్టి ఆగమయ్యి
అంగళ్ళ చెరల్లో ఆక్రోశిస్తూ
గాయాలను తడుముకుంటూ అడుగుతున్నా
ఏది బాగుంది ఈ లోకంలో
ఎవరు బాగున్నారని దేశంలో?

– అనిశెట్టి రజిత


విస్మరణల 'యువవీరులు'!

నరేష్ జాటోత్ వ్యాసం 'స్వాతంత్ర్య సమరంలో యువవీరులు' (మార్చి 23)లో కొన్ని పొరపాట్లు, కొన్ని విస్మరణలు ఉన్నాయి. భగత్ సింగ్ పుట్టిన ఊరు, ఉరి తీయబడిన ఊరు కూడా పొరపాటుగా పేర్కొన్నారు. 'ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న పంజాబ్ హుస్సేనివాలా ప్రావిన్స్ జైలులో ఆ వీరులను ఉరికంబానికి బలిచ్చారు' అని రాశారు. హుస్సేనివాలా ప్రస్తుతం ఇండియాలోనే ఉన్నది. మన ఫిరోజ్‌పూర్‌కు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో సట్లైజ్ నదికి పడమటగా ఆ ఊరు ఉంటుంది. 1849లో లాహోరు రాజధానిగా ఏర్పడిన పంజాబ్ ప్రావిన్స్‌లో ఒక చిన్న గ్రామం. లాహోరుకు దక్షిణ దిక్కున 20 కిలోమీటర్ల లోపు ఉంటుంది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను ఉరితీసింది లాహోర్ సెంట్రల్ జైల్లోనే. ఉరితీత అనంతరం వారి భౌతిక కాయాలను ఆ రాత్రి పూటే హుస్సేనీవాలా సట్లైజ్ నది ఒడ్డుకు తెచ్చి మొక్కుబడిగా కర్మకాండలు నిర్వహించి, త్వరగా కాలిపోవటానికని ముక్కలుగా చేసి, కిరసనాయిల్ పోసి దహనం చేశారు. ఇప్పటికీ వారి విగ్రహాలు, సమాధులు అక్కడే ఉన్నాయి. బటుకేశ్వరదత్తు, భగత్ సింగ్ తల్లి విద్యావతి సమాధులు కూడా అక్కడ ఉన్నాయి. (నేను 1998లో హుస్సేనివాలా వెళ్లి అమరవీరుల సమాధులు దర్శించి వచ్చాను)

భగత్ సింగ్ జన్మించిన ఊరు పేరు 'బంగ'. అది ఆనాడు లాయల్‌పూర్ జిల్లాలో ఉండేది. విభజన అనంతరం దానికి ఫైసలాబాద్ అని పేరు మారింది. అది లాహోరు నుండి రావల్పిండి వేపు సుమారు 130 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వ్యాస రచయిత పేర్కొన్నట్లు ఆయన పుట్టింది లాహోర్‌లో కాదు, 'బంగ'లో. ఉరి తీయబడింది హుస్సేనీ వాలాలో కాదు, లాహోర్‌లో!

ఢిల్లీ సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు వేయటానికి భగత్‌సింగ్‌కు తోడుగా వచ్చినది బటుకేశ్వర దత్తు. వ్యాసరచయిత పేర్కొన్నట్లు రాజ్‌గురు, సుఖదేవ్‌లు కాదు. అలాగే వారికి ఉరిశిక్ష పడింది లాలా లజపతిరాయ్ హత్య కేసులో. వ్యాస రచయిత పేర్కొన్నట్లు బాంబులు వేసిన కేసులో కాదు. సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు వేసిన కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 'స్కాట్స్ అనుకుని మరో ఎస్‌ఐ సాండర్స్‌ను హత్య చేశారు' అని ఆ వ్యాసంలో రాశారు. స్కాట్ లాహోర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అయితే సాండర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్. ఎస్సై లాంటి చిన్న పోస్టులలో తెల్లవారు ఉండేవారు కాదు. 1986లో మేము వెలువరించిన 'నా నెత్తురు వృథా కాదు' పుస్తకంలో భగత్ సింగ్ నిరాహారదీక్ష చేసినది 114 రోజులు అని పేర్కొన్నాం. దానిపై కొందరు ప్రశ్నించటంతో నిర్ధారించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేను భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్‌కు ఫోను చేసి మాట్లాడాను. ఆయన స్పష్టంగా 114 రోజులు అని చెప్పారు. ఈ వ్యాస రచయిత 64 రోజులు అని రాశారు.

భగత్ సింగ్, బటుకేశ్వర దత్తులు సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరింది ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించుకున్న రెండు క్రూర నిర్బంధ చట్టాలకు నిరసనగా. అందులో ఒకటి (ట్రేడ్ డిస్ప్యూట్ బిల్) పారిశ్రామిక వివాదాల చట్టం. ఇది కార్మికుల కనీస హక్కులకు వ్యతిరేకంగా తీసుకువచ్చినది. రెండవది (పబ్లిక్ సేఫ్టీ బిల్) పౌర భద్రతా చట్టం. ఇది ప్రజలకు ఉండే సహజమైన పౌర స్వేచ్ఛలను చట్టబద్ధంగా అణచివేయడానికి సంకల్పించినది. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ముఖ్యుల సమావేశంలో సెంట్రల్ అసెంబ్లీలో బాంబుల దాడి గురించి సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. భగత్ సింగ్ అసెంబ్లీ హాలులో బాంబులు వేయటంలో పాల్గొనాలని మొదటి రోజు నిర్ణయంలో లేదు. సుఖదేవ్ దానిపై తిరిగి గట్టిగా చర్చించిన పిదప భగత్ సింగ్ పేరు ఖరారు అయింది. అప్పటికే కార్మిక నాయకులను, ముఖ్యంగా కమ్యూనిస్టు నాయకులను కాన్పూరు, మీరట్ కుట్ర కేసుల పేరుతో బ్రిటిష్ ప్రభుత్వం జైళ్లలో నిర్బంధించి కార్మిక ఉద్యమాన్ని అణచివేస్తున్న నేపథ్యంలో ఈ బాంబుల దాడిని చూడాలి. వారు వెదజల్లిన 'చెవిటి వారికి వినబడేటట్టు చేయాలంటే పెద్ద శబ్దాలు అవసరమవుతాయి' అనే వాక్యంతో ప్రారంభమయే కరపత్రంలో పైన పేర్కొన్న చట్టాలను, కార్మిక నాయకుల అరెస్టుల గురించి ప్రస్తావించి ఉన్నారు. కరపత్రం చివర 'విప్లవం వర్ధిల్లాలి!' అనే నినాదం మాత్రమే ఉండినప్పటికీ, వారిరువురూ కార్మిక వర్గం వర్ధిల్లాలి! బ్రిటిష్ సామ్రాజ్యవాదం నశించాలి!! విప్లవం వర్ధిల్లాలి!!! అనే నినాదాలను తమ నోటి ద్వారా సెంట్రల్ అసెంబ్లీ గేలరీ నుండి వినిపించారు. అంతేకాకుండా 'అందరికీ స్వేచ్ఛ నొసగే, ఒక మనిషిని మరొక మనిషి దోచుకునే అవకాశాన్ని అసాధ్యం చేయగల మహా విప్లవాల బలిపీఠంపై వ్యక్తుల త్యాగాలు అనివార్యం!' అనేది ఆ కరపత్రంలోని చివరి వాక్యం. అసెంబ్లీలో బాంబుదాడుల కేసుపై ఢిల్లీ సెషన్స్ కోర్టులో 6 జూన్ 1929 నాడు, 13 జనవరి 1930న లాహోర్ హైకోర్టులో భగత్ సింగ్ చేసిన వాదనలు చాలా ముఖ్యమైనవి. ఆయన మాటల్లోనే... 'విప్లవం నుంచి మేము ఆశించే ప్రయోజనం ఏమిటంటే ఎటువంటి ప్రమాదాలు లేని శ్రామిక వర్గ నియంత్రత్వానికి పట్టంగట్టే సామాజిక వ్యవస్థను స్థాపించటం! అప్పుడు పెట్టుబడిదారీ విధానపు బాధల నుంచి యుద్ధం వల్ల సంభవించే వినాశనాల నుంచి కష్టాల కడగళ్ల నుంచి విశ్వ సమాజాన్ని రక్షించుకోవచ్చు. ఇది మా ఆదర్శం. ఈ తాత్వికత నుంచి ప్రేరణ పొంది మేము దృఢమైన హెచ్చరిక చేశాం.' భగత్ సింగ్ చేసిన లాహోర్ హైకోర్టు ప్రకటనను న్యాయ శాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఉంది. అలాగే, మార్చి 23 కేవలం 'షహీద్ దివస్'గా మాత్రమే కాక లౌకికవాద సాంస్కృతిక ప్రతీకగా దేశమంతా చెప్పుకునే రోజుగా ఉండాలి.



> తాము సాండర్స్‌ను హత్య చేయలేదని భగత్ సింగ్ బృందం కోర్టులో ఎప్పుడూ వాదించలేదు. బ్రిటీష్ రాజ్యపు బూటకపు విచారణ తంతును బహిర్గతం చేయడానికి భగత్ సింగ్ ప్రయత్నించాడే తప్ప వారి ముందు ఏ రూపంలోనూ లొంగడానికి పూనుకోలేదు. తాను ఉరికంబం ఎక్కబోయే చివరి క్షణాలలో కూడా 'లెనిన్ గురించి క్లారా జెట్కిన్ జ్ఞాపకాలు' పుస్తకాన్ని చదువుతూ యువతరానికి లెనిన్‌ను అనుసరించమని భగత్ సింగ్ ఒక సందేశం అందించాడు.

నరేష్ తన వ్యాసంలో...'తన కొడుకును కేసు నుంచి బయట పడేయడానికి భగత్‌సింగ్ తండ్రి చాలా ప్రయత్నించారు. అయితే తండ్రి ప్రయత్నాలను వారించిన భగత్ సింగ్ దానివల్ల ప్రయోజనం ఉండదని ఖండితంగా చెప్పాడు. మమ్మల్ని విడిచిపెట్టే ఉద్దేశం బ్రిటిష్ ప్రభుత్వానికి లేదు కాబట్టి దీనిపై దొంగ సాక్ష్యాలను సృష్టించి విచారణను వేగంగా పూర్తిచేయడానికి ఏర్పాటు చేస్తుందంటూ తెల్లదొరల అంతరంగాన్ని ముందే పసిగట్టి తండ్రికి తెలియజేశారు భగత్‌సింగ్.' అని ఉంది. వాస్తవానికి భగత్ సింగ్ తండ్రికి రాసిన ఉత్తరంలో 'సిద్ధాంతాలను బలిపెట్టే అంత విలువైనది కాదు నా జీవితం!' 'ఈ కేసులో ప్రతి పనీ ఒక (నిర్దుష్టమైన) ఎత్తుగడను అనుసరించి నడుచుకుంటూ వస్తున్నాం. నా ప్రతి పనీ ఆ ఎత్తుగడను అనుసరించి మా సిద్ధాంతాలకు మా కార్యక్రమాలకు అనుగుణంగా సాగాలి' అంటాడు భగత్ సింగ్. తండ్రి చేసిన ప్రయత్నాన్ని భగత్ సింగ్ తీవ్రంగా అభిశంసించాడు. 'మీకు బదులు మరొకరు ఎవరైనా ఇలా చేసి ఉంటే అతడిని నేను దేశద్రోహి కన్నా తక్కువగా భావించేవాడిని కాదు. అయితే మీపై ఇలాంటి పదప్రయోగం చేయలేను.' అని భగత్ సింగ్ తన సిద్ధాంతాలకు ఏ మాత్రం భంగం కలగని రీతిలో ప్రవర్తించాడు.

తాము సాండర్స్‌ను హత్య చేయలేదని భగత్ సింగ్ బృందం కోర్టులో ఎప్పుడూ వాదించలేదు. బ్రిటీష్ రాజ్యపు బూటకపు విచారణ తంతును బహిర్గతం చేయడానికి భగత్ సింగ్ ప్రయత్నించాడే తప్ప వారి ముందు ఏ రూపంలోనూ లొంగడానికి పూనుకోలేదు. భగత్ సింగ్ తన తండ్రికి రాసిన ఉత్తరాన్ని, సావర్కర్ బ్రిటిష్ వారికి రాసి ఇచ్చిన లొంగుబాటు పత్రాలతో పోల్చి చూడడం కద్దు. తాను ఉరికంబం ఎక్కబోయే చివరి క్షణాలలో కూడా 'లెనిన్ గురించి క్లారా జెట్కిన్ జ్ఞాపకాలు' పుస్తకాన్ని చదువుతూ యువతరానికి లెనిన్‌ను అనుసరించమని భగత్ సింగ్ ఒక సందేశం అందించాడన్నది గమనించదగ్గ విషయం.

వ్యాస రచయిత నరేష్, భగత్ సింగ్ గురించిన వాస్తవాలు చెబుతున్నట్లే రాస్తూ కీలకమైన అంశాలను పాఠకుల దృష్టికి రానీయకుండా చేయడం వెనక అవగాహన సమస్యలు మాత్రమే ఉండి, దురుద్దేశాలు లేకుండా ఉంటే మంచిదే!

● **దివికుమార్**
భగత్‌సింగ్‌పై 'ఉరికంబం సాక్షిగా...' పుస్తక రచయిత





మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన మేయర్ సుధారాణి



బొక్కలగడ్డ ఈద్గా వద్ద సందడి

హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో రంజాన్

- ముస్లింలతో కిటకిటలాడిన ఈద్గాలు
- వరంగల్‌లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ
- హనుమకొండలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ ఈదుల్ ఫితర్ వేడుకలను సోమవారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. 30 రోజులపాటు కఠిన ఉపవాస దీక్షలు పాటించిన క్రమంలో సోమవారం ఉదయమే నూతన వస్త్రాలు ధరించి తమ సమీపంలోని ఈద్గాలకు చేరుకొని దివ్య ఖురాన్‌ను పఠించారు. ఇస్లామిక్ క్యాలెండర్ 9వ నెల రంజాన్ మాసాన్ని గత నెల రోజుల పాటు క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మధ్య రంజాన్ మాసంలో పాల్గొన్న క్రమంలో సోమవారం రంజాన్ వేడుకలను జరుపుకున్నారు. హనుమకొండ బొక్కలగడ్డ, పెద్దమ్మగడ్డ, కాజీపేట ఈద్గాలతోపాటు వరంగల్ ఫోర్ట్ రోడ్‌లోని ప్రధాన ఈద్గా, పోతననగర్ ఈద్గాల వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలు ఉదయే తరలివచ్చి నమాజ్‌లు నిర్వహించారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్ ఈద్గాలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రార్థనలు చేశారు. అలాగే కాజీపేట మార్కెట్ సమీపంలోని ఈద్గా వద్ద మతగురువు ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రార్థన చేశారు. , వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తదితరులు నగరంలోని పలు ఈద్గాలను సందర్శించి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా ఈ పర్వం నిలుస్తుందని కొనియాడారు.



రేణుక మృతదేహం



రేణుక (ఫైల్)

ఒక్కొక్కరుగా.. నేలకొరుగుతున్నారు!

ఉద్యమ బాటలో అసువులు బాసిన ఉమ్మడి జిల్లా వీరులెందరో..

- తాజా ఎన్‌కౌంటర్‌లో పోరాటాలగడ్డ కడవెండి బిడ్డ రేణుక అలియాస్ సరస్వతి కన్నుమూత
- ఏడాది కాలంలో ఎనిమిది మందికిపైగా మావోయిస్టు కీలక నేతల ఎన్‌కౌంటర్
- కరోనాతో అనారోగ్యానికి గురై పలువురు మృత్యువాత
- ఇంకా 25మందికిపైగా అజ్ఞాతంలోనే..
- 1980 దశకంలోనే నక్సల్స్ ఉద్యమాలకు ఊపిరిపోసిన ఓరుగల్లు
- రాష్ట్ర కార్యదర్శి సహా కేంద్ర కమిటీలో కీలక నేతలు ఓరుగల్లు వాసులే

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఏ అడవిలో తూటా పేలినా.. ఓరుగల్లు గుండె ఝల్లుమంటుంది. ఏ తల్లికి కడుపుకోత మిగులుతుందోననే ఉత్కంఠ రేపుతుంది. వరంగల్ గడ్డపై పుట్టి ఆర్‌ఈసీ, కేయూసీల్లో విప్లవ గీతాలే పాఠాలై.. ఎర్రజెండా చేతపట్టి అజ్ఞాతం బాట పట్టిన వీరుల్లో ఒక్కొరొక్కరుగా నేలకొరుగుతున్నారు. ఏడాదికాలంలోనే ఎనిమిది మందికి పైగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు. ఆరు రోజుల క్రితమే కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన మావోయిస్టు నేత అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధాకర్ మృతి చెందగా.. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జనగామ జిల్లా దేవురుప్పుల మండలంలోని పోరాటాల పురిటి గడ్డ కడవెండి గ్రామానికి చెందిన దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు గుమ్మడివెల్లి రేణుక అలియాస్ సరస్వతి మృతి చెందారు. దీంతో ఓరుగల్లు విప్లవకారుల్లో విషాదఛాయలు అలముకున్నాయి. అయితే ఓ వైపు ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నా.. మరో వైపు ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల రూపంలో విసురుతున్న నిర్బంధ సవాళ్లను ఎదుర్కొంటూనే ఇంకా ఎంతో మంది మావోయిస్టులు ఉద్యమ తుపాకీని భుజాలపై మోస్తున్నారు. అలా తమ సిద్ధాంతాల బాటలో నడుస్తున్న వారిలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన 25మందికి పైగా మావోయిస్టులు కీలక పదవుల్లో ఉన్నారు.

ఓరుగల్లులోనే తొలి ఎన్‌కౌంటర్..

2004లో మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించిన తరువాత పదేళ్లు ఉమ్మడి రాష్ట్రంలో, మరో పదేళ్లు తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు ఉద్యమాలు చేస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పడితే తమ ఉద్యమానికి మరింత మద్దతు దొరుకుతుందని భావించిన మావోయిస్టులకు తొలి ఏడాదే భారీ షాక్ తగిలింది. ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ నినాదంగా 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మావోయిస్టులకు తూటాతో సమాధానం చెప్పింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపూర్ అడవుల్లో 15సెప్టెంబరు 2015లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ నగరంలోని వడ్డేపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని శృతి అలియాస్ మహిత(23), ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన విద్యాసాగర్ రెడ్డి అలియాస్ సాగర్ మృతి చెందారు. తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన తొలి మావోయిస్టు ఎన్‌కౌంటర్ ఓరుగల్లులోనే జరగడం అప్పట్లో విప్లవకారులు, తెలంగాణవాదుల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే మావోయిస్టు ఉద్యమంపై గత ప్రభుత్వం ఉక్కుపాదం

మిగతా 7వ పేజీలో...



కడవెండి ఊరు ప్రారంభంలో నెలకొల్పిన యోధుల స్మారక స్థూపాలు

మరో 25మందికిపైగా అజ్ఞాతంలోనే..

ఉమ్మడి వరంగల్ నుంచి అత్యధికంగా 80మంది అజ్ఞాతంలో కీలక పదవుల్లో మావోయిస్టులు ఉన్నట్లుగా 2010లో అప్పటి ప్రభుత్వం గుర్తించింది. ఈ 15ఏళ్ల కాలంలో 55మంది మంది మావోయిస్టులు లొంగిపోవడం లేదా ఎన్‌కౌంటర్లలో, అనారోగ్యంతో మృతి చెందిన వారున్నారు. ఈ క్రమంలోనూ ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 25 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో కీలకంగా ఉన్నట్టు సమాచారం. వీరిలో ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఇక కేంద్ర కమిటీ సభ్యుడిగా భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ కీలక నేతగా ఉన్నారు. అలాగే ములుగు జిల్లా గోవిందారావుపేట మండలం మొద్దులగూడేనికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ ఏవోబీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ముప్పిడి సాంబయ్య అలియాస్ బాబన్న, కందకట్ల యాదగిరి అలియాస్ వేణు, పానగంటి శారద అలియాస్ శివరాత్రి అలియాస్ ఎల్లమ్మ, కందగడ్డ రాజేశ్వర్ అలియాస్ భాస్కర్, గీరెడ్డి పవనందరెడ్డి అలియాస్ అర్జున్, కన్నెబోయిన మల్లయ్య అలియాస్ మల్లేషం అలియాస్ గంగన్న, ఉల్లెంగుల యాకయ్య అలియాస్ అంజన్న, మంద రూబిన్ అలియాస్ మంగన్న అలియాస్ కన్నన్, పసూనూరి నరహరి అలియాస్ సంతోష్, బూర రాకేష్ అలియాస్ శివ, ఎర్ర రాజు అలియాస్ పున్నంచందర్, మునిగాల చిన్నరవి అలియాస్ మల్లేశం, పోలెపాక సునిల్ అలియాస్ సుధీర్, కానుగంటి రజినీకర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు కేంద్ర కమిటీ, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీల్లో కీలక బాధ్యతల్లో ఉన్నారు.

కడవెండి కన్నీరు

ఎన్‌కౌంటర్‌లో రేణుక మృతితో విషాదం

సోదరుడు జీవీకే ఆదర్శంతో ఉద్యమంలోకి.. ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి.. 35ఏళ్ల క్రితం అడవిబాట

దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలిగా, ప్రెస్ టీం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు 7

వర్సిటీల భూముల జోలికొస్తే సహించేది లేదు

అక్రమ అరెస్టులు, కేసులకు భయపడం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



ఎస్ఎఫ్ఐ సెక్రటరీ మంద శ్రీకాంత్‌తో పాటు విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

కేయూ క్యాంపస్, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీతో పాటు ఇతర వర్సిటీల భూముల జోలికొస్తే సహించేది లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ మంద శ్రీకాంత్ హెచ్చరించారు. కేంద్రీయ వర్సిటీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీ, అక్రమ అరెస్టులను నిరసిస్తూ సోమవారం కేయూ మొదటి గేటు వద్ద ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో నిరసన చేపట్టారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించారు. కేయూ ఇన్స్‌పె క్టర్ రవికుమార్ నేతృత్వంలో పోలీసులు అ డ్డుకున్నారు. ఈ సందర్భంగా మంద శ్రీకాం త్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం

మిగతా 8వ పేజీలో...

ప్రాణం తీసిన సిగరెట్ స్మోకింగ్

- గుండ బ్రహ్మయ్య జాతరలో అపశ్రుతి
- ఇరువర్గాల మధ్య ఘర్షణ, అస్వస్థతకు గురైన యువకుడు
- చికిత్స పొందుతూ కుంటపల్లి యువకుడి మృతి
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

6

విద్యార్థుల భవిష్యత్తుకు

పదో తరగతి టర్నింగ్ పాయింట్

- గురుకుల ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ సత్యశారద

6

యువ వికాసాన్ని పక్కాగా అమలు చేయాలి

- ఈ నెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అధికారులు

వరంగల్ కలెక్టరేట్/హనుమకొండ కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం హైదరబాద్‌లోని ప్రజా భవన్ నుంచి చీఫ్ సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న మహోన్నత ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి రూ. 10వేల కోట్లు కేటాయించిందని, అధికారులంతా మనసుపెట్టి పని చేయాలని సూచించారు. దశాబ్ధకాలంగా నిరుద్యోగ యువత కోసం ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ నిధులు ఖర్చు చేయలేదన్నారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్టు అని వివరించారు. వరుస సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 14వ తేదీ వరకు దరఖాస్తుల గడువు పెంచాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2వ తేదీన అర్హులకు సాంక్షన్ లెటర్స్ ఇవ్వాలని, 2 నుంచి 9వ తేదీ వరకు ప్రతీ రోజు ఒక మండలం చొప్పున నియోజకవర్గం అంతటా మంజూరు పత్రాలు అందజేయాలని అన్నారు. జూన్ 9 తర్వాత శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాలని, రూ.50వేల వరకు లబ్ది పొందిన వారికి వారం రోజుల పాటు, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు ప్రయోజనం పొందిన వారికి నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన వారికి వెంటనే గ్రౌండింగ్ చేసి నగదు అందజేయాలని కోరారు. జూలై మొదటి వారం కల్లా గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు గ్రౌండ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతీ జిల్లాలో ఒక యువ అధికారిని నియమించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, ఎల్‌డీఎం రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే హనుమకొండ కలెక్టరేట్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వనదేవతల ప్రసాదాలు అందజేస్తున్న పూజారులు

వనదేవతలను దర్శించుకున్న ప్రముఖులు

తాడ్వాయి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో కొలువైన వనదేవతలు సమ్మక్క సారలమ్మలను తెలంగాణ సెక్రెటేరియట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పుట్ట దేవిదాస్, సెంట్రల్ ప్రిజన్ సూపరిడెంట్ నిజామాబాద్ కూన ఆనందరావు కుటుంబ సమేతంగా తరలివచ్చి తల్లులకు పూజలు చేసి సోమవారం మొక్కులు చెల్లించుకున్నారు. అయితే పూజారులు దేవాదాయ అధికారులు సాదరంగా స్వాగతం పలికి దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారెకొబ్బరికాయలు ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించుకున్నారు. అనంతరం వారికి పూజారులు కండువాలు కప్పి సన్మానించారు. అమ్మవార్ల పసుపు కుంకుమలతో ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకపోడ్ రాష్ట్ర నాయకుడు కూన శివరాం, నాయకపోడ్ మండల అధ్యక్షుడు గుండ్ల రాజు, మండల యూత్ అధ్యక్షుడు కోడి సతీష్, పూజారులు సిద్దబోయిన స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

6వతేదీ నుంచి వేసవి ప్రత్యేక రైలు

కాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఏప్రిల్ 6 నుంచి కాజీపేట మీదుగా ప్రత్యేక రైలు నడిపించనున్న రైల్వే అధికారులు తెలిపారు. ఏప్రిల్ 6 నుంచి జూన్ 29 వరకు ప్రతీ ఆదివారం (07023) - చర్లపల్లి - హజ్రత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 8 నుంచి జూలై 1వరకు ప్రతీ మంగళవారం (07024) హజ్రత్ నిజాముద్దీన్ - చర్లపల్లి మధ్య ఈ రైలు నడుస్తుంది. ఈ రైలు కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సి, భోపాల్, బీనా, ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా, స్టేషన్లలో హాల్టింగ్ ఉన్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

గో ఆధారిత వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం

గోపూజ కార్యక్రమంలో రైతులు

రేగొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : గోఆదారిత వ్యవసాయం చేయడం వలన కుటుంబం మొత్తం ఆరోగ్యంగా జీవించడంతో పాటు పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందని భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పున్నం రాజిరెడ్డి అన్నారు. మండలంలోని రామన్నగూడెం తండా గ్రామంలో గోఆదారిత రైతుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జేబీడీ సొసైటీ అధ్యక్షులు తిరుపతిరావు, కిసాన్‌సంఘ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు రాజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల సమక్షంలో గోవులకు పూజలు చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షులు రాఘవరెడ్డి, రైతు సంఘం నాయకులు రాజేశ్వరరావు, సమ్మయ్య, మణికుమార్, రవిందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



గోపూజ నిర్వహిస్తున్న రైతులు

మైనారిటీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మంత్రి కొండా సురేఖను సన్మానిస్తున్న మత పెద్ద జబ్బార్

- ఫోర్ట్ రోడ్ ఈద్గా అభివృద్ధికి రూ.1.28 కోట్లు మంజూరు
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- రంజాన్ వేడుకల్లో మేయర్ సుధారాణితో కలిసి పూజలు

కరీమాబాద్, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం రంజాన్ సందర్భంగా నగరంలోని ఫోర్ట్‌రోడ్ ఈద్గాలో నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మైనారిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో శాసన సభ్యురాలిగా ఉన్న సందర్భంలో ఈద్గా అభివృద్ధి చేయాల్సిందిగా తనను కోరారని గుర్తుచేశారు. అందువల్లే ఫోర్ట్ రోడ్ ఈద్గా అభివృద్ధికి రూ.1.28 కోట్లు మంజూరు చేశానన్నారు. త్వరలోనే పనులకు శంకుస్థాపన చేస్తానన్నారు. అదేవిధంగా వరంగల్‌లో హజ్ ఏర్పాటు చేయాల్సిందిగా ముస్లింలు కోరారని, త్వరలోనే ఇందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మైనారిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ముస్లింలకు ఫండ్స్ అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. ఈ నెల 11న నిర్వహించే జాబ్‌మేళాలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పథకాన్ని కూడా ప్రారంభించారని, త్వరలోనే నూతన రేషన్ కార్డులను సైతం పంపిణీ చేస్తామని అన్నారు. రాష్ట్రంలో హిందూ, ముస్లింలు సోదర భావంతో జీవిస్తున్నారని అన్నారు. నెల రోజుల పాటు కఠోర నియమనిష్టలతో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నందిరాయ్ నాయక్, మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం, కాంగ్రెస్ నాయకులు సిరిసిల్ల రాజయ్య, మీసాల ప్రకాష్, నవీన్‌రాజ్, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఎ జబ్బార్, పోషాల స్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, బాసాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరించాలంటూ ప్లకార్డుల ప్రదర్శన

వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరించాలని కోరుతూ ఈద్గాలో ముస్లింలు ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం పథకం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- భూపాలపల్లిలో పంపిణీ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

భూపాలపల్లిటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపునింపేం దుకే రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకం ప్రవేశపెట్టిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని రాంనగర్ కాలనీలో గల రేషన్‌షాపులో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబ కడుపునింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు . రేషన్ షాపు అంటే కేవలం బియ్యం షాపు మాత్రమే అనే నానుడి ఉండేదని, కానీ తాము కుటుంబానికి అవసరమైన పలురకాల వస్తువులు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రదేశ్ సర్వీస్ కమీషన్ ద్వారా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలో జాబ్‌మేళా కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినప్పటికీ, గడిచిన 10ఏళ్లలో విధ్వంసం సృష్టించినప్పటికీ అన్నింటినీ అధిగమించి రాష్ట్రప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. కొందరు ధనవంతులకు రేషన్ కార్డులు ఉన్నాయని, వాటిని వెంటనే రద్దుచేసి, పేదలకు రేషన్ కార్డు అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి శ్రీధర్‌బాబుకు చెప్పారు. సన్నబియ్యం పంపిణీ ద్వారా పేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, డీఎస్‌వో రాములు, ఆర్డీవో రవి, తహసీల్దార్ శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన సిగరెట్ స్మోకింగ్

- గుండ బ్రహ్మయ్య జాతరలో అపశ్రుతి
- ఇరువర్గాల మధ్య ఘర్షణ, అస్వస్థతకు గురైన యువకుడు
- చికిత్స పొందుతూ కుంటపల్లి యువకుడి మృతి
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



సంఘటన స్థలంలో మృతుడు

సంగెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినం సందర్భంగా గుండ బ్రహ్మయ్య జాతరలో అపశ్రుతి చోటు చేసుకుంది. సిగరెట్ స్మోకింగ్ ఓ యువకుడి ప్రాణాలను తీసింది. సరదాగా తన స్నేహితులతో కలిసి జాతరలో సిగరెట్ తాగుతుండగా ఇక్కడ తాగొద్దని వేరే యువకులు వారించడంతో ఆ గొడవ కాస్తా పెద్దదిగా మారి ఒకరి ప్రాణం తీసే వరకు వెళ్లింది. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామంలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గవిచర్ల గ్రామంలో ఉగాది సందర్భంగా ప్రతి ఏడాది గుండ బ్రహ్మయ్య జాతర జరుగుతుంది. ఈ తరుణంలో ఆదివారం రాత్రి గ్రామంలో అత్యంత వైభవంగా జాతర సాగుతుండగా సంగెం, కుంటపల్లి గ్రామాలకు చెందిన కొంత మంది యువకులు జాతరకు తరలి వచ్చారు. ఆలయం బయట సంగెం, కుంటపల్లి గ్రామాల యువకులు జాతర వీక్షిస్తుండగా కుంటపల్లి గ్రామానికి చెందిన చిర్ర బన్నీ అనే యువకుడు తన స్నేహితులతో కలిసి సిగరెట్ తాగుతున్నాడు. దీనిని గమనించి మరో వర్గం యువకులు ఇక్కడ స్మోకింగ్ చేయొద్దని వారించారు. దీంతో రెండు వర్గాల మధ్య మాట మాట పెరగడంతో బన్నీపై పిడిగుద్దులతో దాడి చేశారు. దీంతో కుంటపల్లి గ్రామానికి చెందిన బన్నీ(21)కి తీవ్రగాయాలు కావడంతో అక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. జాతర బందోబస్తులో ఉన్న కానిస్టేబుల్ నవీన్‌తో పాటు కొంత మంది యువకులు బన్నీకి సపర్యలు చేసి 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు చేసి బన్నీ మృతిచెందినట్లుగా ధ్రువీకరించారు. దీనిపై బన్నీ కుటుంబ సభ్యులు సోమవారం సంగెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పర్వతగిరి సీఐ రాజగోపాల్ నేతృత్వంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృత దేహనికి పోస్టు మార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బన్నీ అంత్యక్రియల్లో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం ఎస్సై నరేష్‌లు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

జాతీయ పక్షిని కాపాడిన రైతు

అటవీ శాఖ అధికారికి అప్పగింత



నెమలితో రైతు కిరణ్, సీఐ

కమలాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) జాతీయ పక్షి నెమలిని కాపాడి హనుమకొండ అటవీ శాఖ అధికారికి అప్పగించిన సంఘట న సోమవారం మండలంలోని మరిపెల్లిగూడెంలో చోటుచేసుకుంది. రైతు పుల్ల కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తన వ్యవసాయ బావి దగ్గరికి వెళ్తుండగా నిస్సహాయ స్థితిలో పొదలో కొట్టుకుంటున్న నెమలిని గమనించినట్లు తెలిపాడు. వెంటనే నెమలిని కాపాడి స్థానిక సీఐకి విషయం తెలిపాడు. సీఐ హరికృష్ణ రేంజ్ ఆఫీసర్‌కు సమాచారాన్ని అందజేశారు. నెమలిని సురక్షితంగా అటవీ శాఖ బీట్ ఆఫీసర్ గణేష్‌కు అప్పగించినట్లు తెలిపారు.

కన్స్యూమర్ ఫీడ్ బ్యాక్ సెల్ ఏర్పాటు

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని 16 సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడానికి కన్స్యూమర్ ఫీడ్ బ్యాక్ సెల్‌ను కొత్తగా ఏర్పాటు చేశామని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చిలో వివిధ క్యాటగిరిలో రిలీజ్ చేసిన కొత్త సర్వీసులలో రాండమ్‌గా రోజుకు 60 మంది వినియోగదారులకు ఫోన్ చేసి నాలుగు ప్యారా మీటర్లలో ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు. ప్రతీ నెల దాదాపు 1800వినియోగదారులతో మాట్లాడటం జరుగుతుందని వివరించారు. సకాలంలో రిలీజ్, అధికారుల ప్రవర్తన, ఫిర్యాదుల పరిష్కారం, అవినీతి చర్యలు. తదితర ప్యారా మీటర్ల ఆధారంగా సంబంధిత అధికారులకు ఓయం, స్టాఫ్, సెక్షన్ ఆఫీసర్లకు రేటింగ్ నిర్ణయించి, కన్స్యూమర్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అవార్డు ప్రతీ మూడు నెలలకోసారి ఉత్తమ సేవల ఆధారంగా అందచేయడం జరగుతుందన్నారు. వినియోగదారుల ఫీడ్ బ్యాక్ వలన మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని, అందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని సీఎండీ స్పష్టం చేశారు.

అడవిలో చెలరేగిన మంటలు

వాజేడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు సమీపంలో సోమవారం సాయంత్రం అడవిలో మంటలు చెలరేగాయి. గుర్తు తెలియని వ్యక్తులు జామాయిల్ తోటలో మంటల వ్యాపింప చేయడంతో మంటలు చెలరేగాయి. ఉదయం కూడా మంటలు వ్యాపించడంతో ఫారెస్టు సిబ్బంది మంటలు ఆర్పి వేయగా మరల సాయంత్రం సైతం మంటలు వ్యాపించి చెట్లను దహించి వేస్తున్నాయి. విషయం తెలుసుకున్న ఫారెస్టు సిబ్బంది మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.94 కోట్ల ఆదాయం

దరఖాస్తులను పరిశీలించిన మేయర్ సుధారాణి



బల్దియా కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ ద్వారా బల్దియాకు రూ..94 కోట్ల ఆదాయం వచ్చినట్టు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. దరఖాస్తుల అనుమానాల నివృత్తి కోసం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్దకు సోమవారం నగర ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నగర మేయర్ గుండు సుధారాణి బల్దియా కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా హనుమకొండ సుబేదారిలోని ఈ-సేవ కేంద్రాన్ని మేయర్ సందర్శించి, పన్నుల చెల్లింపుల తీరునను, ఎల్ఆర్ఎస్ ప్రక్రియను స్వయంగా పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీఈ, టీపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 869 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

హనుమకొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మార్చి 4 నుంచి 31 వరకు గడువు నిర్ణయించింది. కాగా, సోమవారం వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భీమదేవరపల్లి - 50, భూపాలపల్లి - 59, ఘన్‌పూర్ -13, జనగామ - 226, కొడకండ్ల - 5, మహబూబాబాద్-101, ములుగు-91, నర్సంపేట-23, పరకాల -3, వర్ధన్నపేట-1, వరంగల్ రూరల్ - 50, వరంగల్ ఆర్వో - 137, వరంగల్ ఫోర్ట్ - 110, మొత్తం ఎల్ఆర్ఎస్‌లు -869 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి టర్నింగ్ పాయింట్

గురుకులం ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ సత్యశారద



ఫిర్యాదును చదువుతున్న కలెక్టర్ సత్యశారద

నర్సంపేట టౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి బంగారు భవిష్యత్తుకు పదో తరగతి టర్నింగ్ పాయింట్ లాంటిదని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. నర్సంపేట పట్టణ పరిధిలోని ద్వారకపేటలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం కలెక్టర్ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలు మంచిగా రాసి ఉత్తీర్ణత సాధించాలన్నారు. పది తర్వాత ఏ కోర్సు తీసుకుంటారనే విషయాలతో సంభాషించారు. అనంతరం గురుకులంలోని కిచెన్, స్టోర్ రూం తనిఖీ చేశారు. స్టోర్ రూం, కిచెన్ రూం అస్తవ్యస్తంగా, అపరిశుభ్రంగా ఉండడాన్ని చూసిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గురుకులంలోని ఫిర్యాదుల బాక్స్‌లో విద్యార్థులను రాసిన ఉత్తరాలను చదివారు. ఫిర్యాదుల్లో ఓ విద్యార్థిని పీఈటీ ఇష్టం వచ్చినట్లుగా దూషిస్తున్నారని రాయడంతో సదరు పీఈటీకి ఫోన్ చేసి ఉత్తరంపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజేష్ తదితరులు ఉన్నారు.

కనువిప్పు.. కలిగేదెప్పుడు?

- మూఢ నమ్మకాలతో ముప్పు తెచ్చుకుంటున్న ప్రజలు
- మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోతున్న అమాయకులు
- కూడళ్లలో పూజా సామగ్రి వదిలేస్తున్న వైనం



హంటర్‌రోడ్‌లోని కూడలిలో పడేసిన పూజాసామగ్రి

మిల్స్‌కాలనీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ సైన్స్ అభివృద్ధి చెందుతుంటే.. అదే స్థాయిలో ప్రజల్లో మూఢ విశ్వాసాలు కూడా పెరిగిపోతున్నాయి. కొందరైతే రోగమొచ్చినా.. కష్టమొచ్చినా.. వాటి వెనుక ఏదో శక్తి ఉందంటూ వైద్యులు, నిపుణులను కాకుండా భూత వైద్యులను ఆశ్రయిస్తున్నారు. మంత్రతంత్రాలు, చేసి తాయెత్తులు కట్టే కపటదారుల కల్లబొల్లి మాటలను నమ్మి ఆర్థికంగాను, ఆరోగ్య పరంగాను నష్టపోతున్నారు. సాధారణంగా తెలంగాణ పల్లెల్లో ఇలాంటి మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. అయితే కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత పట్టణ ప్రాంతాల్లో కూడా మూఢవిశ్వాసాల ప్రభావం పెరిగిపోతోంది. ఈ మధ్య నగరంలోని పలు ప్రాంతాల్లో క్షుద్ర పూజలు చేస్తున్నట్టు వార్తలు వస్తుండటం ఆందోళన కలిస్తోంది. ప్రజల్లో ఇలాంటి మూఢ విశ్వాసాలను పారదోలేందుకు గతంలో జనవిజ్ఞాన వేదిక, పోలీసులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టేవి. ఇప్పుడు అవి కూడా తగ్గిపోయాయి. అమావాస్య వచ్చిందంటే చాలు నగరంలోని నాలుగు బజార్ల కూడళ్లు నిమ్మకాయలు, కొబ్బరికాయకులు, జీడిగింజలతో నిండి ఉంటున్నాయి. నగర శివార్లలో సైతం ఇవే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ఉర్సు గుట్ట, భట్టుపెల్లి రోడ్, తాళ్లపద్మావతి, గణపతి ఇంజనీరింగ్ కళాశాల, జాన్‌పీరీలు, స్తంభంపల్లి, చింతల్ జంక్షన్‌లలో ఈ తరహా కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జీపై ఉన్న సర్కిల్, బట్టల బజార్ ఫ్లై ఓవర్‌పై ఉన్న సర్కిల్‌లో నిత్యం నిమ్మకాయలు, కొబ్బరి కాయలు కనిపిస్తూనే ఉన్నా యి. కరోనా సెకండ్ వేవ్ తరువాత నగర ప్రజల్లోనూ మూఢ విశ్వాసాలు మరింత పెరిగిపోయాయి.

కరోనా అనంతరం ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారిలో చాలామంది మాయగాళ్ల మాటలు నమ్మి తాయెత్తులు, మంత్రాలతో వ్యాధులు నయమవుతాయని నమ్మి జేబులు గుల్లచేసుకుంటున్నారు. ఇటీవలే మిల్స్‌కాలనీ పోలీసులు ఇలాంటి వారిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి..



ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి. వేదపండితులు, ఉపాసకులు, వేదాలు అధ్యయనం చేసిన వారిని సంప్రదించి వారి సలహాల మేరకు దైవికమైన కార్యక్రమాలు చేయాలి. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించి వారి సలహాలు, సూచనల మేరకు నడుచుకోవాలి. క్షుద్రపూజలు, రోడ్లపై పూజా సామగ్రి వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దు.

- డాక్టర్ కాళేశ్వరం సుమన్‌శర్మ, జ్యోతిష పండితులు, వరంగల్

శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలి..



ప్రజలు మూఢ విశ్వాసాలను వీడి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలి. ఈ విషయంలో ప్రభుత్వాలు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. ప్రతీ ఒక్కరు మూఢ విశ్వాసాలను పారదోలేందుకు కంకణం కట్టుకోవాలి. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిరంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. స్వచ్ఛంద సంస్థలు, పోలీసు శాఖ, ఇలా అందరు ప్రజలను జాగృతం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. శాస్త్రీయత లేని వాటితో ఆరోగ్యాలు కుదుటపడవు.

- ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సైన్స్ ప్రచార కన్వీనర్



కృష్ణకాలనీలోని స్విమ్మింగ్‌పూల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు వెంటరామిరెడ్డి, మారుతి తదితరులు(ఫైల్)

ఉల్లాసం.. ఉపశమనం.. ఆరోగ్యం..

కార్మికులు, వారి పిల్లలకు, ఇతరులకూ అవకాశం

ఒంటి పూట బడులు, వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలు, యువకుల ఆసక్తి

సింగరేణి ఆధ్వర్యంలో రెండు ఈతకొలనుల నిర్వహణ

కృష్ణకాలనీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి. వేసవితాపం నుంచి ఉపశమనం పొందడంతో పాటు ఉల్లాసాన్ని సొంతం చేసుకునేందుకు అందరూ తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో చాలామంది ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే సింగరేణి సంస్థ కార్మికులు, వారి పిల్లతో పాటు బయటివారికి కూడా అవకాశం కల్పిస్తూ రెండు ఈత కొలనుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. దీంతో వేసవి తాపం తీర్చుకోవడానికి కొందరు.. ఈత నేర్చుకోవడానికి మరికొందరు.. సరదాగా గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఒంటి పూట బడులు కావడం.. త్వరలో వేసవి సెలవులు వస్తుండటంతో పెద్దలతో పాటు చిన్నారులు కూడా ఈతపై మక్కువ చూపుతున్నారు.

రెండు ఈతకొలనులు..

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రెండు ఈతకొలనుల నిర్వహణ సాగుతోంది. ఒకటి సింగరేణి కార్మికులు, వారి పిల్లలతో పాటు ఇతరుల కోసం పట్టణంలోని కృష్ణకాలనీ అంబేద్కర్ స్టేడియం సమీపంలో ఏర్పాటు చేశారు. అలాగే, సింగరేణి అధికారుల కోసం మంజూర్‌నగర్‌లోని బంగ్లాస్ ఏరియాలో మరో స్విమ్మింగ్ పూల్ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. వీటి నిర్వహణ 2016 నుంచి సాగుతుండగా ప్రతీ వేసవిలో వేసవితాపం నుంచి ఉపశమనం పొందడానికి చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్విమ్మింగ్‌కు అనుమతిస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణ నేపథ్యంలో ఇటీవల స్విమ్మింగ్‌కు ప్రాధాన్యమిచ్చే వారి సంఖ్య పెరిగింది.

సామాన్యులకు అనుకూలంగా..

ఈత నేర్చుకోవాలంటే రూ.వేలకు వేలు వెచ్చించాల్సి ఉంటుందనే భావన ఉంటారు. కానీ సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూళ్లలో సాధారణ, మధ్యతరగతి వారంతా సద్వినియోగం చేసుకునేలా ఫీజులను నిర్ణయించారు. ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు పిల్లలు, పెద్దలకు, అలాగే ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు మహిళలకు, సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు మహిళలు మినహా, కార్మికులు, చిన్న పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. కార్మికులకు రూ.100, 15 సంవత్సరాలలోపు పిల్లలకు రూ.50, 15 సంవతరాలు దాటిన వారికి రూ.70, పోలీస్ డిపార్టుమెంట్, స్కౌట్స్, జర్నలిస్టులకు రూ.200ఫీజు నిర్ణయించారు. అలాగే, జెన్‌కో, ఇతర ఉద్యోగులకు రూ.500, చిన్నపిల్లలకైతే రూ.400 ధర నిర్ణయించారు. నెలవారీ కోచింగ్‌కుగాను ఈ డబ్బులను సింగరేణి తీసుకుంటుంది. ప్రస్తుతం ఈ రెండు స్విమ్మింగ్ పూళ్లలో 320మందికిపైగా శిక్షణ తీసుకుంటున్నారు. వీరిలోని ఒక్కో బ్యాచ్‌కు 45 నిమిషాలు వ్యవధి నిర్ణయించి వేసవి సెలవులు పూర్తి స్థాయిలో వస్తే సుమారు వేయి మంది వరకు స్విమ్మింగ్ పూళ్లకు రావచ్చని సింగరేణి అధికారులు అంచనా వేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ ఉంటుంది



ఈతకు వచ్చే వారిపై మా నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. కొత్తవారికి ఈత నేర్పడంతో పాటు ఇదివరకే వచ్చిన వారికి మరిన్ని మెళకువలు నేర్పిస్తాం. ప్రతీ వేసవిలో ఈ స్విమ్మింగ్‌పూల్‌కు వచ్చేవారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. దాంతో గ్రూపులుగా విభజించి స్విమ్మింగ్‌కు అవకాశం కల్పిస్తున్నాం. సింగరేణి అధికారుల ఆదేశాల మేరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నాం.

- పాక శ్రీనివాస్, సింగరేణి స్విమ్మింగ్ కోచ్

ఈతకు వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా చర్యలు



సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే ఈతకొలనుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అవసరమయ్యే ఏర్పాట్లు, సౌకర్యాలను కల్పించాం. ప్రతీ స్విమ్మింగ్ పూల్ వద్ద కోచ్‌లు ఉంటారు. సమయానుకూలంగా అందరికి ఈత అవకాశం కల్పించాలని ఆదేశించాం. ప్రతీ ఏటా స్విమ్మింగ్‌పూళ్లకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది.

- రాజేశ్వర్‌రెడ్డి, సింగరేణి జనరల్ మేనేజర్

ఈతతో ప్రయోజనాలు అనేకం..

శరీరంలో అన్ని అవయవాలకు వ్యాయామాన్ని అందించే ఏకైక క్రీడ ఈత ఒక్కటేనని వైద్యులు అంటున్నారు. ఈతతో శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాయామం కలుగుతుందని, ఈతతో శరీరంలో అదనంగా పెరిగిపోయిన కొవ్వు కరుగుతుందని, మధుమేహంతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగిస్తుందని చెబుతున్నారు. ఈత కొట్టడం ద్వారా ఆకలి పెరగడం, చురుకుదనం పెరిగి జ్ఞాపకశక్తి కూడా వృద్ధి చెందుతుందని, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయని చెబుతున్నారు. ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడేందుకు, రక్తప్రసరణ సవ్యంగా జరిగేందుకు, ఒంటి, కీళ్ల నొప్పులు, అలర్జీ లాంటివి దూరమవుతాయని వైద్యులు వివరిస్తున్నారు. ఇక సింగరేణి ఈతకొలనుల్లో శిక్షణ పొందిన వారిలో చాలా మంది జాతీయ, రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో 17 ఈవెంట్లలో పాల్గొని 23 మెడల్స్‌ను సింగరేణి సంస్థకు తీసుకొచ్చారు. అలాగే, ఇదే స్విమ్మింగ్ పూళ్లలో శిక్షణ పొందిన 10 మంది ప్రస్తుతం హైదరాబాద్‌లో 8 మంది, మరో ఇద్దరు ఇక్కడే కోచ్‌లుగా కూడా ఎదిగారు.





కృష్ణకాలనీలోని స్విమ్మింగ్‌పూల్లో ఉల్లాసంగా ఈత కొడుతున్న చిన్నారులు

ఒక్కొక్కరుగా.. నేలకొరుగుతున్నారు!



దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన రేణుక (ఫైల్)

గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 8మంది..

2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 8మంది ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కీలక నేతలు వివిధ ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. ఆరు రోజుల క్రితం 25వ తేదీన బీజాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధాకర్ మృతి చెందగా, తాజాగా సోమవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా భైరాంఘర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు రేణుక అలియాస్ భాను అలియాస్ సరస్వతి మృతి చెందారు. డీజడ్‌సీఎం మీడియా టీమ్ ఇన్‌చార్జ్‌గా కూడా రేణుక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎల్ఎల్‌బీ చదివిన రేణుక తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే.. మహిళ సంఘంలో పని చేశారు. 2004లో అలిపిరి ఘటనతో మావోయిస్టు పార్టీలోకి వెళ్లిన ఆమె దంతెవాడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం సానుభూతిపరుల్లో విషాదాన్ని నింపింది. కాగా, రేణుకపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25లక్షలు, తెలంగాణ ప్రభుత్వం రూ.20లక్షల రివార్డులను ప్రకటించాయి.

(5వ పేజీ తరువాయి)

మోపడంతో నక్సల్స్ తమ స్థావరాలను ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలోకి మార్చారు. తెలంగాణకు చెందిన కీలక నేతలంతా ఆ దండకారణ్యంలో కీలక బాధ్యతలు చేపట్టారు. వీరిలో వరంగల్‌కు చెందిన మావోయిస్టులే అధికంగా ఉన్నారు.

ఒక్కొక్కరుగా నేలకొరుగుతూ...

ప్రస్తుత మావోయిస్టు ఉద్యమంలో ఓరుగల్లు నేతలే కీలకంగా మారారు. రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సహ ఏవోబీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ అజాద్, కేంద్ర కమిటీ సభ్యుడు కొయ్యడ సాంబయ్య.. ఇలా అనేక మంది మావోయిస్టు నేతలు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవారే ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఎక్కడ తుపాకీ పేలిన ఓరుగల్లు పల్లెల్లో అలజడి మొదలవుతుంది. ఆ ఎన్‌కౌంటర్‌లో తమ వారెవరైనా ఉన్నారా అని చెమ్మగిల్లిన కళ్లతో ఎదురుచూస్తున్నారు. 1980దశకంలో అప్పటి పీపుల్స్‌వార్ ఉద్యమంలో చేరిన వారు ఇప్పటికీ తమ స్వస్థలాలకు వచ్చింది లేదు. చిన్నతనంలో ఇంటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లి.. మళ్లీ విగత జీవులుగా వస్తుంటంతో రక్తసంబంధీకులు, బంధువులు, స్నేహితులు ఘొల్లుమంటున్నారు. రెండు, మూడు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉండటంతో సరైన వైద్యం లేక అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నవారూ ఉన్నారు. 2020-21 మధ్యకాలంలో వచ్చిన కరోనా మావోయిస్టు ఉద్యమాన్ని భారీగా దెబ్బతీసింది. అనేకమంది వరంగల్‌కు చెందిన మావోయిస్టులు అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. వారిలో ప్రధానంగా మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మాడగూడేనికి చెందిన అప్పటి మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ 2021 జూన్ 21న గుండెపోటుతో మృతి చెందారు. కేంద్ర కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు అలియాస్ ప్రకాష్ 2021 జూన్ 10న గుండెపోటుతో కన్నుమూశారు. ములుగు జిల్లాతాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మాడ్ ఏరియా కార్యదర్శి సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క 2021 జూన్22న దండకారణ్యంలో అనారోగ్యంతో కన్నుమూయగా.. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన మ్యాదరి భిక్షపతి 2021జనవరి 18వతేదీన అనారోగ్యంతోమృతి చెందారు. వీరితో అనేకమంది విప్లవఉద్యమంలో తనువు చాలించారు.

ఏడాది కాలంలో జరిగిన ఘటనల్లో కొన్ని


- గతేడాది ఏప్రిల్ 7న తేదీన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్- నంబి అడవుల్లో కర్రిగుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుషాపూర్ గ్రామానికి చెందిన అన్నె సంతోష్ అలియాస్ శ్రీధర్ అలియాస్ సాగర్ మృతి చెందారు.
- ఏప్రిల్ 16న ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా చల్లగరిగే గ్రామానికి చెందిన సిరిపల్లి సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ శంకర్‌రావు మృతి చెందారు. ఆయన భార్య ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన దాసెశ్వర్ సుమన అలియాస్ రంజిత కూడా ఆ ఘటనలో కన్నుమూశారు.
- ఏప్రిల్ 30న ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కేశినేని రవి అలియాస్ వినయ్ మృతి చెందారు.
- జూలై 25న ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల, తాడ్వాయి మండలాల సరిహద్దుల్లోని దామెరతోగు, కరకగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి చెందిన పీఎల్‌జీఏ సభ్యుడు అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందారు.
- సెప్టెంబరు 5న ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతి చెందారు.
- ఈ ఏడాది మార్చి 25న బీజాపూర్- దంతెవాడ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కాజీపేట మండలం తరాలపల్లి గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధాకర్ అలియాస్ మరళి మృతి చెందారు.
- మార్చి 31 సోమవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు రేణుక అలియాస్ భాను అలియాస్ సరస్వతి మృతి చెందారు.

కడవెండిలోని గుమ్మడవెల్లి రేణుక ఇల్లు



కడవెండి కన్నీరు

- ఎన్‌కౌంటర్‌లో రేణుక మృతితో విషాదం
- సోదరుడు జీవీకే ఆదర్శంతో ఉద్యమంలోకి..
- ఎల్ఎల్‌బీ పూర్తి చేసి.. 35ఏళ్ల క్రితం అడవిబాట
- దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలిగా, ప్రెస్ టీం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు



లా చదివిన రోజుల్లో రేణుక ఫొటో

దేవరుప్పుల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పోరాటాల గడ్డ కడివెండి కన్నీరు పెడుతోంది. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన మావోయిస్టుపార్టీ ముఖ్య నాయకురాలు గుమ్మడవెల్లి రేణుక(50) అలియాస్ భాను అలియాస్ చైతు అలియాస్ సరస్వతి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రిటైర్డ్ ఉపాధ్యాయుడైన సోమయ్యకు పెద్ద కుమారుడు వెంకట కిషన్ ప్రసాద్, రేణుకతోపాటు చిన్న కుమారుడు రాజశేఖర్ ఉన్నారు. కడవెండిలోనే ప్రాథమికోన్నత విద్య పూర్తిచేసిన రేణుక 1984లో ఇంటర్ పూర్తి చేశారు. ఇక 1985-86లో రేణుక సోదరుడైన జీవీకె ప్రసాద్ అప్పటి పీపుల్స్ వార్ పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగి.. పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో 1987లో ఆయన అరెస్ట్ అయిన సమయంలో వెంటనే విడుదల చేయాలనే డిమాండ్‌తో పీపుల్స్‌వార్ పార్టీ సభ్యులు రాష్ట్రంలో ఏడుగురు ఐఏఎస్ అధికారులను కిడ్నాప్ చేశారు. అది అప్పట్లో సంచలనంగా మారగా.. ప్రభుత్వం జీవీకేను విడుదల చేసింది. పీపుల్స్‌వార్ పార్టీలో జీవీకే కీలకంగా పని చేస్తుండటంతో ఆచూకీ చెప్పాలంటూ పలు సందర్భాల్లో ఇక్కడి పోలీసులు తండ్రి సోమయ్యను వేధించారు. ఆ వేధింపులు తట్టుకోలేక సోమయ్య కుటుంబం నల్గొండ జిల్లా మోత్కూరుకు మకాం మార్చింది.

న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ...

మోత్కూరులో ఇంటర్ వరకు చదివిన రేణుక ఆ తర్వాత తిరుపతి యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. రేణుక న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే.. తన సోదరుడు జీవీకేను ఆదర్శంగా తీసుకుని 1996లో పీపుల్స్‌వార్ పార్టీలో చేరారు. పార్టీలో కీలకంగా పనిచేస్తూ మావోయిస్టు అగ్రనేత శాకమూరి అప్పారావును 2005లో వివాహమాడారు. ఛత్తీస్‌గఢ్ దండకార్యణంలో పలు పార్టీ కార్యక్రమాలను ఉధృతం చేస్తూ పార్టీలో పదోన్నతులు పొందారు. సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్న రేణుక భర్త శాకమూరి అప్పారావును 2010 నల్లమల్ల ఎన్‌కౌంటర్‌లో పోలీసులు కాల్చి చంపారు. ఆ తర్వాత 2014లో తన సోదరుడు జీవీకే అలియాస్ ఉసెండి లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. కానీ రేణుక మాత్రం ఉద్యమపంథాను వీడలేదు. ప్రస్తుతం దండకారణ్యం స్పెషల్‌జోన్ కమిటీ సభ్యురాలుగా పనిచేస్తూ ప్రెస్ టీం ఇన్‌చార్జ్‌గా, ప్రభాత్ పత్రిక ఎడిటర్‌గా పని చేస్తున్నట్టు సమాచారం. అలా అడవిబాట పట్టిన రేణుక 35ఏళ్ల తర్వాత ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటంతో.. 'సోమయ్య సార్ కూతురు రేణుక చనిపోయిందంటా' అనే విషయం తెలియగానే గ్రామం ఆందోళనలో మునిగిపోయింది. దొడ్డి కొమురయ్య మొదలు ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి అలియాస్ మహేష్, పెద్ది యాదగిరి, పైండ్ల వెంకటరమణతో పాటు ఎందరో వీరులను కన్న కడవెండి పోరాటాల పురిటి గడ్డ బిడ్డగా రేణుక తన జీవితమంతా ప్రజల కోసం అడవిలోనే గడిపిందని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్ననాటి మిత్రులు రేణుకను గుర్తు చేసుకుంటూ కంటతడిపెట్టారు. రేణుక చిన్న తనంలోనే మోత్కూరు మకాం మార్చిన సోమయ్య.. ప్రస్తుతం వృద్ధాప్య కారణంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారని గ్రామస్థులు తెలిపారు. ఇక రేణుక అంత్యక్రియలు బుధవారం కడివెండిలో నిర్వహించే అవకాశాలున్నాయి.

పోరాటాల పురిటిగడ్డపై రాలిన యోధులెందరో!

- సాయుధ పోరాటంలో సుమారు 50మంది
- పోలీసు ఎన్‌కౌంటర్లలో ఐదుగురు మావోయిస్టులు, ఒక జనశక్తి నేత కన్నుమూత

దేవరుప్పుల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నాటి రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి మావోయిస్టుల ఉద్యమం వరకు పోరాటాల బాటలో దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానిది ప్రత్యేక స్థానం. ఈ ఉద్యమాల పోరాట పురిటి గడ్డపై రాలిన యోధులు ఎంతో మంది ఉన్నారు. మొదటగా రజాకార్ల హయాంలో దేశ్‌ముఖ్‌ల గుండెల్లో సింహస్వప్నమై నిలిచి ఎదురొడ్డి పోరాడినయోధుల్లో తెలంగాణ తొలి అమరవీరుడిగా దొడ్డి కొమురయ్య చరిత్ర పుటల్లోకి ఎక్కారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లే క్రమంలో నల్ల నర్సింహులు గ్రామ రక్షక దళాలు ఏర్పాటు చేసి దేశ్‌ముఖ్‌లపై తిరుగుబాటు చేసి ఇక్కడి ప్రజలకు విముక్తి కల్పిస్తూ నిజాం సర్కార్ హయాంలో అరెస్ట్ అయి జైలు జీవితం అనుభవించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో కన్నుమూశారు. ఇంకా దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి హయాంలో ఆయన అనుచరులు కడవెండికి చెందిన సుమారు 50మందిని అతికిరాతకంగా చంపారు. ఇక గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి పీపుల్స్‌వార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి కేంద్ర కమిటీ సభ్యులుగా పనిచేసి కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. అంతే కాకుండా సంతోష్‌రెడ్డి కంటే ముందు అయన సోదరుడు ఎర్రంరెడ్డి పురుషోత్తంరెడ్డి పీపుల్స్‌వార్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి అప్పటి సీఎం చంద్రబాబు సమక్షంలో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. ప్రసుత్తం దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు రేణుక అలియాస్ చైతు సోదరుడు గుమ్మడవెల్లి వెంకట కిషన్ ప్రసాద్ అలియాస్ ఉసెండి 1986లో పీపుల్స్‌వార్ పార్టీలో చేరి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు పనిచేసి 2014లో లొంగిపోయారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పెద్ది యాదగిరి అలియాస్ రాజు జనశక్తి అధినేత రియాజ్‌తో పాటు బదనకల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ఇంకా పీపుల్స్‌వార్‌లో జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేసిన పైండ్ల వెంకటరమణ, దళ కమాండర్‌గా పనిచేసిన పెద్ది శ్రీనులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. పీపుల్స్‌వార్ మావోయిస్ట్, జనశక్తితో పాటు పలు విప్లవ పార్టీలకు మిలిటెంట్లుగా సహకరించిన సుమారు 200మంది కేసుల పాలై కోర్టుల చుట్టూ తిరిగిన వారున్నారు. సాయుధ పోరాటంలో సుమారు 50మంది వీరమరణం పొందిన వారు ఉండగా తాజాగా పీపుల్స్‌వార్ మావోయిస్టు, జనశక్తి పార్టీల్లో పలు స్థాయిల్లో పని చేసిన వారు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా.. రేణుక అలియాస్ చైతు ఐదో ఎన్‌కౌంటర్ మృతురాలిగా గ్రామ విప్లవ చరిత్రలో నిలిచారు.

హైదరాబాద్ కవి సమ్మేళనంలో ఉమ్మడి జిల్లా కవులు



రవీంద్రభారతిలో పాల్గొన్న కవులు

హనుమకొండ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకొని రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురు కవులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి రవీంద్ర భారతిలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో హనుమకొండ నుంచి పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్లా మహేందర్, జనగామ జిల్లా నుంచి నెల్లుట్ల రమాదేవి, వరంగల్ జిల్లా నుంచి రామా చంద్రమౌళి, జయశంకర్ భూపాలపల్లి నుంచి అన్వర్, అనిశెట్టి రజిత తదితరులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. వీరిని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ సత్కరించారు.

అదరహో పేరిణి

- ఉగాది వేళ గౌహతిలో ప్రదర్శన
- ప్రశంసలందుకున్న ఓరుగల్లు కళాకారులు



గౌహతిలో పేరిణి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

హనుమకొండ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమి వరంగల్ ఆధ్వర్యంలో విశ్వావసు తెలుగు ఉగాది పర్వదిన వేళ అస్సాంలోని గౌహతిలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఓరుగల్లు కళాకారులు పేరిణి నృత్యం ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. గౌహతి కల్చరల్ ట్రస్ట్ ఆడిటోరియంలో అస్సాం తెలుగు అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఈ పేరిణి ప్రత్యేక ప్రదర్శనలో నాట్యాచార్యులు గజ్జెల రంజిత్ కుమార్, నవ్యజాలతోపాటు రేగుల చందు, మర్కల లోహిత్, గురుదేవ్, సంతోష్, కుమారి శ్రీజ, బండారి వైష్ణవి, తేజస్విని, గడ్డం విద్యశ్రీ, జారతి కీర్తన తదితర కళాకారులు ప్రదర్శించిన అద్భుత పేరిణి నృత్యానికి ప్రజలు మంగళహారతులు పట్టారు. గంటసేపు ఏకబిగిన పేరిణి లాస్య ప్రదర్శన అనంతరం ఆడిటోరియంలో ప్రతి ఒక్కరు లేచి నిలబడి కరతాళ ధ్వనులతో ఓరుగల్లు కళాకారులను అభినందించడమే కాక వారితో ఫొటోలు దిగేందుకు అక్కడి ప్రజలు ఆసక్తి ప్రదర్శించడం విశేషం. అస్సాం తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆహ్వానం మేరకు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు హరికృష్ణ వీరి ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. గౌహతిలో ప్రదర్శన తమకు ప్రత్యేక అనుభూతి కలిగించిందని పేరిణి రంజిత్ కుమార్ చెప్పారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మడికొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మడికొండ చౌరస్తాలో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చిత్రపటాలకు సోమవారం ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పెనుకుల వినయ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. పేదలకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘు, నాయకులు వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, రాజారపు స్వామి, కుర్ల మోహన్, బిల్ల రవీందర్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, దువ్వ విజయ్, పల్లపు అర్జున్, వస్కుల శ్రీను, నార్లగిరి కుమార్, కొప్పుల నవీన్, కాసర్ల సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మడికొండలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్యాన్సర్ బాధిత చిన్నారికి ఎంపీ కావ్య చేయూత

రూ. 5 లక్షల ఎల్‌వోసి అందజేత



బాలుడి తండ్రికి ఎల్‌వోసీ అందచేస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్ (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని వరంగ్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన ఎండీ నజీం ఆహ్మద్ కుమారుడు అదిల్ ఆహ్మద్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో వైద్య చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రిలో చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 5 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)ని డాక్టర్ కావ్య మంజూరు చేయించారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అనుమతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌వోసిని మంజూరు చేయించిన ఎంపీ డాక్టర్ కావ్యకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవ శ్మశానవాటిక కమిటీ ఎన్నిక

కాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రహ్మత్‌నగర్ బీఎల్ఎం చర్చిలో సోమవారం ప్రొటెస్టెంట్ క్రిస్టియన్ సెమెటరీ అసోసియేషన్ శ్మశానవాటిక కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సీఎస్ఐ పాస్టర్ విక్టర్ పాల్, అధ్యక్షుడిగా భూతపాటి వినయ్‌కుమార్, సెక్రటరీగా పాలూరి వసంత్ కుమార్, ట్రెజరర్‌గా సీహెచ్ సుందర్ ఎన్నికయ్యారు. శ్మశానవాటిక స్థలం కొనుగోలు, ప్రహరీ తదితర సమస్యల్ని పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ కమిటీని అభినందించారు.

రెడ్‌క్రాస్‌లో రక్తపరీక్ష శిబిరం

న్యూశాయంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని రెడ్ క్రాస్ సొసైటీలో సోమవారం హీమోఫీలియో సొసైటీ వరంగల్ చాప్టర్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది హీమోఫీలియో రోగులకు ఫ్యాక్టర్ అస్సే, ఇన్హిబిటర్ స్క్రీనింగ్ వంటి పరీక్షలు చేశారు. శిబిరంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయందర్‌రెడ్డి, హీమోఫీలియో సొసైటీ వరంగల్ చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, డాక్టర్లు పాల్గొన్నారు.

మడికొండలో పంచాంగ పుస్తకాల పంపిణీ



పంచాంగాల పంపిణీలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

మడికొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని బురుజు వద్ద గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సోమవారం మడికొండ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉపద్రష్ట మంత్రవాది వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర పంచాంగాలను అందించారు. తెలంగాణ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మోత్కూరి రాము పంచాంగాన్ని పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అనుముల నవీన్, డాక్టర్ దామోదర్, బాపిరాజు, మోత్కూరి ప్రవీణ్‌కుమార్, బజార్ల శ్రీకాంత్, రుగ్వేజ్‌శర్మ, కేసరి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన బీసీ సంఘాల నేతలు



ఢిల్లీకి వెళ్తున్న బీసీ సంఘాల నాయకులు

కాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం రాజ్యాంగ సవరణ చేయాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 2న ఢిల్లీలో ధర్నా చేసేందుకు సోమవారం కాజీపేట నుంచి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, బీసీ సంఘాల నేతలు తరలివెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా కో - ఆర్డినేటర్ ప్రకాశ్, నాయకులు దాడి మల్లయ్య యాదవ్, తుమ్మల శోభారాణితో పాటు పలువురు నాయకులు ఢిల్లీకి వెళ్లారు.

జానకీ వల్లభుడిగా శ్రీరాముడు

రెండవ రోజు వసంత నవరాత్రులు



పూజలు నిర్వహిస్తున్న పండితులు విజయ కుమారాచార్య

హనుమకొండ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల దేవాలయంలో ఉగాది పర్వదిన వేళ ఆదివారం ప్రారంభమైన వసంత నవరాత్రి వేడుకలు సోమవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. కృష్ణ యజుర్వేద పండితులు గుడిమల్ల విజయ కుమారాచార్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలలో సోమవారం ఉత్సవ విగ్రహాలను జానకి వల్లభుడిగా అలంకరింపజేసి నైవేద్యం సమర్పించి మంత్రపుష్ప నీరాజనం నిర్వహించారు. అదే విధంగా ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం శ్రీరాముని మూలమంత్రయుక్తంగా అంగన్యాస, కరన్యాసాలతో గణపతి నవగ్రహ మహాసుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షించారు.

చలివేంద్రం ప్రారంభం

కేయూ క్యాంపస్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : సమాజా భివృద్ధిలో లోక్ ఫౌండేషన్ కృషి గొప్పదని హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ అన్నారు. సోమవారం కేయూ దూరవిద్య కేంద్రం కూడలిలో లోక్ ఫౌం డేషన్ సేవ సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా 3 వైస్ ప్రెసిడెంట్ తడక కుమారస్వామి గౌడ్‌లు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఎస్సై యు గేందర్, ఎంజీఎఫ్ జాయింట్ సెక్రటరీ కంచేటి శోభావెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



ప్రజలకు తాగునీరు అందజేస్తున్న ఏసీపీ సత్యనారాయణ తదితరులు

ఘనంగా రంజాన్ వేడుకలు

హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో సోమవారం రంజాన్ వేడుకలు ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్కెట్ సమీపంలోని ఈద్గా వద్ద మతగురువు ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా. రియాజ్ ఈద్గాలో ముస్లింలను కలిసి ఈద్ ముబారక్ చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. వరంగల్ నగరం ముస్లిం, హిందుల ఐక్యతకు నిదర్శనమన్నారు. అందరిని సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని అల్లాను కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ, నాయకులు ఎండీ అంకూస్, రఫీ, రహ్మతుల్లా, వేలాది ముస్లింలు పాల్గొన్నారు.



కాజీపేటలో రంజాన్ వేడుకల్లో ముస్లింలతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మడికొండలో..

మడికొండ (ఆంధ్రజ్యోతి): మడికొండలోని ఈద్గాలో రంజాన్ వేడుకలను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నమాజ్ చేసి అలయ్-బలయ్ తీసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌జీవోస్ కాలనీలో..

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీలోని ఈద్గాలో వడ్డెపల్లి మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ ఫయాజ్, ప్రధాన కార్యదర్శి ఎండీ ఖదీర్, అడ్వైజర్లు ఎండీ అన్వర్, ఎండీ యూసుఫ్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఇమాం హుస్సేన్ షరీఫ్ ఖురాన్‌లోని ప్రవచనాలను వివరించారు. కార్యక్రమంలో వడ్డెపల్లి మసీదు కమిటీ ఉపాధ్యక్షులు లియాఖత్ అలీ, ఎండీ జావెద్, కోశాధికారి మంజూర్‌తో పాటు ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





ఎన్‌జీవోస్ కాలనీ ఈద్గాలో ఖురాన్ పఠిస్తున్న ఇమాం హుస్సేన్ షరీఫ్

హనుమకొండ చౌరస్తా : హనుమకొండ పెద్దమ్మ గడ్డలోని హుస్సేని ఆలమ్ ఈద్గలో సోమవారం రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈద్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముస్లిం మత పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ నయీంమోద్దీన్ పాల్గొని ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా నయీంమోద్దీన్ మాట్లాడుతూ... రంజాన్ మాసం మొదలు కొని నెల రోజుల పాటు ముస్లిం సోదరులు భక్తి భావంతో ఉపవాస దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు.. మౌలానా ఖాజా మోయినోద్దీన్ ముందుగా మత ప్రార్థనలు ప్రారంభించగా ముస్లిం మత పెద్దలు, చిన్నారులు పాల్గొని రంజాన్ పండగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈద్గ కమిటీ సభ్యులు మీర్జా మహ్మద్‌బేగ్, సలీం, ఎజాజ్, ఖలీల్ అహ్మద్, ఎండీ మోయినోద్దీన్, తౌసిఫ్, ఎస్‌.‌ యాకుబ్, ఎండీ. ఇంతియాజ్, ఎండీ. సక్లైన్, ఎస్డీ. ఆర్బజ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండ ఈద్గాలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలపుతున్న సీఐ కిషన్



హనుమకొండ పెద్దమ్మగడ్డ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు

హన్మకొండ ఈద్గాని సందర్శించిన సీపీ

వరంగల్ క్రైం : రంజాన్ పండుగను పురస్కరించుకుని హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గాను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పోలీస్ కమిషనర్ పరిశీలించడంతో పాటు రంజాన్ ప్రార్థనలు ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలు సీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట హన్మకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఇన్స్ స్పెక్టర్ సతీష్, సీతా రెడ్డి ఉన్నారు.

హెచ్‌సీయూ భూములను కాపాడాలి

కేయూ క్యాంపస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూములను కాపాడాలని, వర్సిటీ విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు డిమాండ్ చేశారు. సోమవారం కేయూలో పీడీస్‌యూ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు వినయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పీడీఎస్‌యూ కార్యకర్తల సమావేశంలో నరసింహరావు పాల్గొని మాట్లాడారు. భూముల ఆక్రమణలను అడ్డుకున్న విద్యార్థులపై అక్రమంగా లాఠీ చార్జీలు చేసి పోలీస్ కేసులు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులను హాస్టల్స్‌లోకి చొరబడి అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. విద్యార్థులు అరెస్టులు హేయమైన చర్యని దుయ్యబట్టారు. పీడీఎస్‌యూ హెచ్‌సీయూఅధ్యక్షకార్యదర్శులు నాగరాజు,బీమ్‌సేన్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేయూలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపిస్తూ సోమవారం కేయూ మొదటి గేటు ఎదుట డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ (డీఎస్‌యూ) నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు డీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్, కో కన్వీనర్ ఎం. గణేశ్‌లతో పాటు తదితరులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌యూ నేతలు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసించాలని అన్నారు. విద్యార్థులపై పోలీసుల దాడులను ఖండించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌యూ రాష్ట్ర నేతలు శశివకృష్ణ, సంజయ్, మహేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎడ్యుకేషన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమి వేలాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా పోరాటాలు చేస్తున్న విద్యార్థుల పై పోలీసుల దాష్టీకాన్ని పీడీఎస్‌యూ తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ అన్నారు. సెంట్రల్ వర్సిటీ భూముల వేలాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ... పభుత్వం వర్సిటీ భూములను అమ్ముకునే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకొని విద్యార్థులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే కొట్టివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని మహేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



అదాలత్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వర్సిటీల భూముల జోలికొస్తే సహించేది లేదు

5వ పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీ 400 ఏకరాల భూములను వేలం వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు వర్సిటీ భూములను అప్పగిస్తే సహించేది లేదన్నారు. భూములను కాపాడుకునేందుకు విద్యార్థుల ఆందోళనకు దిగితే పోలీసులు లాఠీచార్జి చేసి అరెస్టు చేయడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రజా పాలన కాదు. ప్రైవేట్, కార్పొరేట్ పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం వర్సిటీ పట్టించుకోలేదని ఇప్పుడున్న ప్రభుత్వం వర్సిటీలను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ప్రజల ఇబ్బందులను కష్టలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను చెల్లించాలని అన్నారు. సెంట్రల్ వర్సిటీ భూములను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ఆలోచనలను విరమించుకోవాలని హెచ్చరించారు. భూముల జోలికి వస్తే వర్సిటీలతో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు కన్నారావు, రాహుల్, అఖిల్, శ్రీను , రాజ్‌కుమార్, కల్యాణ్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ నేతృత్వంలో...

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూముల వేలం ఆపాలని డీవైఎఫ్ఐ జిల్లా సెక్రటరీ డి. తిరుపతి నేతృత్వంలో కేయూ రెండో గేటు వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈసందర్భంగా తిరుపతి మాట్లాడుతూ. వర్సిటీ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రలను మానుకోవాలని అన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జులు, అక్రమ కేసులు సరికావని హెచ్చరించారు. విద్యార్థుల భవి ష్యత్‌కు ఉపయోగపడే వర్సిటీ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మంద సురేందర్, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, డీవైఎఫ్ఐ నాయకులు వేణు, సన్నీ, రమణారెడ్డి, రమేశ్, శ్రీకాంత్, చంటి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1లో మెరిశారు..

కేయూ క్యాంపస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఎక్సైజ్‌కాలనీకి చెందిన మంద అపూర్వ తెలంగాణ రాష్ట్ర గ్రూప్-1 పరీక్షల్లో స్టేట్ జనరల్ 15వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు ప్రకటించిన ఫలితాల్లో మంద అపూర్వ 15 ర్యాంకు పొందడంతో డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు ఎంపికయ్యే అవకాశం ఉంది. సివిల్ సర్వీస్‌లో ఐఆర్ఎస్ సాధించి ప్రస్తుతం బొంబాయిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విధులు నిర్వహిస్తున్నారు. హనుమకొండలో టెన్త్, ఇంటర్ పూర్తి చేసిన అపూర్వ హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పట్టా పొందారు. ఇంజనీరింగ్ చదువుతూనే సివిల్ సర్వీసుపై ఆసక్తితో ఐఆర్ఎస్ సాధించారు. తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకు సాధించారు. కాగా, అపూర్వ తండ్రి మంద అశోక్‌కుమార్ కేయూ ఆర్థశాస్త్ర విభాగంలో పనిచేసి ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. అమ్మనాన్న ప్రోత్సాహంతోనే సివిల్ సర్వీస్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర గ్రూప్ -1 సాధించినట్లు అపూర్వ తెలిపారు.



తోట సోని



తౌటం రోహిత్‌నేత

సోనికి 203 ర్యాంకు

వరంగల్ ఎడ్యుకేషన్ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం ప్రకటించిన గ్రూప్-1 ర్యాంకుల్లో హనుమకొండలోని టైలర్ స్ట్రీట్‌కు చెందిన తోట సోని 203 ర్యాంకు పొంది గ్రూప్-1 అధికారిణిగా అవకాశాన్ని చేజిక్కించుకుంది. కాగా, సోని ఇప్పటికే గ్రూప్-4లో ఎంపికై శాయంపేట మండల కేంద్రంలోని ఎంజేపీ జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఇటీవల విడుదలైన గ్రూప్-2,3లలోను ఉద్యోగార్హత సాధించిన సోనీ తాజాగా గ్రూప్-1లో మంచి ర్యాంకును సాధించి గ్రూప్-1 అధికారిణిగా ఎంపియ్యే చాన్స్ కొట్టేసింది. దీంతో టైలర్ స్ట్రీట్‌లో చిరువ్యాపారం చేసుకుంటున్న సోని తల్లిదండ్రులు తోట దామోదర్-జ్యోతి ఆనందం వ్యక్తం చేశారు. కాగా, సోని ఢిల్లీలోని ప్రతిష్టాత్మమైన జేఎన్‌యూ నుంచి ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పట్టాను పొందారు.

రోహిత్‌నేతకు 13వ ర్యాంకు

భీమదేవరపల్లి : భీమదేవరపల్లికి చెందిన తౌటం సురేందర్-రాధికల కుమారుడు రోహిత్‌నేత గ్రూప్-1లో 515 మార్కులతో 13వ ర్యాంకు సాధించాడు. తండ్రి సురేందర్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, రాధిక గృహిణి. ఉద్యోగరీత్యా తండ్రి వివిధ ప్రాంతాల్లో పనిచేస్తుండగా రోహిత్ విద్యాభ్యాసం కొనసాగింది. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు గోదావరిఖనిలో చదువుకొని, ఇంటర్‌ను నారాయణలో చదివాడు. బీటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. ఒక సంవత్సరం పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన రోహిత్ రెండుసార్లు సివిల్స్ పరీక్షలు రాశాడు. కలెక్టర్ కావాలనే లక్ష్యంతో సివిల్స్ రాసినా మెయిన్స్‌కు చేరుకోలేకపోయాడు. గ్రూప్-1 మొదటి ప్రయత్నంలోనే 13వ ర్యాంకు సాధించాడు. కమలాపూర్‌కు చెందిన తౌటం రోహిత్‌నేతకు గ్రూప్-1లో ర్యాంకు సాధించడం పట్ల కమలాపూర్, భీమదేవరపల్లి మండలాల్లోని బంధువులు, కుటుంబ సభ్యులు, బాల్యమిత్రులు, తల్లిదండ్రులు సురేందర్-రాధికలు హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన వాట్సాప్ వివాదం

హసన్‌పర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి డైనమిక్ వాట్సాప్ గ్రూపు వివాదం సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరింది. హసన్‌పర్తికి చెందిన అనుమాండ్ల విద్యాసాగర్ హసన్‌పర్తి అభివృద్ధి కమిటీ సభ్యులను కించపరిచేలా ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి వెగలదాసు వేణు పోస్టులు పెట్టారంటూ ఎస్సై చేరాలుకు ఫిర్యాదు చేశారు. తాను ఎవరిని కించపరిచేలా పోస్టులు పెట్టలేదని వేణు తెలిపారు. తనను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ్యంతోనే విద్యాసాగర్ తనపై అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

బంగారం, బైక్ చోరీ..

కేసు నమోదు

కాజీపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంట్లో దుండగులు బంగారం చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన ఎస్తేర్ ఆదివారం కుటుంబంతో సహా బంధువుల ఇంటికి వెళ్లింది. సోమవారం ఇంటికి వచ్చే సరికి దుండగులు తాళం పగులకొట్టి వస్తువులు చిందరవందర చేశారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. మరో ఘటనలో ఇదే కాలనీవాసి వెంకటరమణ బైక్ చోరీ జరిగింది. బాధితులు సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మట్టిలో విత్తనం నాటుకుని, మొలకెత్తి మహావృక్షంగా ఎదిగి, పండ్లను అందించాలంటే అందుకు ఎన్నో అంశాలు అనుకూలించాలి. గర్భధారణకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. పండంటి బిడ్డలకు తల్లితండ్రులు కావాలనుకుంటే, పెళ్లయ్యాక కాదు, పెళ్లికి ముందు నుంచే, స్త్రీపురుషులిద్దరూ శారీరకంగా సన్నద్ధం కావాలంటున్నారు వైద్యులు.

పిల్లల కోసం ఇలా సిద్ధం!

పెళ్లవగానే పిల్లలు పుట్టేసే పరిస్థితులు తగ్గిపోయాయి. ప్రస్తుతం వంధ్యత్వానికి కారణాలు మహిళల్లో, పురుషుల్లో ఇద్దర్లో సమానంగా ఉంటున్నాయి. పెళ్లీడు దాటిన తర్వాత పెళ్లిళ్లకు సిద్ధపడడం, అస్తవ్యస్థ జీవనశైలులను అనుసరించడం, జీవనశైలి సంబంధిత రుగ్మతలు (మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్) కలిగి ఉండడం, భౌతిక సాన్నిహిత్యానికి తగిన సమయం కేటాయించలేకపోవడం, స్త్రీపురుషుల్లో పునరుత్పత్తి సమస్యలు... ఇలా గర్భధారణ సాధ్యపడని అంశాలు అనేకం ఉంటున్నాయి.



- మహిళల్లో: మహిళల్లో పెరిగే వయసుతో పాటు అండాల నాణ్యతతో పాటు, వాటిలోని జన్యు పదార్థం నాణ్యతలు కూడా తరిగిపోతూ ఉంటాయి. వీటికి తోడు థైరాయిడ్, అధిక రక్తపోటు, మధుమేహం, పిసిఒడి లాంటి సమస్యలు కూడా తోడవుతూ ఉంటాయి.

- పురుషుల్లో: పెరిగే వయసుతో పాటు దురలవాట్ల వల్ల వీర్యకణాల నాణ్యత, కదలికలు తగ్గిపోతాయి. వీర్య నాణ్యతపరంగా 2000 సంవత్సరం నాటి విలువలకూ ఇప్పటి విలువలకూ ఎంతో వ్యత్యాసం కనిపిస్తోంది. సాధారణంగా పురుషుల వీర్యంలో 40 మిలియన్ల వీర్యకణాలు ఉండేవి. కానీ ప్రస్తుతం ఈ ప్రమాణాన్ని 20 మిలియన్లకు పరిమితం చేసినా, ప్రస్తుత పురుషుల్లో వీటి సంఖ్య 12, 13 మిలియన్ల మేరకే ఉంటోంది.

పరీక్షలతో కారణాన్ని కనిపెట్టి...

పిల్లలు కలగకపోవడానికి స్త్రీపురుషుల్లో కారణాలను కనిపెట్టడం కోసం ఇద్దరికీ పరీక్షలు అవసరమవుతాయి. హార్మోన్ పరీక్షతో మహిళల అండాల నాణ్యతను పరీక్షించడంతో పాటు, స్కాన్ ద్వారా ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియోసిస్, పిసిఒఎస్ లాంటివి లేవనీ, గర్భాశయ, ఫెలోపియన్ ట్యూబ్ సమస్యలు లేవనీ నిర్ధారించుకోవాలి. అలాగే వీర్య పరీక్షతో వీర్యకణాల సంఖ్య, నాణ్యత, కదలికలను విశ్లేషించుకుని తగిన చికిత్సలు అందించి మూల కారణాలను సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. అలాగే కొందర్లో థైరాయిడ్ సమస్యలు ఉండవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు కూడా ఉండి ఉండవచ్చు. వీటిని కూడా మందులతో అదుపులోకి తెచ్చుకోవాల్సి ఉంటుంది. వీటికి తోడు అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులను కూడా సరిదిద్దుకోవాల్సి ఉంటుంది.

ఎంత తరచుగా...

పెళ్లైన మూడు నెలలకే గర్భం దాల్చలేదనే కంగారుతో వైద్యుల దగ్గరకు పరుగులు పెట్టకూడదు. ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేని జంట, ఏడాది పాటు ఎలాంటి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించకుండా శారీరకంగా కలుస్తున్నప్పటికీ గర్భధారణ జరగనప్పుడు మాత్రమే పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలి. అలాగే దంపతులు ఏడాది పాటు, వారానికి కనీసం రెండు సార్లైనా శారీరకంగా కలుస్తూ ఉండాలి. ఈ నియమాలన్నీ పాటించినా ఏడాది వరకూ గర్భం దాల్చనప్పుడు తప్పనిసరిగా వైద్యులను కలిసి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. వారానికి రెండుసార్లు కలిస్తే సరిపోతుందనే సాకుతో వేర్వేరు ప్రదేశాల్లో విడివిడిగా ఉంటూ, వారాంతాల్లో కలవడం కూడా సరి కాదు. గర్భధారణకు శారీరక సహకారం ఎంత అవసరమో, మానసిక సంతృప్తి కూడా అంతే అవసరం. కాబట్టి దంపతులిద్దరూ ఒకే చోట కలిసి ఉండాలి.

పెళ్లీడు ఇదే!

అమ్మాయిలు 25 నుంచి, 30 ఏళ్ల లోపు, అబ్బాయిలు 30 ఏళ్ల లోపు పెళ్లి చేసుకోవడం అవసరం. ఈ వయసు గర్భధారణకు అన్ని విధాలా అనుకూలమైనది.



ముందస్తు పరీక్షలతో...

గర్భధారణకు శరీరం అనుకూలంగా ఉందో లేదో ఎవరికి వారు పెళ్లికి ముందే తెలుసుకోవడం అత్యవసరం. ఇందుకోసం పునరుత్పత్తి వ్యవస్థ పనితీరును తెలిపే పరీక్షలు చేయించుకోవాలి.

ఇందుకోసం వైద్యులు సూచించే రక్తపరీక్ష, స్కానింగ్, వీర్య పరీక్షలు చేయించుకోవాలి. మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలి. అలాగే శరీరంలో దాగిన క్లెమిడియన్, హెచ్ఐవి, హెపటైటిస్ ఇన్ఫెక్షన్లను కనిపెట్టడం కోసం ఇన్ఫెక్షన్ స్క్రీనింగ్ చేయించుకోవాలి. ఈ పరీక్షా ఫలితాల్లో సమస్య ఉన్నట్టు తేలినప్పుడు సమర్థమైన చికిత్సతో సరిదిద్దుకున్న తర్వాతే పెళ్లికి సిద్ధపడాలి. 25 నుంచి 30 ఏళ్ల వయసున్న పెళ్లి కాని యువతులందరూ ఇలా ప్రతి ఏటా పరీక్షలు చేయించుకుంటూ శరీరం మీద ఓ కన్నేసి ఉంచాలి. 30 ఏళ్ల నుంచి పెళ్లి కాని అబ్బాయిలు కూడా ప్రతి ఏటా వీర్య పరీక్షతో పాటు, ఇతరత్రా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

యువతులు ముందు నుంచే...

భవిష్యత్తులో దాల్చబోయే గర్భం తాలూకు బీజాలు, సదరు బిడ్డ తల్లి గర్భంలో ఉన్నప్పుడే పడతాయి. కాబట్టి పిల్లలు నెలలు నిండకుండా పుట్టడం, బరువు తక్కువతో పుట్టడం లాంటి పరిస్థితులు తలెత్తకుండా గర్భిణులు జాగ్రత్త పడాలి. ఇలాంటి పరిస్థితుల్లో పుట్టిన ఆడపిల్లలు, టీనేజీ వయసుకు చేరుకునేటప్పటికి పిసిఒడి, ఒబేసిటీ, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలకు లోనవుతారు. పొంచి ఉండే ఈ ముప్పులకు తోడు నేటి తరం ఆడపిల్లల్లో శారీరక వ్యాయామం లోపించడం, ఆహారపుటలవాట్లు అస్తవ్యస్థం కావడం లాంటివి గర్భధారణను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. కాబట్టి టీనేజీ వయసు నుంచే ఆరోగ్యాన్ని కాపాడుకునే చర్యలు మొదలుపెట్టాలి. నెలసరి ప్రారంభంలో తలెత్తే సమస్యలను ప్రారంభంలోనే సరిదిద్దుకోవాలి. నెలసరి క్రమం మీద దృష్టి పెట్టాలి. ఏ చిన్న మార్పును గమనించినా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.

ఐవిఎఫ్ ఎప్పుడు?

పునరుత్పత్తి సమస్యలను చికిత్సతో సరిదిద్దలేని సందర్భాల్లో అంతిమ ప్రత్యామ్నాయంగా ఐవిఎఫ్‌ను (ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్) ఎంచుకోవచ్చు. ఈ ప్రక్రియను ఎలాంటి సందర్భాల్లో ఎంచుకోవాలంటే...

- అండాల నాణ్యత పూర్తిగా క్షీణించినప్పుడు
- వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు
- లైంగిక సమస్యలు ఉన్నప్పుడు
- ఫెలోపియన్ ట్యూబులు రెండూ మూసుకుపోయినప్పుడు
- దంపతులు ఇద్దర్లో గర్భధారణకు సాధ్యపడని పరిస్థితులు నెలకొని ఉన్నప్పుడు, దానం చేసిన అండాలు లేదా వీర్యకణాల ద్వారా గర్భం దాల్చే అవకాశాలున్నాయి.

మరీముఖ్యంగా టీనేజీ అమ్మాయిల్లో రక్తహీనత సర్వసాధారణమైపోతోంది. దీంతో వ్యాధినిరోధకశక్తి తగ్గి, శరీరం ఇన్ఫెక్షన్లకు లోనై పునరుత్పత్తి వ్యవస్థతో పాటు, మిగతా ఆరోగ్య వ్యవస్థల పనితీరులన్నీ కుంటుపడతాయి. కాబట్టి రక్తహీనతను నివారించుకోవడం కోసం ఆకుకూరలు, గుడ్లు, మాంసం, వేరుసెనగలు, బెల్లం చిక్కీలు, నువ్వులు, ఖర్జూరం తీసుకుంటూ ఉండాలి. అవసరాన్ని బట్టి రక్తహీనతను నివారించే మాత్రలు, ఇంజెక్షన్లను తీసుకోవాలి.

డాక్టర్ పి. నీలిమ
హెచ్ఒడి - అబ్‌స్ట్రెట్రిక్స్ అండ్ గైనకాలజీ,
రెనోవా హాస్పిటల్స్,
సనత్ నగర్, హైదరాబాద్.





క్యాన్సర్‌ను కనిపెట్టే 'మైక్రో రోబోట్స్'

శరీరంలో క్యాన్సర్ నిర్ధారణ బయాప్సీ ద్వారానే సాధ్యమని మనందరికీ తెలుసు. అయితే శరీరం మీద ఎలాంటి కోత లేకుండా అప్పటికప్పుడే క్యాన్సర్‌ను పసిగట్టే 'మైక్రో రోబోట్స్' త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి.

కోతకు ఆస్కారం లేకుండా త్రీడి స్కాన్ ద్వారా పెద్ద పేగు క్యాన్సర్‌ను కచ్చితంగా పసిగట్టే మైక్రో రోబోట్స్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇప్పటివరకూ పెద్ద పేగు క్యాన్సర్‌ను నిర్ధారించడం కోసం పేగుల్లోకి చేరుకుని ముక్కను సేకరించి, బయాప్సీ చేయవలసి వస్తోంది. దీని ఫలితం చేతికి అందడానికి రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది. కాబట్టి క్యాన్సర్ చికిత్స ఆలస్యమై వ్యాధి మరింత ముదిరిపోయే ముప్పు పెరుగుతోంది. ఇలా వ్యాధినిర్ధారణ, చికిత్సల కోసం వేచి చూసే సమయాన్ని తగ్గిస్తూ, లీడ్స్, గ్లాస్గో, ఎడిన్‌బర్గ్ శాస్త్రవేత్తలు తాజాగా ఈ మైక్రో రోబోట్స్‌ను అభివృద్ధి చేశారు. సర్జరీ ద్వారా కేన్సర్ సోకిన కణజాలాన్ని సేకరించడానికి బదులుగా ఈ మైక్రో రోబోట్స్, శరీరంలోకి పాకుతూ వెళ్లి, క్యాన్సర్ సోకిన భాగాల చిత్రాలను వైద్యులకు అందిస్తాయి. 21 మిల్లీమీటర్ల పరిమాణాన్ని కలిగి ఉండే ఒలాయిడ్ మ్యాగ్నెటిక్ ఎండోస్కోప్ రోబోట్స్ క్యాన్సర్ సోకిన భాగాన్నీ, క్యాన్సర్ గడ్డ పరిమాణాన్నీ కనిపెట్టడంతో పాటు ఒకే ప్రయత్నంలో సూటి చికిత్సను కూడా అందించే సాంకేతిక సహాయకారులుగా ఉపయోగపడే వీలున్నట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

మోకీళ్లు ఒత్తిడికి గురైతే...

రోజుకు గంట పాటు మాన్యువల్ కార్లను నడిపే వాళ్లు సరైన శరీర భంగిమను అనుసరించకపోతే, 'డ్రైవర్స్ నీ' అనే మోకీళ్ల సమస్యతో బాధపడక తప్పదు. ఈ సమస్య ఎందుకు బాధిస్తుందంటే...

కారు నడిపేటప్పుడు తరచూ యాక్సిలరేటర్, బ్రేక్, క్లచ్‌లను నొక్కడం కోసం కాళ్లను కదుల్చుతూనే ఉంటాం. అయితే ఇలా కదిల్చేటప్పుడు మన శరీర భంగిమ సక్రమంగా లేకపోతే, మోకాళ్ల మీద ఒత్తిడి పెరుగుతుంది. తరచూ పెడల్స్‌ను... ప్రత్యేకించి బ్రేక్, యాక్సెలరేటర్‌లను నొక్కేటప్పుడు మోకీలు, దాని చుట్టూరా ఉండే టెండాన్లు ఒత్తిడికి లోనవుతాయి. ప్రతి రోజూ గంటల తరబడి కార్లను నడిపేవారిలో మోకాలి చుట్టూరా ఉన్న కండరాలు బిగుతుగా మారి, వాపు, నొప్పి మొదలవుతాయి. కదలికలకు ఎక్కువ ఆస్కారం లేకపోవడం, నమ్యత లోపించడం వల్ల మోకీళ్లు ఒక భంగిమకే పరిమితమై ఒత్తిడికి లోనవుతాయి. దాంతో దీర్ఘకాలంలో నొప్పితో కూడిన కీళ్ల సమస్యలు మొదలై మెట్లు ఎక్కేటప్పుడు, మోకాళ్లను వంచినప్పుడు, కుర్చీలో నుంచి లేచి నిలబడేటప్పుడు నొప్పి వేధిస్తుంది. ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే...

- డ్రైవర్ సీటు, స్టీరింగ్‌కు మరీ దూరంగా ఉండకూడదు
- పెడల్స్‌ను నొక్కేటప్పుడు పాదం, మోకాలికి 30 డిగ్రీల కంటే ఎక్కువ కోణంలో ఉండకూడదు
- మోకాళ్లు సీటు అంచులో ఉండేలా చూసుకుంటే, వాటిని కదిలించడానికి వీలుంటుంది




- ఎక్కువ దూరాలు కారు నడిపేటప్పుడు, ప్రతి 45 నిమిషాలకు ఒకసారి కారు ఆపి, దిగి కొద్ది దూరం నడవాలి
- మోకాళ్లు ఎలాంటి అసౌకర్యం లేకుండా 90 డిగ్రీలకు వంచగలిగేంత ఎత్తులో సీటు ఉండేలా చూసుకోవాలి
- మోకాళ్ల కండరాలను దృఢపరిచే వ్యాయామాలు చేస్తూ ఉండాలి. సీటులో కుషన్లను వాడుకోవడం, కూర్చునే భంగిమ సక్రమంగా ఉండేలా చూసుకోవడం, నీ సపోర్ట్‌లను వాడుకోవడం వల్ల మోకీళ్ల మీద ఒత్తిడి పడకుండా నివారించుకోవచ్చు.

మన జీర్ణాశయం తిన్న ప్రతి పదార్థాన్నీ క్షణాల్లో జీర్ణించుకోలేదు. కొన్ని పదార్థాలు పూర్తిగా జీర్ణమవడానికి కొన్ని రోజుల సమయం పడుతుంది. ఫలితంగా కొందర్లో అజీర్తి, కడుపుబ్బరం లాంటి సమస్యలు మొదలవుతాయి. అలాంటి క్లిష్టమైన పదార్థాలు ఏవంటే...

అజీర్తి ఆమడదూరంలో...

రెడ్ మీట్: ఈ భారీ మాంసకృతులను శరీరం పూర్తిగా జీర్ణించుకోడానికి 72 గంటల సమయం పడుతుంది. ఈ మాంసం సాంద్రత ఎక్కువ కాబట్టి దీన్ని మన జీర్ణ వ్యవస్థ సులభంగా విచ్ఛిన్నం చేసుకోలేదు. దాంతో రెడ్ మీట్ తరచుగా తింటున్నప్పుడు, జీర్ణాశయంలో జీర్ణరసాలు సరిపడా ఉత్పత్తి కానప్పుడు... కడుపుబ్బరం, పొట్టలో అసౌకర్యం, జీర్ణ ప్రక్రియ మందగించడం లాంటి సమస్యలు వేధిస్తాయి.



కొవ్వుతో కూడిన సంక్లిష్టమైన పదార్థాలు: కొవ్వులు, జిడ్డుతో కూడిన సంక్లిష్టమైన పదార్థాలను జీర్ణించుకోడానికి మన శరీరం ఎక్కువ సమయం తీసుకుంటుంది. బర్గర్లు, ఫ్రెంచ్ ఫ్రైలు అరగడానికి ఎక్కువ సమయం తీసకుని జీర్ణ సమస్యలను తెచ్చి పెడతాయి. అలాగే బర్గర్లు, ఫ్రైడ్ చికెన్, పిజ్జాలలో ఉండే అత్యధిక సంతృప్త కొవ్వులు కడుపుబ్బరం, కడుపులో అసౌకర్యం, డయేరియాలకు కారణమవుతాయి. వాటిలోని అదనపు సోడియం, కృత్రిమ చక్కెరలు, తీపి పదార్థాలు కూడా జీర్ణ ప్రక్రియను ప్రభావితం చేస్తాయి.

స్వీట్లు, శీతల పానీయాలు: డోనట్స్, కేక్స్, బిస్కెట్లు లాంటి తీపి పదార్థాలు పేగుల్లోని చెడు బ్యాక్టీరియాకు ఆహారంగా మారతాయి. ఆ బ్యాక్టీరియా ఆయా పదార్థాల్లోని చక్కెరలను కుళ్లబెట్టడం మూలంగా కడుపుబ్బరం వేధిస్తుంది. కాబట్టి పేగులు ఇబ్బంది పడకుండా ఉండడం కోసం పదార్థాలకు అల్లం చేర్చుకోవాలి. బ్రొకొలి, చిలకడ దుంపలు లాంటి అత్యధిక పీచు కలిగిన కూరగాయలను జోడించుకోవాలి. అలాగే ఆరోగ్యకరమైన మూలాలు కలిగిన కొవ్వులు, ప్రొటీన్, సంక్లిష్ట పిండిపదార్థాలను ఎంచుకోవాలి.

అజీర్తితో పొట్టలో అసౌకర్యం వేధించినప్పుడు ఎక్కువ నీళ్లు తాగాలి. శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి. అలాగే అత్యధికంగా శుద్ధి చేసిన పదార్థాలు తినడం మానేయాలి.

మైక్రోగ్రీన్స్‌తో మెరుగైన ఆరోగ్యం

మొలకలు ఆరోగ్యకరం. అయితే 'మైక్రో గ్రీన్స్'లో వాటిని మించిన పోషకాలుంటాయి. వాటి గురించి తెలుసుకుందాం!

పెసలు, అలసందలు, సెనగలు... వీటిని నానబెట్టి, అంగుళం మేరకు మొలకలు పెరగగానే తినేస్తూ ఉంటాం. వీటిలో పోషకాలకు కొదవ ఉండదు. అయితే మరింత మెరుగైన, విలువైన పోషకాలను పొందడం కోసం మైక్రో గ్రీన్స్ కూడా తినడం అలవాటు చేసుకోవాలి. సూపర్‌ఫుడ్స్‌గా పేరు పొందుతున్న మైక్రోగ్రీన్స్ ఎలా పెంచుకోవాలో, ఎలా వాడుకోవాలో తెలుసుకుందాం!

ధనియాలను చల్లి కొత్తిమీర మొక్కలను వంటల్లో వాడుకోవడం మనకు అలవాటే! అయితే వీటితో పాటు ఇంకొన్ని రకాల మైక్రోగ్రీన్స్‌ను కూడా సులభంగా ఇళ్లలోనే పెంచుకోవచ్చు. పోషక విలువలు కలిగిన మైక్రోగ్రీన్స్ వంటకాలకు రుచి, రంగులను అందిస్తాయి. వీటిని వంటకాల అలంకరణకు వాడుకోవచ్చు. స్మూదీల్లో కలుపుకోవచ్చు. పచ్చిగా కూడా తినొచ్చు. మొలకల నుంచే మైక్రోగ్రీన్స్ పెరుగుతాయి. అయితే మొలకలు అంటే, అప్పుడే మొలకెత్తే దశలో ఉన్న విత్తనాలు. మొలకెత్తడం మొదలుపెట్టిన రెండో రోజే వాటిని వాడుకోవచ్చు. కానీ మొలకలు మైక్రోగ్రీన్స్‌గా మారాలంటే వాటికి ఆకులు పెరగాలి. మొదటి రెండు ఆకులు పెరిగినప్పుడు ఆ మొక్క మైక్రోగ్రీన్‌గా మారుతుంది.

ఆరోగ్య ప్రయోజనాలు

మైక్రోగ్రీన్స్‌తో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఖనిజలవణాలు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వీటిలో పుష్కలంగా ఉంటాయి. ఇవి కీలకమైన జీవక్రియలకు తోడ్పడతాయి. శరీరం తనలోని ఫ్రీ ర్యాడికల్స్ అనే అస్థిరమైన వ్యర్థ అణువులను బయటకు పంపించడంలో యాంటీ ఆక్సిడెంట్లు సహాయపడతాయనే విషయం అందరికీ తెలిసిందే! సహజసిద్ధ శరీర ప్రక్రియలు, కాలుష్యం ఫలితంగీ ఈ ఫ్రీ ర్యాడికల్స్ శరీరంలో పెరుగుతూ ఉంటాయి. కణ నష్టానికి దారి తీసి అంతిమంగా క్యాన్సర్ లాంటి వ్యాధులకు కారణయమ్యే ఈ అణువును సహజసిద్ధంగానే శరీరం కొంత మేరకు నివారించుకుంటున్నప్పటికీ, కొన్ని శరీరంలో పేరుకుపోతూ ఉంటాయి. ఆహారంతో అందే యాంటీఆక్సిడెంట్లు మరీ ముఖ్యంగా వృక్షాధారిత యాంటీఆక్సిడెంట్లు వీటి నివారణకు ఎంతో బాగా తోడ్పడతాయి. పైగా మైక్రోగ్రీన్స్‌లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని పరిశోధనల్లో కూడా రుజువైంది. బ్రాసిలికా కుటుంబానికి చెందిన బ్రొకొలి లాంటి మైక్రోగ్రీన్స్‌లో ఫెనోలిక్ యాంటీఆక్సిడెంట్, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. లెట్యూస్‌లో, కరోటినాయిడ్ యాంటీఆక్సిడెంట్, విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది.



తోటకూర, సబ్జా, మెంతులు, బ్రొకొలి, బీట్‌రూట్, బఠాణీ, స్విస్ చార్డ్, చియా విత్తనాలతో మైక్రో గ్రీన్స్ పెంచుకుని వాడుకోవచ్చు. మైక్రోగ్రీన్స్‌ను ఇళ్లలోనే ఎండ సోకే చోట సులభంగా పెంచుకోవచ్చు.

ఇలా పెంచుకోవాలి

మైక్రోగ్రీన్స్‌ను మట్టిలో లేదా టిష్యూ పేపర్, మట్టి పాత్రలో పెంచుకోవచ్చు. అయితే మొలకలకు భిన్నంగా వీటికి ఎండ అవసరమవుతుంది. మైక్రోగ్రీన్స్ పెరగడానికి రకాన్ని బట్టి, ఒకటి నుంచి మూడు వారాల సమయం పడుతుంది. ఏ మూలిక లేదా కూరగాయ విత్తనాల నుంచి అయినా మైక్రోగ్రీన్స్‌ను పెంచుకోవచ్చు. వాటి రుచి మొక్క రకం మీద ఆధారపడి ఉంటుంది. తోటకూర, సబ్జా, మెంతులు, బ్రొకొలి, బీట్‌రూట్, బఠాణీ, స్విస్ చార్డ్ విత్తనాలతో మైక్రోగ్రీన్స్ పెంచుకుని వాడుకోవచ్చు. మైక్రోగ్రీన్స్‌ను ఇళ్లలోనే ఎండ సోకే చోట సులభంగా పెంచుకోవచ్చు. ఇందు కోసం...

- ఒక ప్లేటు లేదా ట్రే మీద మట్టిని పలుచగా పరుచుకుని, విత్తనాలు చల్లుకోవాలి
- నీళ్లు చల్లుకుని ఎండ సోకే చోట పెట్టుకోవాలి
- ప్రతి రోజూ నీళ్లు చల్లుకుంటూ మట్టిని తేమగా ఉంచుకోవాలి
- రెండు నుంచి మూడు వారాలకు మొక్కలు పెరిగి కోతకు సిద్ధమైపోతాయి
- మట్టి అంటకుండా మొక్కలను కత్తిరించుకున, శుభ్రంగా కడిగి వాడుకోవాలి.
- మట్టికి బదులుగా టిష్యూ పేపర్ లేదా మట్టి పాత్రలను కూడా వాడుకోవచ్చు



ఇలా వాడుకోవాలి

పోషకాలను కలిగి ఉండే మైక్రోగ్రీన్స్ వంటకాల రుచిని కూడా పెంచుతాయి. వీటిని ఎలా తినాలంటే....

- సలాడ్స్, సూప్స్, చపాతీ, బ్రెడ్, పిజ్జాల మీద చల్లుకుని తినొచ్చు
- పండ్ల రసాలు, స్మూదీల్లో కలుపుకుని తాగొచ్చు
- కూరల్లో కలుపుకోవచ్చు
- గుడ్డుసొనతో కలిపి ఆమ్లెట్ వేసుకోవచ్చు




మత్తు వదిలించి.. మనుషుల్ని చేసి..

- ఎన్‌సీబీ డీ అడిక్షన్ కేంద్రాలతో సత్ఫలితాలు
- 536 మందికి చికిత్స పలువురికి పునరావాసం

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల కేసుల్లో అరెస్టయిన వారిలో మత్తుకు బానిసలైన వారిని తిరిగి మామూలు మనుషులుగా మార్చేందుకు తెలంగాణ పోలీసు శాఖ బృహత్తర ప్రయత్నం చేస్తోంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) పర్యవేక్షణలోని డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా మత్తుకు బానిసలైన వారికి చికిత్స అందించి సాధారణ స్థితికి తీసుకురావడమే కాక అవసరమైన వారికి పునరావాసం కూడా కల్పిస్తోంది. సాధారణంగా మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారెవరైనా పట్టుబడితే పోలీసులు వారికి ఎన్‌సీబీ స్టేషన్లలో కౌన్సిలింగ్ ఇప్పిస్తారు. పలు దఫాలుగా జరిగే కౌన్సిలింగ్ అనంతరం చాలామందిలో మార్పు కనిపిస్తుంది. కౌన్సిలింగ్ అనంతరం కూడా మార్పు రాని వ్యక్తులను, మత్తుకు పూర్తిగా బానిసలైన వారిని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, ఎన్‌సీబీ పర్యవేక్షణలో కొనసాగుతున్న డీ అడిక్షన్ కేంద్రాల్లో చేర్పిస్తారు. సైకాలజిస్టులు ఆధ్వర్యంలో అవసరమైన వైద్య చికిత్స అందించి మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని మత్తుకు దూరం చేస్తారు. అయితే, ఇలా మారిన వారికి ఉపాధి లభించే అవకాశాలు చాలా తక్కువ. చాలా కేసుల్లో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు తమ వారి బాధ్యతను తీసుకుంటారు. కొందరిని మాత్రం తమ కుటుంబసభ్యులు పూర్తిగా వదిలేస్తుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన ఎన్‌సీబీ అధికారులు డీఅడిక్షన్ కేంద్రాల నుంచి బయటికి వచ్చే వారికి పునరావాసం కల్పించడంపై దృష్టి పెట్టారు. పోలీసుశాఖ నిర్వహించే పెట్రోల్ బంకులు, ఇతర పోలీసు సంస్థల్లో ఉపాధి కల్పిస్తున్నారు. ఎన్‌సీబీ పర్యవేక్షణలో 26 డీ అడిక్షన్ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటికి అదనంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో కొందరు ఎన్‌జీఓలు నిర్వహించే డీ అడిక్షన్ కేంద్రాలు మరో 12 ఉన్నాయి. రాష్ట్రంలోని ఈ 38 డీఅడిక్షన్ కేంద్రాల్లో ఇప్పటిదాకా 536 మందికి చికిత్స అందించి మామూలు మనుషులను చేశారు. వీరిలో కొందరికి పునరావాసం కూడా కల్పించామని అధికారులు చెబుతున్నారు.

ఎవ్వర్నీ వదలం



(మొదటిపేజీ తరువాయి)

మోదీ సమక్షంలోనే ట్రంప్ భారత్ అధిక సుంకాల గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. "మోదీజీ మీతో ఎంత దోస్తానా ఉన్నా, మీరు కూడా మా వస్తువులపై సుంకాలు తగ్గించాల్సిందే. లేకపోతే మీ దేశ ఉత్పత్తులపైనా అదే స్థాయిలో సుంకాలు తప్పవు" అని ట్రంప్.. మోదీకి అప్పట్లోనే తేల్చిచెప్పారు. దాంతో ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపులకు సిద్ధమైంది. అందులో భాగంగానే గూగుల్, ఫేస్‌బుక్ వంటి ఆన్‌లైన్ యాడ్స్‌పై విధిస్తున్న 6 శాతం ఈక్వలైజేషన్ ట్యాక్స్‌ను ఏప్రిల్ 1 నుంచి ఎత్తివేసింది.

నోరు మెదపని అమెరికా

అయినా ట్రంప్ సర్కార్ నుంచి ఉలుకూ పలుకు లేదు. దీంతో ఏప్రిల్ 2న ప్రకటించే 'పరస్పర సుంకాల' దేశాల జాబితాలో మన దేశం పేరు ఉంటుందా? లేదా? అని అటు ప్రభుత్వం ఇటు పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ సుంకాలతో తీవ్రంగా నష్టపోతామని ఇప్పటికే కొన్ని పరిశ్రమలు ఆందోళన వ్యక్తం చేశాయి. వీలైనంత త్వరగా అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదుర్చుకుని తమను రక్షించాలని కోరాయి. లేకపోతే అమెరికా మార్కెట్లో పోటీపడడం మా వల్ల కాదని స్పష్టం చేశాయి. కొన్ని రంగాలు మాత్రం ఈ సుంకాలతో తమకు పెద్దగా వచ్చే ముప్పేమీ లేదని నింపాదిగా ఉన్నాయి. ఒకవేళ ట్రంప్ సర్కారు ఏప్రిల్ 2న అనుకున్న విధంగానే మన దేశంపైనా ప్రతీకార సుంకాలు విధిస్తే వివిధ రంగాలపై ఆ ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

అమెరికా ప్రాధాన్యత

మన అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా చాలా కీలకం. 2021-24 మధ్య కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే మన మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 18 శాతం, దిగుమతుల్లో 6.22%. గత ఆర్థిక సంవత్సరం రెండు దేశాల మధ్య 19,000 కోట్ల డాలర్ల విలువైన వస్తు ఎగుమతి, దిగుమతులు జరిగాయి. ఇందులో మన దేశానికి దాదాపు 4,500 కోట్ల డాలర్ల మిగులు ఉంది. ట్రంప్ సుంకాలతో ఈ మిగులుకు ఎక్కడ గండి పడుతుందోనని ప్రభుత్వం భయపడుతోంది.

ప్రస్తుత సుంకాలు

ప్రస్తుతం మన ఎగుమతులపై అమెరికా సగటున 2.8 శాతం చొప్పున సుంకాలు విధిస్తోంది. మనం మాత్రం అమెరికా దిగుమతులపై సగటున 7.7 శాతం చొప్పున సుంకాలు విధిస్తున్నాం. రంగాల వారీగా చూస్తే ప్రస్తుతం మన దేశం సగటున అమెరికా పారిశ్రామిక దిగుమతులపై 5.9 శాతం చొప్పున, వ్యవసాయ దిగుమతులపై 37.7 శాతం చొప్పున సుంకాలు విధిస్తోంది. అమెరికా మాత్రం సగటున మన పారిశ్రామిక ఉత్పత్తులపై 2.6 శాతం, వ్యవసాయ ఉత్పత్తులపై 5.3 శాతం చొప్పున సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు ట్రంప్ ఈ లోటు పూడ్చుకునేందుకు అన్ని భారత ఎగుమతులపై మన స్థాయిలోనే సుంకాలు విధిస్తే మనకు తీవ్ర నష్టం తప్పదని పారిశ్రామిక వర్గాల ఆందోళన.

ఇంకా సస్పెన్స్

మరోవైపు ట్రంప్ ఏప్రిల్ 2న ప్రతీకార సుంకాల దేశాల జాబితా ప్రకటిస్తారా? లేక వాయిదా వేస్తారా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. కొత్త పెట్టుబడులు వచ్చి దేశీయ ఉత్పత్తి పెరగడం దేవుడెరుగు. ముందు ఈ సుంకాలతో అమెరికాలో వస్తు, సేవల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం కొండెక్కే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో మిత్ర దేశాలకు మాత్రం కొద్దిగా విరామం ఇచ్చి చైనాపై మాత్రం భారీగా సుంకాల భారం మోపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

వ్యవసాయం

వ్యవసాయ ఉత్పత్తులపైనా భారత్ సుంకాలు గణనీయంగా తగ్గించాలని ట్రంప్ సర్కార్ కోరుతోంది. బీటీఏపై ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చల్లోనూ ఇందుకోసం అమెరికా పట్టుబట్టినట్టు సమాచారం. ముఖ్యంగా గోధుమ, బియ్యం వంటి ఆహార ధాన్యాలతో పాటు పాడి ఉత్పత్తుల దిగుమతులపైనా భారత్ సుంకాలు తగ్గించాలని పట్టుబట్టింది. ప్రభుత్వం ఇందుకు ససేమిరా అనడంతో కనీసం తమ దేశం నుంచి దిగుమతయ్యే ఆపిల్స్, బాదం, పిస్తా వంటి ఉత్పత్తులపైనైనా తగ్గించాలని కోరింది. ప్రభుత్వం కూడా ఈ విషయంలో ఒక మెట్టు దిగి గోధుమ, బియ్యం, పాడి ఉత్పత్తులపై తప్ప మిగతా వాటిపై సుంకాల ఎత్తివేత లేదా కనీస స్థాయికి తగ్గించేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

ఫార్మా రంగం

ట్రంప్ ప్రతీకార సుంకాలతో నష్టపోయే రంగాల్లో ఫార్మా ఒకటి. ప్రస్తుతం అమెరికాలో అమ్మే జెనెరిక్ ఔషధాల్లో 40 శాతం మన దేశ కంపెనీల నుంచే సరఫరా అవుతున్నాయి. డాక్టర్ రెడ్డీస్, సిప్లా, నాట్కో వంటి హేమా హేమీ కంపెనీలకు కూడా అమెరికానే ప్రధాన మార్కెట్. ప్రస్తుతం ఈ దిగుమతులను అమెరికా జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. మనం మాత్రం అమెరికా ఔషధ దిగుమతులపై 10 శాతం వరకు దిగుమతి సుంకం విధిస్తున్నాం. మన కంపెనీలు ఎగుమతి చేసే జెనెరిక్ ఔషధాలపై లాభాలు చాలా తక్కువ. ట్రంప్ అన్నంత పని చేస్తే ఏప్రిల్ 1 నుంచి మన ఎగుమతులపైనా అమెరికాలో 10 శాతం డ్యూటీ అమల్లోకి వస్తుంది. అప్పుడు ఉన్న ఆ కాస్తా లాభాలు కూడా భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందని పరిశ్రమ వర్గాలు భయపడుతున్నాయి. ఫార్మాగ్జిల్ మాజీ డైరెక్టర్ జనరల్ ఉదయ భాస్కర్ మాత్రం.. ట్రంప్ సర్కారు మన ఫార్మా ఎగుమతులపై 10 శాతం సుంకం విధించినా మన పరిశ్రమకు పెద్దగా నష్టమేం లేదన్నారు. అమెరికన్ల వైద్య బిల్లులు పెరిగి వారే ఎక్కువగా నష్టపోతారని చెప్పారు. ఒకవేళ అమెరికా తనంతట తాను ఈ జెనెరిక్ ఔషధాలను తయారు చేసుకోవాలనుకున్నా.. మన నుంచి దిగుమతి చేసుకునే ధర కంటే 30 శాతం ఎక్కువ ఖర్చవుతుందన్నారు. అందుకు ఒకటి రెండేళ్ల సమయమూ పడుతుందన్నారు.

- (ఆంధ్రజ్యోతి బిజినెస్ డెస్క్)



ఆటోమొబైల్ రంగం

ప్రస్తుతం మన కార్లేవీ అమెరికాకు పెద్దగా ఎగుమతి చేయడం లేదు. ఆటోమొబైల్ విడి భాగాలు మాత్రం పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్నాయి. ఈ ఎగమతులను అమెరికా జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. మన మాత్రం అమెరికా నుంచి దిగుమతయ్యే ఖరీదైన కార్లు, బైకులపై 30 నుంచి 50 శాతం, ఆటోమొబైల్ విడి భాగాలపై 10-15 శాతం చొప్పున సుంకం విధిస్తున్నాం. ఇప్పటికే ట్రంప్ ఒత్తిడికి లొంగి మోదీ సర్కారు హార్లే డేవిడ్‌సన్ వంటి ఖరీదైన బైకులపై దిగుమతి సుంకాన్ని సగానికి తగ్గించింది. అది చాలదు. ఇంకా తగ్గించాల్సిందేనని ట్రంప్ సర్కారు పట్టుపడుతోంది. దీనికి కూడా ప్రభుత్వం లొంగిపోయినట్టు తెలుస్తోంది. దేశీయ ఆటోమొబైల్ విడి భాగాల పరిశ్రమ మాత్రం అమెరికా ఆటోమొబైల్ విడి భాగాలపై దిగుమతి సుంకాన్ని జీరోకి తగ్గించినా మనకు ఎలాంటి నష్టం లేదని చెబుతోంది. మన కంటే తక్కువ ధరకు వీటిని తయారు చేసి అమెరికా కంపెనీలు మనకు ఎగుమతి చేయలేవన్నది ఆ కంపెనీల నమ్మకం.



మత్స్య పరిశ్రమ

భారత మత్స్య పరిశ్రమకు అమెరికా పెద్ద మార్కెట్. ముఖ్యంగా రొయ్యలు, ప్రాసెస్ చేసిన ఇతర మత్స్య ఉత్పత్తులు మన దేశం నుంచి ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. ఇప్పుడు అమెరికా ఈ దిగుమతులను జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. మనం మాత్రం అమెరికా మత్స్య దిగుమతులపై 30 శాతం సుంకం విధిస్తున్నాం. ప్రతీకార సుంకాలు అమల్లోకి వస్తే అమెరికా మార్కెట్లో మన ఎగుమతులపైనా 30 శాతం డ్యూటీ పడుతుంది. అప్పుడు అక్కడ మన ఎగుమతులు ఈక్వెడార్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాలతో పోటీపడడం కష్టమని అక్వా పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మన దేశం అమెరికా మత్స్య దిగుమతులపై సుంకాన్ని జీరోకి తగ్గించినా.. ఉత్పత్తి ఖర్చులు కారణంగా అమెరికా మత్స్య ఉత్పత్తులు మన పరిశ్రమకు ఎలాంటి నష్టం కలిగించలేవని పరిశ్రమ వర్గాలు ప్రభుత్వానికి తెలిపాయి.

చిత్రజ్యోతి

SINCE 1965

నా కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు

పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక



'ఎల్2:ఎంపురాన్' చిత్రంలో కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఇప్పటికే దీనిపై చిత్ర కథానాయకుడు మోహన్‌లాల్ క్షమాపణలు చెప్పారు. తాజాగా చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక స్పందించారు. తన కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఎల్2:ఎంపురాన్' తెర వెనుక ఏం జరిగిందో నాకు బాగా తెలుసు. పృథ్వీరాజ్ సుకుమారన్‌ను అన్యాయంగా నిందిస్తున్నారు. తప్పుడు కథనాలు రాస్తున్నారు. వాటిని చూసి ఓ తల్లిగా ఆవేదన చెందుతున్నా. మోహన్‌లాల్, చిత్ర నిర్మాతలు ఎవరూ తమను పృథ్వీరాజ్ మోసం చేశాడని చెప్పలేదు. ఇప్పుడు ఆయనకు, నిర్మాతలకు తెలియకుండా కొందరు నా కుమారుడిని బలిపశువును చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందరి ఆమోదంతోనే చిత్రం తెరకెక్కింది. కానీ సినిమా విడుదలయ్యాక పృథ్వీరాజ్ మాత్రమే జవాబుదారీ ఎలా అవుతాడు' అని ప్రశ్నించారు.

సరికొత్త పాత్రలో...



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా మరో కొత్త చిత్రం పట్టాలెక్కనుంది. గోపీ ఆచార దర్శకత్వంలో బి.నరేంద్ర రెడ్డి నిర్మించనున్నారు. సోమవారం, ఈ చిత్రాన్ని ప్రకటించిన సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. సుహాస్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. జూలై నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. సినిమాకు సంబంధించిన ఇతర తారాగణాన్ని, సాంకేతిక సిబ్బందిని త్వరలోనే ప్రకటిస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం 'ఓ భామా అయ్యోరామ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు సుహాస్.

శ్రీరామ నవమి కానుకగా



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా గ్లింప్స్ రిలీజ్ డేట్‌పై అప్డేట్ ఇచ్చింది. శ్రీరామ నవమి కానుకగా ఫస్ట్ గ్లింప్స్‌ని ఈనెల 6న విడుదల చేస్తున్నట్లు దర్శకుడు బుచ్చిబాబు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కన్నడ నటుడు శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఆకట్టుకునే ఓ తండ్రి కథ



దిగ్గజ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కీలకపాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'లైఫ్'(లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వంలో కిషోర్ రాఠీ, మహేశ్ రాఠీ, రామస్వామి రెడ్డి నిర్మించారు. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈనెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'చరణ్ సహకారం వల్ల సినిమా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాలో తండ్రి గొప్పదనాన్ని అద్భుతంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం' అన్నారు. మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని తెరకెకించిన చిత్రం ఇదని చరణ్ చెప్పారు.

కుటుంబ కథా చిత్రం



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా దర్శకద్వయం నితిన్-భరత్ తెరకెక్కించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ కుటుంబ కథా చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రదీప్ మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేయడానికి ఈ చిత్రం ఒక మెట్టు అవుతుందని భావిస్తున్నాం' అని అన్నారు. దర్శకులు నితిన్-భరత్ మాట్లాడుతూ 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ 'తన క్యారెక్టర్‌లో ఎన్నో ఎమోషన్స్ ఉంటాయి' అని తెలిపారు.



అమ్మలందరికీ అంకితం

కల్యాణ్‌రామ్

నరసరావుపేట పట్టణంలోని రవికళా మందిర్ థియేటర్‌లో సోమవారం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రం నుంచి 'నాయాల్ది' అనే తొలిపాట విడుదల చేశారు. నందమూరి కళ్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ కార్యక్రమంలో నందమూరి కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని అమ్మలకు అంకితం చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం పడుకునే వరకు మన గురించి ఆలోచించే అమ్మలకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామన్నారు. రాబోయే 20 సంవత్సరాల వరకు ఈ చిత్రం గుర్తుండిపోతుందన్నారు. దర్శకుడు చిలుకూరి ప్రదీప్ మాట్లాడుతూ ప్రేక్షకుల బావోద్వేగాలకు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు. చిత్రంలో పల్నాడు పౌరుషం కనిపిస్తుందని చెప్పారు. నందమూరి కళ్యాణ్‌రామ్‌కు స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య కోటప్పకొండ త్రికోటేశ్వరుని చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో నిర్మాత అశోక్‌వర్ధన్ ముప్పా తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి)

ఈ స్థాయి విజయం ఊహించలేదు

కల్యాణ్ శంకర్



తన తొలి చిత్రం 'మ్యాడ్'తో దర్శకుడిగా సూపర్‌హిట్ అందుకున్నారు కల్యాణ్ శంకర్. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'మ్యాడ్ స్క్వేర్'ను నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో భారీ హిట్ దిశగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు కల్యాణ్. "మొదటి భాగం యువతకు ఎక్కువ చేరువైంది. కానీ రెండో భాగం యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకూ చేరువవ్వడం ఆనందంగా ఉంది. సినిమాకు మంచి స్పందన వస్తుందని ఊహించాం. కానీ, ఈ స్థాయి విజయం అందుకుంటుందని అస్సలు ఊహించలేదు. ఈ సినిమాలో కథ ఉండదు.. కేవలం వినోదం మాత్రమే ఉంటుంది అని ప్రేక్షకులను ముందుగానే సిద్ధం చేయడం కలిసొచ్చింది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్, విష్ణుల నటన, వినోదం, భీమ్స్ సిసిరోలియో సంగీతం, నిర్మాణ విలువలు ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలిచాయి. ఈ విజయం ప్రేక్షకుల ప్రేమాభిమానాలకు అంకితం" అని చెప్పారు.

మరింత చేరువవుతా

వైష్ణవి చైతన్య



'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. సిద్దు జొన్నలగడ్డతో బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఆమె నటించిన 'జాక్' ఈ నెల 10న విడుదలవుతోంది. అలాగే, ఆనంద్ దేవరకొండతో ఓ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా, 'జాక్' సినిమా ప్రమోషన్స్‌లో మీడియాతో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు ఆమె. "ఇప్పటివరకూ అన్నీ సీరియస్ పాత్రలే చేశాను. 'జాక్'లో డ్యూయల్ రోల్ పోషించాను. ఇందులో ఓ పాత్ర చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈ చిత్రంతో కుటుంబ ప్రేక్షకులకు మరింత చేరువవుతాను" అని చెప్పారు.



పూరి మార్క్‌తో

విభిన్నమైన.. విలక్షణమైన పాత్రలతో జాతీయ స్థాయిలో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు విజయ్ సేతుపతి. కొత్తదనం నిండిన కథలతో అలరించే దర్శకుడు పూరి జగన్నాథ్. ఇప్పుడు వీరిద్దరి కలయికలో ఓ చిత్రం రాబోతోంది. చిత్రబృందం ఈ విషయాన్ని ప్రకటించింది. 'ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్‌ఫుల్ కథను రాశారు. ఆయన తనదైన శైలిలో తెరకెక్కించనున్నారు. నటుడిగా విజయ్ సేతుపతిలోని కొత్త కోణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని యూనిట్ తెలిపింది. చార్మీ కౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు.

ఉత్కంఠభరితంగా సాగే...



'అక్కడొకడుంటాడు' ఫేమ్ శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం'. జి.వి.కె దర్శకత్వంలో కె.ఎస్.శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు జి.వి.కె మాట్లాడుతూ "ప్రస్తుతం హారర్ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. ప్రతీక్షణం ఉత్కంఠభరితంగా సాగే ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ప్రేక్షకులను తప్పక మెప్పిస్తుంది. హారర్ చిత్రాల్లో సరికొత్త ఒరవడిని సృష్టిస్తుంది" అని చెప్పారు.

శక్తిమంతమైన పాత్రలో...



'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల, సాక్షిసాగర్ మడోల్కర్ జంటగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్‌రాజ్ దర్శకత్వంలో పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో దర్శకుడు, నటుడు బండి సరోజ్‌కుమార్ 'క్రిస్టోఫర్ నోలన్' అనే ఓ శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, చిత్రంలో ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: కోడాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామమారుతి.ఎం, సంగీతం: కాలభైరవ.

చిన్న షేర్లదే హవా

2024-25లో 8 శాతం పెరిగిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ
మిడ్‌క్యాప్ సూచీ 5.61% అప్
సెన్సెక్స్ 5% వృద్ధి కంటే అధికం



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం స్టాక్ మార్కెట్లో చిన్న షేర్ల హవా కొనసాగింది. ప్రధాన కంపెనీల కంటే అధిక రిటర్నులు పంచాయి. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 5.10 శాతం వృద్ధి చెందగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 8 శాతం ఎగబాకింది. మిడ్‌క్యాప్ సూచీ 5.61 శాతం పెరిగింది. గత అక్టోబరు నుంచి ఈ ఫిబ్రవరి వరకు వరుసగా ఐదు నెలల పాటు భారీగా దిద్దుబాటుకు లోనైన మార్కెట్ సూచీలు.. మార్చిలో మళ్లీ రివ్వున ఎగిశాయి. దీర్ఘకాలం పాటు అమ్మకాలకు పాల్పడిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మళ్లీ మార్కెట్లో కొనుగోళ్లు పెంచడంతో పాటు రిటైల్ మదుపర్ల దన్నుతో సూచీలు మళ్లీ కోలుకున్నాయి. మార్కెట్ రికవరీ ర్యాలీలోనూ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు ప్రధాన సూచీని మించి వృద్ధి చెందాయి. మార్చిలో సెన్సెక్స్ 5.76 శాతం పెరగగా.. స్మాల్‌క్యాప్ సూచీ 8.25 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 7.61 శాతం పుంజుకున్నాయి.

లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి బీజేపీ గెలుపొందడం, యూఎస్ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలతో 2024-25 ప్రథమార్ధంలో మార్కెట్లో రికార్డుల ర్యాలీ కొనసాగింది. గత ఏడాది డిసెంబరు 12న బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 57,827.69 వద్ద ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. గత సెప్టెంబరు 24న మిడ్‌క్యాప్ సూచీ 49,701.15 వద్ద, అదే నెల 27న సెన్సెక్స్ 85,978.25 వద్ద సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠాలను నమోదు చేశాయి.

అయితే, దీర్ఘకాలిక బుల్‌రన్ కారణంగా చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతుండటం, అంతర్జాతీయ అనిశ్చితులు, కార్పొరేట్ కంపెనీల నిరాశాజనక త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు అక్టోబరు నుంచి మన మార్కెట్లోని పెట్టుబడులను ఉపసంహరించుకోవడం మొదలు పెట్టారు. దాంతో ద్వితీయార్ధంలో మార్కెట్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. గత 29 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా వరుసగా ఐదు నెలలు ప్రామాణిక సూచీలు భారీగా దిద్దుబాటుకు లోనయ్యాయి. కాకపోతే, ద్వితీయార్ధం చివరి నెలలో మార్కెట్ మళ్లీ వేగంగా పుంజుకోవడంతో సూచీలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి స్వల్ప వృద్ధినైనా నమోదు చేయగలిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీఎస్ఈ సెన్సెక్స్ 24.85 శాతం వృద్ధి చెందగా.. మిడ్‌క్యాప్ సూచీ ఏకంగా 62.38 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 59.60 శాతం ఎగబాకాయి.

ఎంఎస్ఎంఈల టర్నోవర్, పెట్టుబడుల పరిమితి పెంపు

నేటి నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పెట్టుబడి, టర్నోవర్ పరిమితులు గణనీయంగా పెంచుతూ చేసిన సవరణలు మంగళవారం (ఏప్రిల్ 1) అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వం ఎంఎస్ఎంఈ నిర్వచనాన్ని ఇటీవల సవరించింది. వాటి వృద్ధి, విస్తరణ అవకాశాలు మెరుగు పడి ఉపాధి కల్పనకు ఈ సవరణ దోహద పడుతుంది.

- రూ.2.5 కోట్ల పెట్టుబడి గల కంపెనీలు ఇక నుంచి మైక్రో ఎంటర్‌ప్రైజ్‌లుగా పరిగణనలోకి వస్తాయి. గతంలో ఈ పరిమితి రూ.1 కోటి ఉండేది. వీటి టర్నోవర్ పరిమితిని కూడా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచారు.
- రూ.25 కోట్ల పెట్టుబడి గల సంస్థలు చిన్న పరిశ్రమలుగా వర్గీకరణలోకి వస్తాయి. గతంలో ఇది రూ.10 కోట్లుండేది. వాటి టర్నోవర్ పరిమితిని రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్లకు పెంచారు.
- రూ.125 కోట్ల పెట్టుబడితో ప్రారంభమయ్యే సంస్థలను మధ్యతరహా పరిశ్రమలుగా గుర్తిస్తారు. గతంలో ఈ పరిమితి రూ.25 కోట్లుండేది. వీటి టర్నోవర్ పరిమితిని రూ.500 కోట్లకు పెంచారు.

డిసెంబరు నాటికి విదేశీ అప్పులు రూ.61.38 లక్షల కోట్లు

ఏడాది కాలంలో 10.7 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: గత డిసెంబరు చివరి నాటికి భారత విదేశీ అప్పులు వార్షిక ప్రాతిపదికన 10.7 శాతం పెరిగి 71,790 కోట్ల డాలర్లకు చేరాయని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఈ విలువ సుమారు రూ.61.38 లక్షల కోట్లు. 2023 డిసెంబరు నాటికి మన విదేశీ రుణ భారం 64,870 కోట్ల డాలర్లు (రూ.55.46 లక్షల కోట్లు)గా ఉంది. త్రైమాసిక ప్రాతిపదికన పోలిస్తే, 2024 సెప్టెంబరు చివరి నాటికి 71,270 కోట్ల డాలర్లుగా (రూ.60.93 లక్షల కోట్లు) ఉన్న విదేశీ రుణ భారం.. డిసెంబరు చివరికల్లా మరో 0.7 శాతం పెరిగింది. 2024 ముగిసేసరికి జీడీపీలో విదేశీ రుణభారం నిష్పత్తి 19.1 శాతంగా నమోదైంది. గత సెప్టెంబరు చివరినాటికిది 19 శాతంగా ఉంది. మన ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ కంపెనీలు, బ్యాంక్‌లు, ఇతర ఆర్థిక సంస్థలు, వ్యక్తులు విదేశీ రుణదాతల నుంచి సేకరించిన అప్పులన్నీ ఈ పరిధి లోకి వస్తాయి. గత ఏడాది చివరి నాటికి మొత్తం విదేశీ రుణ భారంలో అత్యధికంగా డాలర్లలో తీసుకున్న అప్పు వాటాయే 54.8 శాతంగా ఉంది. రూపాయల్లో తీసుకున్న విదేశీ రుణ వాటా 30.6 శాతంగా, జపాన్ యెన్‌లలో తీసుకున్న అప్పు 6.1 శాతంగా, యూరోల్లో తీసుకున్న రుణాలు 3 శాతంగా ఉన్నాయి.

2024 సెప్టెంబరుతో పోలిస్తే డిసెంబరు చివరినాటికి మొత్తం విదేశీ రుణాల్లో కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల వాటా తగ్గగా.. ప్రభుత్వయేతర రంగాల వాటా పెరిగింది. మొత్తం విదేశీ రుణంలో ఆర్థికేతర సంస్థలు చెల్లించాల్సిన బకాయిల వాటా 36.5 శాతంగా ఉండగా.. సెంట్రల్ బ్యాంక్ మినహా డిపాజిట్లు స్వీకరించే బ్యాంకింగ్ సంస్థలు చెల్లించాల్సిన వాటా 27.8 శాతంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం వాటా 22.1 శాతంగా, ఇతర ఆర్థిక సేవల సంస్థల వాటా 8.7 శాతంగా ఉంది.

రెనో చేతికి నిస్సాన్ ఇండియా వాటా

న్యూఢిల్లీ: భారత్‌లోని జాయింట్ వెంచర్ సంస్థ రెనో నిస్సాన్‌లో జపాన్ భాగస్వామి నిస్సాన్‌కు చెందిన వాటాలన్నింటినీ కొనుగోలు చేస్తున్నట్టు ఫ్రాన్స్‌కు చెందిన ఆటో దిగ్గజం రెనో ప్రకటించింది. ప్రస్తుతం ఈ జేవీలో నిస్సాన్‌కు 51% వాటా ఉంది. ఈ వాటా కొనుగోలుతో ఈ సంస్థ పూర్తిగా రెనో సొంతం కానుంది. ఈ మేరకు ఉభయ సంస్థల మధ్య షేర్ల కొనుగోలు ఒప్పందం కుదిరినట్టు రెనో వెల్లడించింది. అయితే ఈ లావాదేవీ విలువ ఎంత అన్నది వెల్లడించలేదు. అయితే రెనో.. నిస్సాన్ టెక్నాలజీ అండ్ బిజినెస్ సెంటర్ ఇండియాను (ఆర్ఎన్‌టీబీసీఐ) మాత్రం ఉమ్మడిగానే నిర్వహించనున్నట్టు తెలిపింది. ఈ విభాగంలో నిస్సాన్‌కు 49%, రెనో గ్రూప్‌నకు 51% వాటాలున్నాయి.

అంతర్జాతీయ పరిణామాలే కీలకం!

నేటి నుంచి సరికొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతోంది. గడచిన కొద్ది నెలలుగా మార్కెట్లు మదుపరులకు ఏ మాత్రం అనుకూలంగా లేవు. తీవ్రమైన అనిశ్చితి నెలకొని ఉంది. మరికొన్ని రోజులు ఈ పరిస్థితి తప్పకపోవచ్చు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలు ఏప్రిల్ తొలి వారంలో అమల్లోకి రానున్నాయి. మరోవైపు ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష, అమెరికా ఆర్థిక గణాంకాలు కూడా మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు. వీటిని బట్టి మదుపరులు పొజిషన్స్ తీసుకోవటం మంచిది. మూమెంటమ్‌ను పరిశీలిస్తే పీఎస్‌యూ బ్యాంకులు, ఫైనాన్స్, ఎనర్జీ, హెల్త్‌కేర్, కమోడిటీస్ రంగాలు బుల్లిష్‌నెస్‌ను కనబరిచే వీలుంది.

స్టాక్ రికమండేషన్స్

టాటా కన్స్యూమర్: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం వరకు దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. రూ.880 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ షేరు తాజాగా హయ్యర్ హైఫామ్ చేసింది. చివరి రెండు సెషన్లలో 5 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.1,001 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.990 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,080 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.960 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బ్రిటానియా: ప్రస్తుతం రూ.4,600 స్థాయిలో సపోర్ట్ తీసుకున్న ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. చివరి నాలుగు సెషన్లు లాభాల్లోనే ముగిసింది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.4,936 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,900 స్థాయిలో ప్రవేశించి రూ.5,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,855 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

అపోలో హాస్పిటల్స్: ఈ ఏడాది ఆరంభం నుంచి డౌన్ ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరులో ప్రస్తుతం అక్యుములేషన్ జరుగుతోంది. రూ.6,000 స్థాయిలో రెండుసార్లు సపోర్ట్ తీసుకుని అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ప్రస్తుతం 50 రోజుల మూవింగ్ యావరేజెస్ పైన కదలాడుతోంది. గత శుక్రవారం రూ.6,616 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.6,600 వద్ద పొజిషన్ తీసుకుని రూ.7,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,550 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఆర్‌సీటీసీ: గత ఏడాది జూలై నుంచి ఈ షేరు డౌన్ ట్రెండ్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం భారీ వాల్యూమ్ నమోదవుతుండటంతో అక్యుములేషన్ జరుగుతోందని భావించవచ్చు. పైగా చివరి పది సెషన్లలో 11 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.727 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.770/820 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.675 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ కార్డ్: నష్టాల మార్కెట్లోనూ మంచి లాభాలు నమోదు చేసిన షేరు ఇది. చివరి మూడు నెలల్లో 26 శాతం, చివరి నెల రోజుల్లో 5 శాతం, గత వారం 3 శాతం మేర పెరిగింది. గత ఏడాది సెప్టెంబరు నాటి రూ.820 స్థాయిని అధిగమించిన ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.881 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.850 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,020 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.820 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మధ్యప్రదేశ్‌లో ఏజీఐ గ్రీన్‌ప్యాక్ కొత్త ప్లాంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏజీఐ గ్రీన్‌ప్యాక్ మధ్యప్రదేశ్‌లో రూ.700 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అత్యధిక ఉత్పాదకత, అధిక సామర్థ్యం ఉండే ఈ ప్లాంట్ ఏర్పాటుతో తమ కంటైనర్ గ్లాస్ తయారీ సామర్థ్యం 25% పెరుగుతుందని వెల్లడించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో పని చేస్తున్న ప్లాంట్‌కు ఇది మరింత బలం చేకూర్చేదిగా ఉంటుందని కంపెనీ సీఎండీ సందీప్ సోమానీ తెలిపారు.

అంకుర హాస్పిటల్స్ 165 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహిళలు, చిన్నారులకు సూపర్ స్పెషాలిటీ సేవలందించే అంకుర హాస్పిటల్స్.. ఆసియన్ అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) నుంచి రూ.165 కోట్ల నిధులు సమీకరించింది. తమ విస్తరణ ప్రణాళికలకు ఈ నిధులు ఉపయోగపడతాయని అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, ఎండీ డాక్టర్ కృష్ణ ప్రసాద్ వున్నం తెలిపారు. మార్కెట్లో తమ స్థితిని బలోపేతం చేసుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా అందుబాటు ధరలకు ఆరోగ్య సంరక్షణ కల్పించాలనే తమ దీర్ఘకాలిక విజన్ దీని ద్వారా సాకారం అవుతుందని అన్నారు. విస్తరణ వ్యూహంలో భాగంగా తాము దేశంలోని ప్రధాన నగరాల్లో అత్యాధునిక ఆస్పత్రులు నెలకొల్పాలని చూస్తున్నట్టు తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	455	విజయవాడ	470
వరంగల్	457	గోదావరి	460
చిత్తూరు	520	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	146	విజయవాడ	152
వరంగల్	146	గుంటూరు	152
కరీంనగర్	146	ఒంగోలు	152
మహబూబ్‌నగర్	146	చిత్తూరు	117
కర్నూలు	146	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	122
గోదావరి	152		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	91,910 ▲	84,250 ▲	1,13,000 ▼
విజయవాడ	92,500 ▲	87,000 ▲	1,00,300 ▼
విశాఖపట్నం	89,310 ▲	81,870 ▲	1,00,880 ▲
రాజమండ్రి	91,910 ▲	84,250 ▲	1,03,700 ▼
ప్రొద్దుటూరు	92,050 ▲	85,240 ▲	1,02,000 ▲
ముంబై	89,164 ▲	81,674 ▲	1,00,892 ▲

స్పోర్ట్స్



జొకోకు మెన్సిక్ ఝలక్

మియామీ గార్డెన్స్ (ఫ్లోరిడా): కెరీర్‌లో 100వ టూర్ టైటిల్ గెలుచుకోవాలన్న టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఆశలకు టీనేజర్ జాకబ్ మెన్సిక్ గండి కొట్టాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన మియామీ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19 ఏళ్ల మెన్సిక్ 7-6 (4), 7-6 (4)తో నొవాక్‌ను ఓడించి కెరీర్‌లో తొలి ఏటీపీ టైటిల్ అందుకున్నాడు.



కొత్త కుర్రాడు పడగొట్టాడు

4 వికెట్లతో సత్తా చాటిన అశ్వని కుమార్

ముంబై బోణీ ● కోల్‌కతా చిత్తు
రికెల్టన్ మెరుపు ఇన్నింగ్స్

ముంబై: ఈ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ఎట్టకేలకు విజయం రుచి చూసింది. రెండు వరుస ఓటములతో డీలా పడిన ఈ జట్టు సొంత మైదానంలో ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో అరంగేట్ర పేసర్ అశ్వని కుమార్ (4/24) చిరస్మరణీయ ప్రదర్శనతో మురిపించాడు. అటు బ్యాటింగ్‌లో ఓపెనర్ రికెల్టన్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 62 నాటౌట్) చెలరేగడంతో ముంబై మరో 43 బంతులుండగానే 8 వికెట్ల తేడాతో నెగ్గింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 16.2 ఓవర్లలో 116 పరుగులకు కుప్పకూలింది. రఘువంశి (16 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 26), రమణ్‌దీప్ సింగ్ (12 బంతుల్లో ఓ ఫోర్, 2 సిక్సర్లతో 22) మాత్రమే ఆకట్టుకున్నారు. ముంబై పేసర్ దీపక్ చాహర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 12.5 ఓవర్లలోనే 121/2 స్కోరు చేసి సులువుగా నెగ్గింది. సూర్యకుమార్ (9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 27 నాటౌట్) వేగంగా ఆడాడు. రస్సెల్‌కు రెండు వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా అశ్వని కుమార్ నిలిచాడు.

రికెల్టన్ జోరు: స్వల్ప ఛేదనను ముంబై అలవోకగా పూర్తి చేసింది. ఓపెనర్ రికెల్టన్ మైదానం నలువైపులా షాట్లతో తుదికంటా నిలిచాడు. తొలి ఓవర్‌లో పేసర్ జాన్సన్ ఒక్క పరుగే ఇచ్చినా.. తర్వాత లయ అందుకున్న రికెల్టన్ ఎక్కడా తగ్గలేదు. మూడో ఓవర్‌లో 4,6.. నాలుగో ఓవర్‌లో 4,6,4తో చెలరేగాడు. రోహిత్ (13)తో తొలి వికెట్‌కు 46 పరుగులు జోడించాడు. పవర్‌ప్లేలోనే 55/1 స్కోరు సాధించిన ముంబైని ఆ తర్వాత కూడా కోలల్‌తా బౌలర్లు కట్టడి చేయలేకపోయారు. స్పిన్నర్ నరైన్ ఓవర్‌లోనూ రెండు వరుస సిక్సర్లతో ఆకట్టుకున్న రికెల్టన్ 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. విల్ జాక్స్ (16) తర్వాత బరిలోకి దిగిన సూర్యకుమార్ 4,4,6తో 13వ ఓవర్‌లో మ్యాచ్‌ను ముగించేశాడు.

పేసర్ల ఉచ్చులో..: వాంఖడే అంటేనే బ్యాటింగ్‌కు స్వర్గధామం అంటారు. కానీ అద్భుత బ్యాటింగ్ లైనప్ కలిగిన కోల్‌కతా బ్యాటర్లు.. ముంబై బౌలర్ల ధాటికి తుస్సుమన్నారు. రహానె సేనకు అరంగేట్ర లెఫ్టామ్ పేసర్ అశ్వని కుమార్ చుక్కలు చూపించాడు. అలాగే ఇతర పేసర్లు బౌల్ట్, చాహర్ కట్టుదిట్టమైన బంతులకు కేకేఆర్ బ్యాటర్లకు ఆరంభం నుంచే దిక్కుతోచలేదు. దీంతో పరుగులు కాదు కదా.. కనీసం వికెట్లు కాపాడుకోలేని పరిస్థితి ఎదురైంది. రఘువంశి మాత్రమే అత్యధికంగా 16 బంతులు ఎదుర్కోగలిగాడు. తొలి ఓవర్‌లోనే అదిరే అవుట్ స్వింగర్‌తో ఓపెనర్ నరైన్‌ను బౌల్ట్ డకౌట్ చేశాడు. ఇక చివరి మ్యాచ్‌లో 97 రన్స్‌తో రాణించిన మరో ఓపెనర్ డికాక్ (1)ను చాహర్ అవుట్ చేయగా 2/2 స్కోరుతో కేకేఆర్ కష్టాలు మొదలయ్యాయి. ఇక అశ్వని తన తొలి బంతికే కెప్టెన్ రహానె (11) పనిబట్టి తన రాకను ఘనంగా చాటుకున్నాడు. ఈ దశలో రఘువంశి భారీ షాట్లకు వెళ్లి ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ మరో ఎండ్‌లో వెంకటేశ్ అయ్యర్ (3)ను చాహర్ వెనక్కి పంపడంతో కేకేఆర్ పవర్‌ప్లేలో 41/4 స్కోరుతో ఇబ్బందికర స్థితిలో పడింది. రఘువంశిని హార్దిక్ పెవిలియన్ చేర్చాక.. మిగతా బ్యాటర్లు అశ్వనిని ఎదుర్కోవడంలో తడబడ్డారు. ఆరో వికెట్‌కు 29 పరుగులు జోడించి కుదురుకుంటున్న దశలో రింకూ సింగ్ (17), మనీశ్ పాండే (19)లను 11వ ఓవర్‌లో అశ్వని వెనక్కి పంపాడు. అయినా క్రీజులో రస్సెల్ (5), రమణ్‌దీప్ ఉండడంతో భారీ స్కోరుపై కేకేఆర్ ఆశలు వదులుకోలేదు. కానీ అశ్వని తన తర్వాతి ఓవర్‌లోనే ప్రమాదకర రస్సెల్‌ను బౌల్ట్ చేసి ముంబై శిబిరంలో సంతోషం నింపాడు. రమణ్‌దీప్ రెండు సిక్సర్లతో 100 రన్స్ దాటించినా 17వ ఓవర్‌లో అతడిని శాంట్నర్ అవుట్ చేయడంతో కోల్‌కతా ఆట ముగిసింది.

1 — ఐపీఎల్ అరంగేట్రంలోనే నాలుగు వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా అశ్వని కుమార్. అలాగే ఐపీఎల్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో తన మొదటి బంతికే వికెట్ తీసిన నాలుగో బౌలర్‌గానూ నిలిచాడు.

ఎవరీ అశ్వని కుమార్?

ఈ సీజన్‌లో ముంబై పరిచయం చేసిన మరో సంచలనం 23 ఏళ్ల లెఫ్టామ్ పేసర్ అశ్వని కుమార్. ఈ పంజాబ్ కుర్రాడు తన అరంగేట్ర మ్యాచ్‌లోనే పదునైన పేస్‌తో రహానె, రింకూ, మనీష్, రస్సెల్‌ల వికెట్లు తీసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. వాస్తవానికి అశ్వని డెత్ బౌలర్ స్పెషలిస్టు. 2023-24 షేర్ ఏ పంజాబ్ టీ20 టోర్నీలో అతను ఎక్కువ వికెట్లు తీసిన ఆటగాడిగా నిలిచాడు. దీంతో అశ్వని నైపుణ్యాన్ని పసిగట్టిన ముంబై ఇండియన్స్ జట్టు వేలంలో రూ.30 లక్షలకే అతడిని దక్కించుకుంది. అయితే చివరి సీజన్‌లో అశ్వనిని పంజాబ్ కింగ్స్ జట్టులోకి తీసుకున్నా బెంచ్‌కే పరిమితం చేయడం గమనార్హం.

ఐపీఎల్‌లో నేడు

వేదిక	లఖ్‌నవూ	
లఖ్‌నవూ X పంజాబ్	రా.7.30	



1 — ఒకే ప్రత్యర్థి (కోల్‌కతా)పై ఒక వేదికలో ఎక్కువ విజయాలు (10) సాధించిన జట్టుగా ముంబై

స్కోరుబోర్డు

కోల్‌కతా: డికాక్ (సి) అశ్వని కుమార్ (బి) చాహర్ 1, నరైన్ (బి) బౌల్ట్ 0, రహానె (సి) తిలక్ (బి) అశ్వని కుమార్ 11, రఘువంశి (సి) నమన్ ధిర్ (బి) హార్దిక్ 26, వెంకటేశ్ (సి) రికెల్టన్ (బి) చాహర్ 3, రింకూ (సి) నమన్ ధిర్ (బి) అశ్వని కుమార్ 17, మనీష్ పాండే (బి) అశ్వని కుమార్ 19, రస్సెల్ (బి) అశ్వని కుమార్ 5, రమణ్‌దీప్ (సి) హార్దిక్ (బి) శాంట్నర్ 22, హర్షిత్ (సి) నమన్ ధిర్ (బి) విఘ్నేశ్ 4, జాన్సన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం: 16.2 ఓవర్లలో 116 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-2, 3-25, 4-41, 5-45, 6-74, 7-80, 8-88, 9-99, 10-116; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-23-1, దీపక్ చాహర్ 2-0-19-2, అశ్వని కుమార్ 3-0-24-4, హార్దిక్ 2-0-10-1, విఘ్నేశ్ 2-0-21-1, శాంట్నర్ 3.2-0-17-1.

ముంబై: రోహిత్ (సి) హర్షిత్ (బి) రస్సెల్ 13, రికెల్టన్(నాటౌట్) 62, విల్ జాక్స్ (సి) రహానె (బి) రస్సెల్ 16, సూర్యకుమార్ (నాటౌట్) 27, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 12.5 ఓవర్లలో 121/2; వికెట్ల పతనం:** 1-46, 2-91; **బౌలింగ్:** జాన్సన్ 2-0-14-0, హర్షిత్ 2-0-28-0, వరుణ్ 3-0-12-0, రస్సెల్ 2.5-0-35-2, నరైన్ 3-0-32-0.

సీఓఈలో చేరిన శాంసన్



బెంగళూరు: రాజస్థాన్ రాయల్స్ తరఫున వికెట్ కీపింగ్ చేసేందుకు ఆ జట్టు కెప్టెన్ శాంసన్ ఎదురు చూస్తున్నాడు. దీంట్లో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)లో ఫిట్‌నెస్ టెస్టు కోసం అతను బెంగళూరు వచ్చాడు. కుడిచేతి చూపుడు వేలికి సర్జరీ తర్వాత సంజూకు ఐపీఎల్‌లో బ్యాటర్‌గా ఆడేందుకు మాత్రమే గతంలో అనుమతిచ్చారు. దీంతో రాజస్థాన్ తొలి మూడు మ్యాచ్‌ల్లో సంజూ ఇంపాక్ట్ ప్లేయర్‌గానే బరిలోకి దిగాడు. ఇప్పుడు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ కోసం మరోసారి పరీక్షలో పాల్గొననున్నాడు. ఒకవేళ అతడికి కీపింగ్ క్లియరెన్స్ లభిస్తే శనివారం పంజాబ్‌తో మ్యాచ్‌లో జట్టు కెప్టెన్‌గానూ వ్యవహరిస్తాడు.

హాకీ ఆసియా కప్‌నకు రాజ్‌గిర్ ఆతిథ్యం

న్యూఢిల్లీ: ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నీకి బిహార్‌లోని రాజ్‌గిర్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2026 హాకీ ప్రపంచ కప్‌నకు అర్హతగా భావిస్తున్న ఈ టోర్నీ ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 7 వరకు జరగనుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	2	2	0	0	4	2.266
ఢిల్లీ	2	2	0	0	4	1.320
లఖ్‌నవూ	2	1	1	0	2	0.963
గుజరాత్	2	1	1	0	2	0.625
పంజాబ్	1	1	0	0	2	0.550
ముంబై	3	1	2	0	2	0.309
చెన్నై	3	1	2	0	2	-0.771
హైదరాబాద్	3	1	2	0	2	-0.871
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
కోల్‌కతా	3	1	2	0	2	-1.428

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

రియాన్ పరాగ్‌కు రూ.12 లక్షల జరిమానా



గువాహటి: చెన్నైతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ బౌలర్లు నిర్ణీత సమయానికి ఓవర్ల కోటాను పూర్తి చేయలేకపోయారు. దీంతో నిబంధనల ప్రకారం జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్‌పై రూ.12 లక్షల జరిమానా విధించారు. ఇక, గుజరాత్‌తో మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగానే ముంబై జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపైనా జరిమానా పడిన విషయం తెలిసిందే.

విండీస్ టెస్టు కెప్టెన్సీకి బ్రాత్‌వైట్ రాజీనామా

టీ20 సారథిగా హోప్

సెయింట్ జాన్స్: వెస్టిండీస్ టెస్టు జట్టు కెప్టెన్‌గా క్రెయిగ్ బ్రాత్‌వైట్ (32) తప్పుకొన్నాడు. నాలుగేళ్లపాటు విండీస్ జట్టుకు బ్రాత్‌వైట్ సారథ్యం వహించాడు. కాగా, వన్డే కెప్టెన్‌గా ఉన్న షాయ్ హోప్‌కు టీ20 పగ్గాలు కూడా అప్పగించారు. ఇప్పటిదాకా రోవ్‌మన్ పావెల్ టీ20 సారథిగా ఉన్న సంగతి తెలిసిందే. జూన్‌లో స్వదేశంలో ఆస్ట్రేలియాతో విండీస్ టెస్టు సిరీస్ ఆడనుంది. మరికొద్ది రోజుల్లో టెస్టులకు కొత్త సారథిని ప్రకటిస్తామని క్రికెట్ వెస్టిండీస్ తెలిపింది. 2021లో జేసన్ హోల్డర్ స్థానంలో బ్రాత్‌వైట్ నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో 27 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాపై విండీస్ టెస్టు మ్యాచ్ నెగ్గింది.

సచిన్, విశాల్ నేరుగా సెమీస్‌కు

ఫస్ట్రాగ్వసు (బ్రెజిల్): ఆరంభ వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత స్టార్లు సచిన్ (60 కిలోలు), విశాల్ (90 కిలోలు)లకు తొలి రౌండ్‌లో బై లభించింది. దాంతో ఈ ఇద్దరు బాక్సర్లు నేరుగా సెమీఫైనల్ నుంచే తలపడనున్నారు. భారత్ నుంచి మొత్తం 10 మంది బాక్సర్లు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. నరేందర్ బేర్వల్ భారత బృందానికి నాయకత్వం వహిస్తున్నాడు.

పటౌడీ ట్రోఫీకి రిటైర్మెంట్?

న్యూఢిల్లీ: భారత-ఇంగ్లండ్ ద్వైపాక్షిక సిరీస్ విజేతకు ప్రదానం చేసే మన్సూర్ అలీఖాన్ (ఎంఏకే) పటౌడీ ట్రోఫీకి రిటైర్మెంట్ ఇచ్చే యోచనలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఉన్నట్టు సమాచారం. ఇంగ్లండ్-భారత్ మధ్య టెస్టు మ్యాచ్ జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని 2007లో ఈ ట్రోఫీని ఆరంభించారు. అయితే, ఈసీబీ నిర్ణయంపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా లేదు. కానీ, ఈ ట్రోఫీ స్థానంలో ఇరు దేశాలకు చెందిన ఇద్దరు దిగ్గజ క్రికెటర్ల పేరున కొత్త ట్రోఫీని ఆవిష్కరిస్తారని తెలుస్తోంది. పటౌడీ కుటుంబ సభ్యులకు ఈ మేరకు సమాచారం ఉందట. టెస్టు సిరీస్‌లో భాగంగా జూన్-జూలైలో భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించనుంది.

రేపు బీసీల పోరుగర్జన

(మొదటిపేజీ తరువాయి)

కూడా పాల్గొంటున్నారు. మరోవైపు.. ఎంఐఎం అధినేత అసదుద్దీన్, సీపీఐ నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, టీజేఎస్ అధినేత కోదండరాం ధర్నాకు హాజరు కానున్నారు. కాగా, రాజ్యాంగ సవరణ ద్వారా 50శాతానికి మించి రిజర్వేషన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తమిళనాడు అన్న సంగతి తెలిసిందే. ఆ రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న డీఎంకే తరఫున కనిమొళి మహా ధర్నాలో పాల్గొననున్నారు. మరోవైపు.. అసెంబ్లీలో బీసీ బిల్లులకు తెలంగాణ బీజేపీ మద్దతు ఇచ్చినా.. మహాధర్నాలో ఆ పార్టీ ప్రతినిధులు పాల్గొంటారా? లేదా? అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. వివిధ రాష్ట్రాలకు చెందిన బీసీ నేతలు సైతం ఈ ధర్నాలో పాల్గొని మద్దతు తెలపనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న జాజుల .. మంగళవారం వివిధ పార్టీలు, సంఘాల నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు. ఇదిలా ఉంటే చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక రైలులో పెద్ద ఎత్తున బీసీ సంఘాల నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. బీసీ బిల్లులకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణను ఈ వేదిక ద్వారా బీసీ సంఘాల నేతలు ప్రకటించే అవకాశం ఉంది. కాగా, నియోజకవర్గ పునర్విభజనపై చెన్నైలో జరిగిన జేఏసీ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్, బీఆర్ఎస్.. బీసీ అంశంపైన నిర్వహించనున్న మహాధర్నాలో ఒకే వేదిక పంచుకోనున్నాయి.

ఈ నెలాఖరుకు 'ఎల్ఆర్ఎస్' పొడిగింపు..?

- రాయితీని 15 లేదా 20 శాతానికి తగ్గించే అవకాశం

హైదరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): లే ఔట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) ఫీజు చెల్లింపు గడువును ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. పురపాలక శాఖ ఉన్నతాధికారి ఒకరు ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు రావాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2020లో ఎల్ఆర్ఎస్ కోసం 25,67,107 దరఖాస్తులు వచ్చాయి. అందులో 20 లక్షల మంది దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని లేఖలు పంపారు. ఈ ఏడాది మార్చి 31 వరకు ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించింది. దీంతో ఆదివారం నాటికి 4,01,276 మంది దరఖాస్తుదారులు రూ.1,400 కోట్లు చెల్లించారు. సోమవారం కూడా సర్కారు చెల్లింపులకు అవకాశం ఇచ్చినందున ఆదాయం ఇంకొంచెం పెరిగే అవకాశం ఉంది. ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించాలని నిర్ణయించడంతో.. పెండింగ్‌లో ఉన్న సుమారు 16 లక్షల దరఖాస్తుల నుంచి 40 శాతం మంది ఫీజు చెల్లించే అవకాశం ఉందని పురపాలక శాఖ అధికారులు భావిస్తున్నారు. తద్వారా ఏప్రిల్‌లో మరో రూ.1,000 కోట్ల ఆదాయం రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడు ఇచ్చిన 25 శాతం రాయితీని 15 లేదా 20 శాతానికి తగ్గించే అవకాశం ఉంది.


నీరసంగా.. మగతగా ఉన్నారు!

- బుల్లెట్‌పై వచ్చిన వ్యక్తి ప్రవీణ్ అని తెలియదు
- విశ్రాంతి తీసుకొని వెళ్లమన్నా.. వినలేదు
- ప్రత్యక్ష వివరాలు వెల్లడించిన ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు

విజయవాడ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తులో పోలీసులు అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. విజయవాడలో నాలుగు గంటలు ఎక్కడున్నాడో తేలిపోవడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. రామవరప్పాడు రింగ్ సమీపంలో బైక్‌పై నుంచి కిందపడిన ప్రవీణ్‌ను పైకిలేపిన ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు సోమవారం మీడియాతో మాట్లాడారు. 24వ తేదీ సాయంత్రం జరిగిన పరిణామాలను వివరించారు. "ఆయన ఎవరో నాకు తెలియదు. నీరసంగా కనిపించారు. మగతగా ఉన్నారు. నేను ట్రాఫిక్ బూత్ వద్దకు తీసుకొచ్చాను. సమీపంలోని గార్డెన్‌లో ఆయన నిద్రపోయారు" అని తెలిపారు. రామవరప్పాడు రింగ్ వద్ద పాస్టర్ ప్రవీణ్ ఫొటోలను ఎస్ఐ సుబ్బారావు తీసిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన మాట్లాడుతూ బుల్లెట్‌పై వచ్చిన వ్యక్తి ప్రవీణ్ కుమార్ అనే విషయం తనకు తెలియదని, తలపై హెల్మెట్, మూతికి నలుపు రంగు మాస్క్ ధరించి ఉన్నారని చెప్పారు. గార్డెన్‌లో నిద్రపోతున్న ఆయన్ను.. తాను డ్యూటీ దిగి వెళ్లిపోతున్న సమయంలో లేపానని వివరించారు. ముఖం కడుక్కున్న తర్వాత టీ తాగడానికి తీసుకెళ్లానని చెప్పారు. తర్వాత బుల్లెట్ హెడ్‌లైట్ ఊడిపోవడంతో.. టీస్టాల్‌లో పని చేసే యువకుడిని పిలిచి, సరిచేయమని చెప్పానన్నారు. మగతగా ఉండడంతో రాత్రికి హోటల్‌లో బస చేసి వెళ్లమని సలహా ఇచ్చానని, అయినా ఆయన వెళ్లిపోయారని పేర్కొన్నారు. టీ స్టాల్‌లో పనిచేసే నాగార్జున అనే యువకుడు మాట్లాడుతూ దారంతో హెడ్‌లైట్ కట్టేందుకు ప్రయత్నించానని, అయితే అది ఆగకపోవడంతో ఇనుప తీగ తీసుకురావడానికి వెళ్లానని తెలిపారు. ఎస్ఐ సుబ్బారావు జీపులో తాడు ఉంటే తీసుకురావడానికి వెళ్లారని, ఇద్దరం తిరిగి వచ్చేటప్పటికీ ప్రవీణ్ ట్రాఫిక్ బూత్ వద్ద కనిపించలేదని తెలిపారు.

టూరిజం హబ్‌గా రామప్ప

- సాస్కి స్కీం ద్వారా కేంద్రం రూ.73 కోట్లు మంజూరు
- త్వరలోనే టూరిజం సర్క్యూట్‌గా రూపకల్పన



వెంకటాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా రామప్ప దేవాలయానికి కేంద్ర ప్రభుత్వం సాస్కి స్కీం ద్వారా రూ.73.74కోట్లు మంజూరు చేసింది. రామప్ప ఆలయానికి పక్కనే సరస్సు, దాని సమీపంలో భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కోటగుళ్లు, చెరువు ఇతర ప్రదేశాలను ఓ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసి పలు సౌకర్యాలు కల్పించబోతున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

చేపట్టే పనులు ఇవే!

రామప్ప సర్క్యూట్‌లో టూరిస్టులు సౌకర్యంగా బస చేయడానికి కాటేజీలతోపాటు హస్తకళ బజార్, శిల్పాల గార్డెన్, ఆంపి థియేటర్, లేక్‌వ్యూ కాటేజీలు, బొటానికల్ గార్డెన్, పిల్లల ఆట స్థలాలు, బోటింగ్ పాయింట్ నిర్మించనున్నారు. రామప్ప ఆలయం, కాకతీయ రుద్రేశ్వరస్వామి సర్క్యూట్, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం, రామప్ప ద్వీపం, గణపేశ్వరాలయం కోటగుళ్లు, గణప సముద్రం చెరువు, ఇంచర్ల గ్రామంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి మరిన్ని సౌకర్యాలను అందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రామప్ప, కోటగుళ్ల దేవాలయాల్లో శిల్ప తోట, పిల్లల ఉద్యానవనం, మండపానికి పైకప్పు, ల్యాండ్ స్కేపింగ్ ఉంటాయి. రామప్ప ద్వీపంలో థీమ్ ప్లాజా, సీతాకోకచిలుక తోట, ఆటస్థలం, ట్రెక్కింగ్, ఫొటోగ్రఫీ పాయింట్, బోటింగ్ సదుపాయాలు ఉంటాయి.

ఈవీ ఆటో కొనాలంటే ఈజీ కాదు..!

- పాతవి స్క్రాప్ చేస్తేనే కొత్త ఈవీ ఆటో కొనుగోలుకు ఛాన్స్
- త్వరలో నిబంధనల్లో మార్పులు

హైదరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ వాహన(ఈవీ) పాలసీ తీసుకు వచ్చింది. కొత్తగా విద్యుత్ ఆటో కొనుగోలు చేయాలనుకునే వారు నేరుగా షోరూంకు వెళ్లి కొనే పరిస్థితి లేదు. ఇందుకు కారణం పాత ఆటోను తుక్కు(స్క్రాప్) చేసిన వారికే కొత్త విద్యుత్ ఆటో విక్రయించాలనే నిబంధన ప్రస్తుతం అమల్లో ఉంది. జీవనోపాధి కోసం కొత్తగా ఈవీ ఆటో కొనుగోలు చేయాలనుకునే వారికి ప్రస్తుతం ఉన్న నిబంధనలు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్‌తో నడిచే ద్విచక్ర వాహనాలు, కార్లు ఎలాంటి పరిమితులు లేకుండా ఎవరైనా కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్లే ఈవీ ఆటోల విషయంలోనూ సడలింపులు ఇవ్వాలని ఆటో యూనియన్ నాయకులు కోరుతున్నారు. కొత్త ఈవీ ఆటోల కొనుగోళ్లకు సంబంధించి త్వరలో నిబంధనలు మారే అవకాశం ఉందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ జీసీసీ

- ఈ సంవత్సరం చివరికల్లా ప్రారంభం
- నాలుగేళ్లలో 2,300 ఉద్యోగాల కల్పన
- సీఎం రేవంత్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా పేరెన్నికగన్న పెట్టుబడుల నిర్వహణ సంస్థల్లో ఒకటైన వాన్‌గార్డ్.. హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను(జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఆ కంపెనీ ప్రతినిధులు సోమవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు. సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. చర్చల అనంతరం.. ఈ ఏడాది చివరికల్లా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ వెల్లడించింది. వచ్చే నాలుగేళ్లలో దాంట్లో 2,300 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఇన్నోవేషన్ హబ్‌గా పని చేసే ఈ కేంద్రంలో.. కృత్రిమ మేధ, డేటా అనలిటిక్స్, మొబైల్ ఇంజనీరింగ్ రంగాలకు చెందిన ఇంజనీర్లను సత్వరమే నియమించుకోవాలని యోచిస్తోంది. కాగా.. సీఎంను కలిసిన వాన్‌గార్డ్ ప్రతినిధుల బృందంలో ఆ సంస్థ సీఈవో సలీం రాంజీ, ఐటీ డివిజన్ సీఐవో, ఎండీ నితిన్ టాండన్, చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ జాన్ కౌచర్, జీసీసీ-వాన్‌గార్డ్ ఇండియా హెడ్ వెంకటేశ్ నటరాజన్ ఉన్నారు. హైదరాబాద్‌లో వైవిధ్యమైన ప్రతిభ అందుబాటులో ఉందని.. ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం కూడా ఉందని, రాష్ట్ర ప్రభుత్వ సహాయసహకారాలు కూడా బాగున్నాయని సలీం రాంజీ ప్రశంసించారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌ను తమకు అనువైన చోటుగా ఎంచుకున్నామన్నారు. జీసీసీ ఏర్పాటు ద్వారా.. తమ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలను అందించడంతో పాటు ఏఐ, మొబైల్, క్లౌడ్ టెక్నాలజీలో ప్రతిభావంతులైన ఇంజనీర్లకు అవకాశాలు కల్పించే అవకాశం రావడం తమకు సంతోషంగా ఉందన్నారు.



వాన్‌గార్డ్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

ఆనందంగా ఉంది: రేవంత్‌రెడ్డి

వాన్‌గార్డ్ సంస్థ హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా హైదరాబాద్‌ను ప్రపంచ జీసీసీ గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన పేర్కొన్నారు. జీసీసీ ఏర్పాటుకు.. ప్రభుత్వం తరఫున తగిన సహకారాన్ని అందిస్తామని కంపెనీ ప్రతినిధులకు భరోసా ఇచ్చారు.

ఔటర్‌పై టోల్ ఫీజు పెంపు

కి.మీ.కు 4-5 శాతం పెంచుతూ నిర్ణయం.. సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి

- హైదరాబాద్-బెజవాడ మార్గంలో తగ్గింపు



నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ ప్లాజా

హైదరాబాద్ సిటీ/కేతేపల్లి/చౌటుప్పల్ రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు పెరిగాయి. కి.మీ.కు 4-5శాతం మేర పెంచుతూ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్ణయించింది. సాధారణ మోటారు వాహనాలకు ప్రస్తుతం కి.మీ.కు రూ.2.34 పైసలు వసూలు చేస్తుండగా, పెంచిన ధర ప్రకారం రూ.2.44 పైసలు వసూలు చేయనున్నారు. కార్లకు పది పైసలు, భారీ వాహనాలకు 69 పైసల మేర పెంచారు. పెంచిన టోల్ చార్జీలు సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చాయి. పెరిగిన చార్జీలకు అనుగుణంగానే రోజు వారీ, నెలవారీ పాస్‌ల ధరలు ఉంటాయని.. మరిన్నీ వివరాలకు హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు. 2023 ఆగస్టులో ఐఆర్‌బీ సంస్థ రూ.7,360 కోట్లకు ఒప్పందం చేసుకుని 30 ఏళ్లకు ఔటర్‌ను లీజు తీసుకుంది. ఏటా టోల్ చార్జీలను పెంచుకునేలా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అందుకనుగుణంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గతేడాది ఏప్రిల్ 1న టోల్ చార్జీలను పెంచారు. అప్పట్లో కి.మీ.కు 7 పైసల నుంచి 53 పైసల మేర పెంచారు.

విజయవాడ మార్గంలో తగ్గింపు..

తెలుగు రాష్ట్రాలను కలిపే విజయవాడ-హైదరాబాద్ 65వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) తీపి కబురు చెప్పింది. ఈ మార్గంలో టోల్ రుసుమును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు తగ్గిన ధరలు అమలులో ఉంటాయి. ఏటా 10 శాతం మేర పెరిగే టోల్‌చార్జీలు ఈ ఏడాది ఆ మేర తగ్గనున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు 181.5 కి.మీ. మేర రెండు లేన్లుగా ఉన్న ఈ రహదారిని దాదాపు రూ.2వేల కోట్లతో 13 ఏళ్ల క్రితం జీఎంఆర్ సంస్థ బీవోటీ పద్ధతిలో నిర్మించింది. ఆ వ్యయాన్ని రాబట్టుకునేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలో కృష్ణా జిల్లాలోని చిల్లకల్లు వద్ద మూడు టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసింది. 2012 డిసెంబరు 20 నుంచి టోల్‌చార్జీల వసూలును ప్రారంభించింది. జాతీయ రహదారి విస్తరణ పనుల విభాగం సూచించిన నిబంధనల మేరకు వార్షిక సవరణల పేరిట నిర్మాణ సంస్థ ఏటా టోల్ చార్జీలను పెంచుకునే వీలుంది. అయితే గతేడాది జూన్ 31 నుంచి జీఎంఆర్ సంస్థ రహదారి నిర్వహణ, టోల్ వసూళ్ల బాధ్యతల నుంచి తప్పుకుంది. దీంతో జూలై 1 నుంచి టోల్ వసూళ్లు, రహదారి నిర్వహణ బాధ్యతలను ఎన్‌హెచ్ఏఐ వివిధ ఏజెన్సీల ద్వారా నిర్వహిస్తోంది. గతంలో జీఎంఆర్ సంస్థ నిర్వహణలో ఉన్నప్పుడు ఏడాదికోసారి టోల్‌చార్జీలను పెంచుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం ఎన్‌హెచ్ఏఐ టోల్ రుసుము వసూలు చేస్తుండటంతో చార్జీల పెంపునకు బదులు తగ్గించేందుకు నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా మంగళవారం నుంచి టోల్ చార్జీలను తగ్గించి వసూలు చేయనున్నారు. వాహనాల సామర్థ్యం ఆధారంగా ఒక్కో వాహనానికి ఒకవైపు, ఇరువైపులా కలిపి కనిష్ఠంగా రూ.10 నుంచి గరిష్ఠంగా రూ.60 మేర చార్జీలు తగ్గనున్నాయి. కార్లు, జీపులు, వ్యాన్లకు ఒక వైపు ప్రయాణానికి రూ.10, ఇరువైపులా ప్రయాణానికి రూ.15.. బస్సు, ట్రక్కులకు ఒక వైపునకు రూ.20, ఇరువైపులా కలిపి రూ. 25.. 7 యాక్సిల్‌పైన ఉండే భారీ వాహనాలకు ఒక వైపునకు రూ.40, ఇరువైపులా కలిపి రూ.60 వరకు తగ్గాయి. అయితే, టోల్‌ప్లాజాకు 20 కి.మీ. పరిధిలోని గ్రామాల వాహనాలకు నెలవారీ పాస్ చార్జీ రూ.10 పెరిగింది. నిత్యం ఈ రహదారిపై దాదాపు 17-20 వేల వరకు వాహనాలు వెళతాయి. పండుగలు, సెలవు రోజుల్లో ఆ సంఖ్య 10 వేలు అదనంగా ఉంటుంది.


యువవికాసం గడువు 14వరకు పెంపు

మంత్రులకు పథకంపై ప్రగతి సమాచారం ఇచ్చి సలహాలు తీసుకోండి

అధికారులను ఆదేశించిన భట్టి విక్రమార్క



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 14 వరకు ప్రభుత్వం పొడిగించింది. ప్రభుత్వం 5లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యం పెట్టుకుంది. ఈ పథకానికి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులు మార్చి 17 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. దరఖాస్తు కోసం రేషన్‌కార్డులేని వాళ్లకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరయ్యాయి. వీటి జారీలో సాంకేతికపరమైన ఇబ్బందులతో పాటు సిబ్బంది కొరత వల్ల తహసీల్దార్ కార్యాలయాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇక ఉగాది, రంజాన్ వంటి సెలవులు రావడం వల్ల కూడా దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఇలాంటి విషయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం గడువు పెంచింది. గడువు పెంపు విషయాన్ని సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజాభవన్ నుంచి చీఫ్ సెక్రటరీ, సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మంత్రులు జిల్లాలకు వచ్చినప్పుడు పథకానికి సంబంధించిన ప్రగతి సమాచారం అందించి వారి నుంచి సలహాలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలకు పూర్తి సమాచారం ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ మొదలుకొని గ్రౌండింగ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని మండల, పురపాలక కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను భట్టి ఆదేశించారు. ప్రతి జిల్లాలో ఒక యువ అధికారిని నియమించాలన్నారు. ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఎంపికైన లబ్ధిదారులకు పరిశ్రమల శాఖ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ పథకం విజయవంతం కావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



టీపీసీసీ చీఫ్ బ్లాక్ బెల్ట్

ప్రదానం చేసిన ఒకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌కు సోమవారం ఒకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ.. కరాటేలో బ్లాక్ బెల్ట్ డాన్ 7 సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. వెస్ట్ మారేడ్‌పల్లిలోని వైడబ్ల్యూసీఏలో 3 గంటల పాటు జరిగిన కరాటే పరీక్షలో పాల్గొన్న మహేష్ కుమార్‌గౌడ్.. అందులో ఉత్తీర్ణుడయ్యారు. దీంతో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆయనకు బ్లాక్ బెల్ట్ డాన్ 7 సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. విద్యార్థి దశ నుంచీ కరాటేలో ప్రావీణ్యం ఉన్న మహేష్‌గౌడ్.. టీపీసీసీ చీఫ్ అయిన తర్వాత కూడా ప్రాక్టీస్ చేస్తూనే ఉన్నారు. బ్లాక్ బెల్ట్ డాన్ 7 సర్టిఫికెట్ పొందిన అనంతరం మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కరాటే అన్నది తన జీవితంలో ఒక భాగంగా మారిందన్నారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు.. పిల్లలను కంప్యూటర్ కిడ్స్‌ల తయారు చేస్తూ మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుతో పాటుగా క్రీడల పట్లా ఆసక్తి కలిగించాలని, శారీరక ఆరోగ్యానికి క్రీడలు, వ్యాయామం ఎంతో అవసరమన్నారు. తాను ఎంత బిజీగా ఉన్నా కరాటేకు తప్పకుండా సమయం కేటాయిస్తానన్నారు. కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ ఉపాధ్యక్షుడిగా కరాటే పోటీల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కరాటే బ్లాక్‌బెల్ట్ డాన్ 7 సర్టిఫికెట్‌ను తీసుకోవడం తనకు గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. కరాటే పోటీల్లో భాగంగా తాను పలు దేశాల్లో పర్యటించానన్నారు. ఆసియా కరాటే పోటీలను 2027లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేటి నుంచి సన్నబియ్యం పంపిణీ

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున హైదరాబాద్ జిల్లా వాసులకు మాత్రం దొడ్డు బియ్యమే పంపిణీ చేస్తారు. మే నెల నుంచి సన్నబియ్యం అందజేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 17,200 చౌక దుకాణాలున్నాయి. రైస్‌మిల్లులు, ప్రధాన గోదాములు, 181 మధ్యంతర గోదాముల నుంచి ఈ చౌక దుకాణాలకు సన్నబియ్యం తరలించారు. ఉగాది రోజున సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఏప్రిల్ ఒకటి నుంచి అన్ని చౌక దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తారు.

సర్కారీ స్పెషాలిటీ



(మొదటిపేజీ తరువాయి)

పనిచేస్తున్న సూపర్ స్పెషాలిటీ విభాగం వైద్యులను అక్కడికి పంపనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. అలాగే కుత్బుల్లాపూర్ వైద్య కళాశాలకు అనుబంధ ఆస్పత్రిగా అల్వాల్ టిమ్స్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రస్తుతం ఆ వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రిగా మేడ్చల్ మల్కాజ్‌గిరి కొనసాగుతోంది. అల్వాల్ టిమ్స్ అందుబాటులోకి రాగానే కుత్బుల్లాపూర్ వైద్యకళాశాల బోధనాస్పత్రిగా మారనుంది. ఇక మహేశ్వరం వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రిగా ఎల్బీనగర్ టిమ్స్ కొనసాగనుంది. ప్రస్తుతం వనస్థలిపురం ప్రాంతీయ ఆస్పత్రినే దాని అనుబంధ ఆస్పత్రిగా చూపుతున్నారు. ఎల్బీనగర్ టిమ్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత దాన్నే మహేశ్వరం బోధనాస్పత్రిగా చూపనున్నారు. ఈ రెండు బోధనాస్పత్రులకు నర్సింగ్ సిబ్బంది కొరత ఉండదని, కొత్తగా నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఉండబోదని వైద్యవిద్య అధికారులు చెబుతున్నారు. ఎందుకంటే వీటికి అనుబంధంగా నర్సింగ్ కళాశాలలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో చోట 60 సీట్లతో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కళాశాల ఉంటుంది. దాంతో ఒక్కో బోధనాస్పత్రిలో 240 మంది నర్సులు అందుబాటులో ఉంటారని ఉన్నతాధికారులు వెల్లడించారు.

మానవ వనరులకు ప్రతిపాదనలు

మూడు టిమ్స్‌లను ఒక్కో దాంట్లో వెయ్యి పడకలతో నిర్మిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా వైద్య సేవలు అందించాల్సిన నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా స్పెషలిస్టు వైద్యులను నియమించుకోవాల్సివుంటుంది. ఆమేరకు ఒక్కోచోట అదనంగా ఎంతమంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర సహాయక సిబ్బంది అవసరమవుతారో ఇప్పటికే వైద్యవిద్య సంచాలకులు లెక్కలు వేశారు. వారి నియామకానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని ఇటీవలే ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. ఆర్థిక శాఖ ఆమోదం తెలిపితే, ఆ వైద్య సిబ్బంది నియామక బాధ్యతను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు అప్పగించనున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినమైన జూన్ 2 నాటికి సనత్ నగర్ టిమ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యత్నిస్తోంది. ఈ మూడు టిమ్స్‌లను ఆర్అండ్‌బీ పర్యవేక్షణలో శరవేగంగా నిర్మిస్తున్నారు. సనత్‌నగర్ టిమ్స్‌ను మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎల్బీనగర్ టిమ్స్‌ను లార్సెన్ అండ్ టూబ్రో, అల్వాల్ టిమ్స్‌ను డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్టు సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యత్నిస్తోంది.

పాలమూరు గట్టెక్కే దారేది!

- జాతీయహోదా ఇవ్వలేమన్న కేంద్రం
- కృష్ణా ట్రైబ్యునల్-2లో నీటి పంపకాలు తేలిన తర్వాతే తుది అనుమతులు!

హైదరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మరింత సంక్లిష్టంగా మారుతోంది. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేమని ఇటీవల లోక్‌సభలో కేంద్రం ప్రకటించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా దక్కాలన్నా... ఆ ప్రాజెక్టుకు నికర జలాల కేటాయింపు ఉండాలి. కానీ, ఈ ప్రాజెక్టు విషయానికి వస్తే.. మైనర్ ఇరిగేషన్ కింద పొదుపు చేస్తున్న 45.66 టీఎంసీలతో పాటు పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీల్లో ఉమ్మడి ఏపీకి దక్కిన 45 టీఎంసీలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ విషయంపై సీడబ్ల్యూసీ పలు అభ్యంతరాలు లేవనెత్తింది. మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు ఏ విధంగా చేస్తారు? పొదుపు చేస్తున్నారనడానికి ప్రాతిపదిక ఏంటి? వంటి వివరాలన్నీ జతచేసి, నిర్దేశిత ప్రొఫార్మాలో వివరాలు అందించాలని సీడబ్ల్యూసీ కోరగా... రాష్ట్ర ప్రభుత్వం బదులివ్వలేదు. దీనికి తోడు పోలవరం వాటాలో దక్కిన నీటిపై తెలంగాణకు పూర్తి అధికారం లేదని, తెలుగు రాష్ట్రాల మధ్య ఒప్పందం లేదా ట్రైబ్యునల్ తీర్పు తర్వాతే ఆ నీటిపై అధికారం ఉంటుందని రెండేళ్ల కిందటే సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టు అప్రైజల్(సౌత్) డైరెక్టరేట్ స్పష్టం చేసింది. లేదంటే నీటి పంపకాలపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్-2) నిర్ణయం వెలువరించేవరకూ వేచిచూడాల్సిందేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు గత ఏడాది డిసెంబరులోనే పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపించింది. పోలవరం వాటా కింద దక్కిన 45 టీఎంసీల వాటా వివాదం తేలాలంటే తెలుగు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరడం తప్ప మరో మార్గం లేదు. సీడబ్ల్యూసీ కూడా పలుమార్లు ఇదే చెప్పింది. రెండు రాష్ట్రాలు పరస్పర అవగాహన ఒప్పందం చేసుకుంటే ఈ వాటాను వాడుకోవడానికి వీలు చిక్కనుంది. ఆ వివాదం సద్దుమణిగితేనే ఇరు రాష్ట్రాలు కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. అంతే కాదు..మైనర్ ఇరిగేషన్‌లో మిగిలిన 45టీఎంసీలతో ముందుకెళ్లాలన్నా.. ఏపీ అభ్యంతరాలు లేవనెత్తకుండా చూసుకోవాలి. ఒక వేళ ఈ తతంగమంతా పూర్తయి.. నీటి కేటాయింపులు కొలిక్కి వచ్చినా.. జాతీయ హోదా రావాలంటే చాలా ప్రక్రియలు దాటాలి. సీడబ్ల్యూసీలోని అన్ని డైరెక్టరేట్లు అనుమతి ఇచ్చాక, కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి నేతృత్వంలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ సాంకేతిక అనుమతి పొందాలి. ఆ తదుపరి అపెక్స్ కౌన్సిల్ అనుమతి ఇచ్చాక... చివరిగా కీలకమైన ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ తీసుకోవాలి. ఆ తర్వాతే జాతీయ హోదా ఇవ్వాలా... ? వద్దా...? అనే దానిపై కేంద్రం నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. అయితే, సుప్రీం కోర్టు ఇచ్చిన వెసులుబాటు ప్రకారం తాగు నీటి అవసరాల కోసం 7.5టీఎంసీలతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే అవకాశం ఉన్నా.. ఆ దిశగా గత ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే పద్ధతిని అనుసరిస్తుండడంతో 15 నెలలుగా పనుల్లో వేగం మందగించింది.

ప్రజలకు కాంగ్రెస్ వెన్నుపోటు

- హామీల అమలుపై చేతులెత్తేసింది
- ఎక్కడికక్కడ ఆ పార్టీ నేతలను నిలదీద్దాం
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేతులెత్తేసిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, హామీల అమలు కోసం కాంగ్రెస్‌పై ఒత్తిడి తీసుకురావాలని, ఆ పార్టీ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలు బలపడాలంటే.. బీజేపీని గెలిపించాలన్న నినాదంతో స్థానిక ఎన్నికలకు వెళతామని ప్రకటించారు. బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఏప్రిల్ 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో గావ్ ఛలో, బస్తీ చలో అభియాన్ కార్యక్రమాలు, స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర పథకాల లబ్ధిదారులతో సమావేశాలు, వన్ నేషన్ - వన్ ఎలక్షన్ జనజాగరణ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా.. రెండు సీట్లను బీజేపీ గెలుచుకుందని గుర్తు చేశారు. బీజేపీ బలపడాలని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. కాగా, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో నిలవాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం ఆ పరిధిలోని పార్టీ జిల్లా అధ్యక్షులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.



కేయూ ప్రధాన గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులపై పోలీసుల తీరు గర్హనీయం

» ఖండించిన విద్యార్థి యువజన సంఘాలు

» భూముల వేలం నిలిపేయాలి: మానవ హక్కుల వేదిక

» నేడు సీపీఎం ఆధ్వర్యంలో యూనివర్శిటీ వద్ద ధర్నా

హైదరాబాద్ సిటీ/ పంజాగుట్ట/ రాంనగర్/ కేయూ క్యాంపస్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల తీరును రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఖండించాయి. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వీ శ్రీకాంత్, పీ నాగరాజు సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేసి, కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేయూ క్యాంపస్ మొదటి గేట్‌వద్ద, రెండో గేట్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేశారు. భూములు కాపాడుకునేందుకు ఆందోళనకు దిగిన విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గం అని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల వేలం ప్రక్రియను నిలిపేయాలని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, సంజీవ్ డిమాండ్ చేశారు. దానికి బదులు ఆ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు శ్రద్ధ వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. విపక్ష నేతగా ఉన్నప్పుడే వర్శిటీ భూములపై కన్నేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై దేశద్రోహం కేసు పెట్టాలని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏప్రిల్ ఒకటో తేదీన యూనివర్శిటీ ముందు ధర్నా చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటించారు.

ప్రభుత్వంపై బురదచల్లేందుకు బీఆర్ఎస్.. బీజేపీ : టీపీసీసీ

హెచ్‌సీయూ విద్యార్థులను అడ్డం పెట్టుకుని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వంపై బురదచల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. వాస్తవంగా ఆ 400 ఎకరాల భూమి హెచ్‌సీయూది కాదని ప్రభుత్వానిదని తెలిపారు.

ఓయూలో ఆంక్షలను ఎత్తివేయాలి

» వర్సిటీ భూ విక్రయాలు తగదు: మావోయిస్టు నేత జగన్

ఏటూరునాగారం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ప్రభుత్వం విధించిన నిర్బంధ ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఈనెల 13న యూనివర్సిటీలో ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేయకూడదని రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారని, ఈ చర్య రాజ్యాంగ విరుద్ధం, అప్రజాస్వామికం, ఇది దేశ భవిష్యత్తును నాశనం చేస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అలాగే, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. యూనివర్సిటీ విద్యార్థులు నిజాం ప్రభుత్వం నుంచి నేటి ప్రభుత్వాల వరకు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తూనే ఉన్నారని, తెలంగాణ సామాజిక, రాజకీయ, ఆర్థిక పోరాటాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులు దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల ప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, అందులో భాగంగానే వర్సిటీలో కొనసాగుతున్న ప్రజా ఉద్యమాలపై అణిచివేత ఆంక్షలు విధిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఆంక్షలను ప్రభుత్వం ఎత్తివేసే వరకు విద్యార్థులంతా ఐక్యంగా పోరాడాలని జగన్ పిలుపునిచ్చారు.

భూముల వేలం విరమించుకోవాలి: ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయా (హెచ్‌సీయూ)నికి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. హెచ్‌సీయూ భూములను చదును చేయడానికి వచ్చిన జేసీబీలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. ప్రజాపాలనలో విద్యార్థులపై ఉక్కుపాదం మోపడం ఏమిటని ప్రశ్నించారు. యూనివర్శిటీ భూముల అమ్మకాల విషయమై రాష్ట్ర ప్రభుత్వం మొండి పట్టుదలకు వెళ్లకుండా వాటిని రక్షించాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్ తన వద్దే విద్యాశాఖను తన వద్దే అట్టిపెట్టుకుని, విశ్వవిద్యాలయ భూములు వేలానికి పెట్టడం సిగ్గుచేటని అభివర్ణించారు. ఏడో గ్యారంటీ అంటే విశ్వవిద్యాలయ భూములు విక్రయించడమేనా? అని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ


» ఎర్లీబర్డ్‌తో ఏప్రిల్ 30 వరకు అవకాశం

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నుపై రాయితీ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం సంస్థ ప్రకటన విడుదల చేసింది. ఎర్లీ బర్డ్‌లో భాగంగా ఆర్థిక సంవత్సరం పన్ను మొత్తం ముందస్తుగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని జీహెచ్ఎంసీ పేర్కొంది. ఈ అవకాశాన్ని ఆస్తి పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఇలంబరిది కోరారు. ఈ నెల 30 వరకు ఎర్లీ బర్డ్‌లో ఆస్తి పన్ను చెల్లింపునకు అవకాశముంటుంది. 2024-25లో ఎర్లీ బర్డ్‌లో భాగంగా సంస్థకు రూ.800 కోట్ల ఆదాయం వచ్చింది.



కంచ గచ్చిబౌలి స్థలంలోని చెట్లను తొలగించడానికి సిద్ధంగా ఉన్న ఎక్స్‌కవేటర్లు

రగడ.. రగడ!



హెచ్‌సీయూ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య భూముల బదిలీకి సంబంధించి ప్రభుత్వం విడుదలచేసిన ఆధారం

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హెచ్‌సీయూ స్వాధీనం చేసిందని, దానికి బదులుగా వర్సిటీకి సర్కారు 397 ఎకరాలను బదలాయించిందని స్పష్టం చేసింది. దీనిపై అప్పటి వర్సిటీ రిజిస్ట్రార్ సంతకం చేశారని తెలిపింది. సంబంధిత కాపీలను ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) విడుదల చేసింది. అయితే, కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనంటూ టీజీఐఐసీ చేసిన ప్రకటనను హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఖండించారు. దీంతో, ఇప్పుడు ఈ అంశం చర్చనీయంగా మారింది.

హెచ్‌సీయూ భూమి అంగుళం కూడా లేదు

కంచ గచ్చిబౌలిలో వేలానికి ప్రతిపాదించిన 400 ఎకరాల్లో ఒక్క అంగుళం కూడా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ (హెచ్‌సీయూ) భూమి లేదని.. ఆ భూమిపై పూర్తి యాజమాన్య హక్కు తనదేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయినా.. కొంత మంది రాజకీయ నాయకులు, స్థిరాస్తి వ్యాపారులు స్వప్రయోజనాల కోసం విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించింది. ఆ భూమికి యజమాని ప్రభుత్వమేనని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. దానిపై ఎలాంటి వివాదానికి పాల్పడినా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని హెచ్చరించింది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ), విశ్వవిద్యాలయ అధికారుల సమక్షంలో చేపట్టిన సర్వేలో అంగుళం భూమి కూడా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)ది కాదని తేలిందని తేల్చి చెప్పింది. ఆ భూమిలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి ప్రణాళికలో ఎలాంటి చెరువులూ లేవని, అక్కడ ఉన్న రాళ్ల రూపాలను సంరక్షిస్తామని తెలిపింది. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ప్రణాళికలోనూ స్థానిక సుస్థిరాభివృద్ధికి, పర్యావరణ అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఈ భూముల వ్యవహారాన్ని వక్రీకరిస్తున్న విషయం టీజీఐఐసీ దృష్టికి వచ్చిన నేపథ్యంలో వాస్తవాలు ప్రజల ముందు పెడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం, టీజీఐఐసీ విడుదల చేసిన ప్రకటనల ప్రకారం.. కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లోని 534 ఎకరాల 28 గుంటల భూమిని హెచ్‌సీయూ శేరిలింగంపల్లి మండల కార్యాలయానికి స్వాధీనం చేసింది. ఈ మేరకు 2004 జనవరి 31న ఉత్తర్వులు (5763/ఎల్‌సీఐ/2003) జారీ చేసింది. అప్పటి శేరిలింగంపల్లి మండల అదనపు గిర్దావర్ ఆధ్వర్యంలో ఈ బదలాయింపు జరిగింది. దీనిపై అప్పటి రిజిస్ట్రార్ వై.నర్సింహులు, శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారి సంతకాలు చేశారు. దీనికి బదులుగా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 36లో 191 ఎకరాల 36 గుంటలు, సర్వే నంబరు 37లోని 205 ఎకరాల 20 గుంటలు... మొత్తం 397 ఎకరాల 16 గంటల ప్రభుత్వ భూమిని అదే రోజు యూనివర్సిటీకి బదిలీ చేయడం జరిగింది. దీనిపై కూడా అప్పటి వర్సిటీ రిజిస్ట్రార్ వై.నర్సింహులు, శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారి సంతకాలు చేశారు. అప్పుడే యూనివర్సిటీకి భూమిని బదలాయించినందున... ఇప్పుడు సర్వే నంబర్ 25లో వర్సిటీకి భూమి ఉందని వాదించడం సరైంది కాదని తెలిపింది.

సుప్రీం కోర్టులోనూ విజయం

కంచ గచ్చిబౌలిలోని ఈ భూములను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థకు కేటాయించిందని, దీనిపై సుప్రీం కోర్టులో పోరాడి తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించిందని వివరించింది. దాని ప్రకారం.. కంచ గచ్చిబౌలి సర్వే నంబరు 25లోని 400 ఎకరాల భూమిని 2004, జనవరి 13న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడా వసతుల అభివృద్ధి నిమిత్తం ఐఎంజీ అకాడమీ"ఎకి కేటాయించింది. భూమిని సొంతం చేసుకున్న తరువాత ఆ సంస్థ తన ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006, నవంబరు 21న రాష్ట్ర ప్రభుత్వం ఆ కేటాయింపులను రద్దు చేసి, ఆ భూమిని ఏపీ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంట్‌కు కేటాయించింది. దీంతో ఐఎంజీ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ విచారణ అనంతరం.. 2024 మార్చి 7న హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెల్లడించింది. ఆ తీర్పును ఐఎంజీ సంస్థ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే, 2024 మే 3న ఐఎంజీ పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. దీంతో ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానికి దక్కింది. అనంతరం.. శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ నేతృత్వంలో ఆ భూమిని ప్రభుత్వ భూమిగా (అస్తబల్ పోరంబోకు సర్కారీ) నిర్ధారించారు. ఆక్రమణలకు గురికాకుండా పరిశ్రమల అభివృద్ధికి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని టీజీఐఐసీకి సూచించారు. దీంతో ఆ భూమిని తమకు కేటాయించాలని టీజీఐఐసీ 2024 జూన్ 19న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి 2024 జూన్ 24న ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు ఆ 400 ఎకరాల భూమికి సంబంధించి పంచనామా నిర్వహించి, దాన్ని గత ఏడాది జూలై 1న టీజీఐఐసీకి అప్పగించారు. ఆ భూమి ఉమ్మడి హద్దుల గుర్తింపునకు తమ అధికారులకు సహకరించాలని కోరుతూ టీజీఐఐసీ సైబరాబాద్ జోనల్ మేనేజర్.. నిరుడు జూలై 4న హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. జూలై 7న రిజిస్ట్రార్‌ను వ్యక్తిగతంగా కలిసి ప్రతిపాదనలు అందించారు. రిజిస్ట్రార్ సమ్మతితో అదే నెల 19న సర్వే నిర్వహించారు. అదే రోజు హద్దులు నిర్ధారించారు. వాస్తవాలు ఇలా ఉంటే.. కొన్ని మీడియా సంస్థలు ఆ భూమిపై ప్రజలను, విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ప్రభుత్వం ఆరోపించింది.

సర్వే నిర్వహించలేదు: రిజిస్ట్రార్

కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనంటూ టీజీఐఐసీ చేసిన ప్రకటనను హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ ఖండించారు. ప్రభుత్వ వాదన నేపథ్యంలో సోమవారమే ఆయన ప్రకటన విడుదల చేశారు. "2024 జూలైలో అక్కడ ఎలాంటి సర్వే నిర్వహించలేదు. ఇప్పటి వరకు భూమి ఎలా ఉందనే దానిపై ప్రాథమిక పరిశీలన మాత్రమే చేశారు. హద్దులకు అంగీకరించినట్లు టీజీఐఐసీ చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇప్పటి వరకు భూమికి హద్దులు గుర్తించలేదు. దీనిపై హెచ్‌సీయూకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఆ భూమిని వర్సిటీకే ఇవ్వాలని చాలాకాలంగా కోరుతున్నాం. భూమిని కేటాయించడంతోపాటు పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడాలని మరోసారి ప్రభుత్వాన్ని కోరతాం" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. టీజీఐఐసీ అధికారులు చెప్పే దాంట్లో వాస్తవం లేదని, ఒక్కసారి విశ్వ విద్యాలయానికి కేటాయించిన భూమిని తిరిగి వెనక్కి తీసుకోవాలంటే విశ్వవిద్యాలయ కమిటీ ఆమోదం పొందాల్సి ఉంటుందని, ఇప్పటి వరకు అలాంటిది ఏమీ జరగలేదని స్పష్టం చేశారు. చట్టం 13లోని క్లాజ్(9) ప్రకారం రాష్ట్రపతి నియమించిన విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక మండలి ఉంటుందని, దాని అనుమతితో ఈ ప్రక్రియ జరగాల్సి ఉంటుందని తెలిపారు. కానీ, ఈ భూమి విషయంలో అలాంటిది ఏమీ జరగలేదని పేర్కొన్నారు.

50 ఎకరాల్లో పొదల తొలగింపు

కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్లు, పొదలను టీజీఐఐసీ అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య దాదాపు 50 ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. రాళ్ల రప్పలను చదును చేశారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా పనులు కొనసాగించారు. ఆదివారం ఉదయం ఈ పనులను విద్యార్థులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులు, విద్యార్థుల మధ్య జరిగిన తోపులాటతో క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. భూమి వద్దకు విద్యార్థులు ఎవరూ వెళ్లకుండా రోడ్డు మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసుల బలగాలు అడ్డుకుంటున్నాయి. ఆదివారం రాత్రి వాహనాల లైట్ల సాయంతోనే టీజీఐఐసీ అధికారులు చెట్ల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం సాయంత్రం వరకూ పనులు కొనసాగాయి. మొత్తంమీద 50 ఎకరాల వరకూ చదును చేసినట్లు చెబుతున్నారు. టీజీఐఐసీ అధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. అయితే, సోమవారం రాత్రి పనులు జరగలేదు. కానీ, మరిన్ని ఎక్స్‌కవేటర్లను అక్కడికి తీసుకొస్తున్నట్లు కొన్ని వీడియోలు మాత్రం విడుదలయ్యాయి.

ఇద్దరు హెచ్‌సీయూ విద్యార్థుల రిమాండ్

భూమిని చదును చేసేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్లను అడ్డుకున్న కొంతమంది హెచ్‌సీయూ విద్యార్థులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించిన విషయం తెలిసిందే. విద్యార్థులు, పోలీసులకు జరిగిన తోపులాటలో మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. ఆయన కాలుకు ఫ్రాక్చర్ కావడంతో హెచ్‌సీయూలో పీడీఎఫ్ స్కాలర్ రోహిత్‌కుమార్, పీహెచ్‌డీ స్టూడెంట్ ఎర్రం నవీన్‌కుమార్‌పై 329(3), 182(1), 132 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, హెచ్‌సీయూలో సోమవారం కూడా విద్యార్థులు ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డికి శవ యాత్ర నిర్వహించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. పోలీసులు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఉద్రిక్తతల మధ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. హెచ్‌సీయూ గుర్తింపు స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం తరగతులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. వర్సిటీ భూముల్లో నుంచి పోలీసులు, యంత్రాలను తొలగించాలని, భూములను వర్సిటీకి రిజిస్టర్ చేయాలని, భూముల డాక్యుమెంట్లు పారదర్శకంగా ఉండాలని, ఈసీ కమిటీ వెంటనే సమావేశమై మినిట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బహిష్కరణకు ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏ, బీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాల మద్దతు ప్రకటించాయి.

హాస్టళ్ల నుంచి ఈడ్చుకురాలేదు: డీసీపీ

హెచ్‌సీయూలో విద్యార్థులపై ఎలాంటి లాఠీచార్జీ జరగలేదని, విద్యార్థులను హస్టల్స్ నుంచి ఈడ్చుకు వచ్చినట్లు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. భూములను చదును చేయడానికి వచ్చిన అధికారులు, యంత్రాలను అడ్డుకోవడానికి కొంతమంది ప్రయత్నించారని, రాళ్లు, కర్రలతో పోలీసులపై దాడి చేశారని, ఈ ఘటనలో మాదాపూర్ ఏసీపీ కుడి కాలుకు మోకాలు వద్ద, పాదం వద్ద గాయాలయ్యాయని తెలిపారు. ఈ ఘటనలో 53 మందిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించామని, సొంత పూచీకత్తుపై అందరినీ విడుదల చేశామని తెలిపారు. అయితే, హెచ్‌సీయూకి సంబంధం లేని ఇద్దరు బయటి వ్యక్తుల్ని అరెస్టు చేశామని డీసీపీ వివరించారు. వారిలో బి.రోహిత్ కుమార్, ఎర్రం నవీన్ కుమార్ విద్యార్థులు కారని, వారిని జ్యుడీషియల్ రిమాండుకు తరలించామని తెలిపారు.



సోమవారం రాత్రి కంచ గచ్చిబౌలికి చేరుకుంటున్న మరిన్ని ఎక్స్‌కవేటర్లు

హెచ్‌సీయూ భూముల వేలంపై గవర్నర్ స్పందించాలి

రాజభవన్ ఎదుట ఏబీవీపీ నేతల నిరసన

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌సీయూ భూముల వేలంపై గవర్నర్ స్పందించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడికి యత్నించారు. ఏబీవీపీ విద్యార్థి నాయకులు సోమవారం రాత్రి రాజ్‌భవన్ వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సిటీ కార్యదర్శి పృథ్వి తేజ మాట్లాడుతూ హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలను కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కోవాలని చూస్తే అడ్డుకున్న ఏబీవీపీ కార్యకర్తలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. రాష్ట్రమంతా హెచ్‌సీయూ భూముల గురించి ఆందోళన వ్యక్తం చేస్తుంటే రాష్ట్ర ప్రథమ పౌరుడైన గవర్నర్ స్పందించకపోవడం విడ్డూరమని వాపోయారు. ఇప్పటికైనా గవర్నర్ స్పందించి ఆ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ రాజు, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో పర్యావరణ విధ్వంసం ఆపండి

సర్కారు చర్యలను ఖండిస్తున్నాం: కిషన్‌రెడ్డి

» ప్రకృతికి నష్టం కలిగించొద్దు: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

» అవసరమైతే ప్రత్యక్ష కార్యచరణ చేపడతాం: ఈటల



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూలో పర్యావరణ విధ్వంసాన్ని నిలిపివేయాలని కేంద్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని వేలం వేసేందుకు కాంగ్రెస్ సర్కారు తీసుకున్న చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాల గొంతునొక్కడం, విద్యార్థుల ఆందోళనను క్రూరంగా అణిచివేయడం, పచ్చదనాన్ని, జీవ వైవిధ్యాన్ని విధ్వంసం చేయడం, నిధుల కోసం హైదరాబాద్ పర్యావరణాన్ని పణంగా పెట్టడం.. ప్రభుత్వ నిరంకుశ ధోరణికి నిదర్శనమని దుయ్యబట్టారు. ప్రభుత్వ నిర్ణయం ఇక్కడి జీవవైవిధ్యానికి గొడ్డలిపెట్టుగా మారిందని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌కు ఆక్సిజన్ అందిస్తున్న ఈ ప్రాంతపు అటవీ సంపదను, జీవవైవిధ్యాన్ని కాపాడాలని 'ఎక్స్' వేదికగా కోరారు. కాగా, హెచ్‌సీయూ.. తెలంగాణకే తలమానికమని, కొన్ని వేలమంది నిష్ణాతులను తీర్చిదిద్దిందని ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ భూములు అమ్మడం ద్వారా వచ్చే ఆదాయంతో అప్పులు కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. "హైదరాబాద్ లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చింది. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారింది. రేవంత్ రెడ్డి ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో తెలియడం లేదు. విద్యార్థులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ విషయంలో అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. యూనివర్శిటీ భూముల్లో ఎన్నో వనరులు ఉన్నాయని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ భూమి అయినప్పటికీ... ప్రకృతికి నష్టం కలిగించే చర్యలు తీసుకోవడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా బీజేపీ నిజమైన పోరాటం చేస్తుందని చెప్పారు.

రేవంత్.. మీకు మానవత్వం లేదా?

» విద్యార్థినుల జుట్టు పట్టుకుని లాక్కెళ్తారా?

» భూములమ్మితే తప్ప పాలించే పరిస్థితి లేదా?

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీ భూములను రక్షించాలంటూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుపట్టారు. "సీఎం రేవంత్.. మీకు కనీస మానవత్వం లేదా? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూముల రక్షణ కోసం విద్యార్థులు ఆందోళన చేస్తుంటే... వాళ్లను గొడ్డును బాదినట్లు బాదుతారా? అమ్మాయిలని చూడకుండా జుట్టు పట్టుకుని లాక్కెళ్తారా? ఇదేం పద్ధతి? భూములు అమ్మితే తప్ప రాష్ట్రాన్ని పాలించే పరిస్థితి లేదా? రాబోయే తరాలకు గజం భూమి కూడా ఉంచకుండా చేస్తారా? ఇదేం పాలన? అంతమాత్రానికి మీరెందుకు... కేఏ పాల్‌కు అప్పగించినా అదే పని చేస్తారు" అని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, మొత్తం ఘటనపై విచారణ జరపాలని సంజయ్ డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జి జరుగుతుంటే విద్యా కమిషన్ ఏం చేస్తోందని నిలదీశారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని చెప్పారు. కాగా, తెలంగాణలో హరిత విధ్వంసం జరుగుతోందని సంజయ్ ఆరోపించారు. "కాళేశ్వరం ప్రాజెక్టు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం 25లక్షల చెట్లను నరికేసి, హరితహారం పేరుతో కొనోకార్పస్ కల్లోలం తెచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కంచ గచ్చిబౌలిలో చెట్లు నరికి ప్రకృతిని నాశనం చేస్తోంది. గొడ్డలి మారలేదు.. పట్టిన చేతులే మారాయి. తెలంగాణాలో పాలన.. అటవీ నాశన మాఫియా చేతిలో బందీ అయింది" అని ఎక్స్ వేదికగా విమర్శించారు. కాగా, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఫొటో పెట్టకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రూప్-1లో మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇప్పుడు నువ్వు చేస్తున్నదేంటి రేవంత్?!

» హెచ్‌సీయూ పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు

» ఇద్దరు విద్యార్థుల ఆచూకీని సర్కార్ బయటపెట్టాలి

ఈ అంశంపై రాహుల్ స్పందించాలి: కేటీఆర్



హైదరాబాద్, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : "నువ్వు ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రభుత్వ ఆస్తులు అమ్ముకుంటే భవిష్యత్ తరాలకు స్మశానాలకు కూడా జాగలు ఉండవన్నావు కదా.. మరిప్పుడు ప్రభుత్వ భూములు అమ్ముతూ.. నువ్వు చేస్తున్నదేంటి రేవంత్‌రెడ్డీ" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న భూ పరిరక్షణ పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిలుస్తుందని పేర్కొన్నారు. పలువురు హెచ్‌సీయూ సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి అక్కడి పరిస్థితులను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూముల పరిరక్షణకు యూనివర్సిటీ విద్యార్థులు చూపుతున్న తెగువకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. హెచ్‌సీయూలో ఇద్దరు విద్యార్థులను అరెస్టుచేసి జైలుకు పంపినట్లు చెబుతున్నారని, వారి ఆచూకీని ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో హెచ్‌సీయూకు రెండు సార్లు వచ్చి వెళ్లిన రాహుల్‌గాంధీ.. ఇప్పుడు తాజా అంశంపైనా స్పందించాలని కోరారు. బీజేపీతోపాటు ఇతర రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ మాజీ విద్యార్థులైన భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు... ఈ విషయమై ఎందుకు మాట్లాడడం లేదు? విద్యార్థుల తరఫున నిలబడేందుకు వారి మనసు రావడం లేదా? అని నిలదీశారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీల్లో 45,000ఎకరాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. 400 ఎకరాలపై ఎందుకింత దారుణంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వందలాది బుల్డోజర్లతో అక్కడున్న చెట్లు, జంతువులను చంపి.. మరీ వేగంగా కబ్జా చేసే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. హెచ్‌సీయూ చుట్టూ ఉన్న పచ్చదనాన్ని కాపాడుకోగలిగితే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని.. లేదంటే ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

ప్రయాగరాజ్‌లో నిజామాబాద్ విద్యార్థి ఆత్మహత్య

» హాస్టల్ భవనం పై నుంచి దూకిన రాహుల్ చైతన్య


రాహుల్ చైతన్య(ఫైల్)

నిజామాబాద్ అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లాకు చెందిన ఐఐటీ విద్యార్థి ఎం.రాహుల్ చైతన్య(20) ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లాలోని వర్ని మండలం సత్యనారాయణపురానికి చెందిన స్వర్ణలత-కృష్ణప్రసాద్ దంపతుల కుమారుడు రాహుల్ చైతన్య ప్రయాగ్‌రాజ్ ఐఐటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అక్కడి హాస్టల్ భవనం ఐదవ అంతస్తు మీద నుంచి దూకి అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మొదటి సంవత్సరంలో బ్యాక్‌లాగ్ ఉండటం వల్ల మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు తెలిపారు. మూగ, చెవిటి అయిన రాహుల్ జేఈఈ మెయిన్స్‌లో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 52వ ర్యాంకు సాధించి గత ఆగస్టు నెలలో ఆ కళాశాలలో చేరాడు. చేరినప్పటి నుంచి తమకు ఫోన్ కూడా చేయలేదని తల్లిదండ్రులు తెలిపారు. బ్యాక్‌లాగ్ ఉండటం వల్ల ఆరు నెలలుగా చైతన్య కళాశాలకు వెళ్లడం లేదు. కళాశాలలో మూగ, చెవిటి వారికి ప్రత్యేక లెక్చరర్ల ద్వారా తరగతులు నిర్వహించాల్సి ఉన్నా.. అలాంటివి నిర్వహించకపోవడం వల్లే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రాహుల్ తండ్రి సత్యనారాయణపురంలో చిన్న హోటల్ నిర్వహిస్తుండగా, తల్లి గృహిణి. చివరి సారిగా చనిపోయే ముందు రాహుల్ తల్లి స్వర్ణలతకు వీడియోకాల్ చేశాడు. ఆ కాల్ లిఫ్ట్ చేయకపోవడంతో తాను చనిపోతున్నట్లు మెసేజ్ చేశాడు. తండ్రి, తమ్ముడిని జాగ్రత్తగా చూసుకోవాలని మెసేజ్ పెట్టినట్లు తల్లి తెలిపింది.

సైబర్ కి'లేడీ' అరెస్టు.. దేశవ్యాప్తంగా 32 కేసులు

» తెలుగు రాష్ట్రాలకు చెందిన ముఠాలో ఫిజియోథెరపిస్టులు

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టుల పేరుతో అమాయకులను నిలువుదోపిడీ చేస్తున్న తెలుగు రాష్ట్రాల సైబర్ ముఠా ఆటను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కట్టించారు. డీసీపీ ధార కవిత కథనం ప్రకారం.. కొంపల్లికి చెందిన కొత్తపల్లి రితిక, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఫిజియోథెరపిస్టులు జీవన్‌కుమార్, తోట శ్రీనివాసరావు, ఇదే జిల్లా అగ్రహారానికి చెందిన టి.రఘువీర్, మరో ఇద్దరు సైబర్ ముఠాగా ఏర్పడి మోసాలకు పాల్పడుతున్నారు. రితికపై దేశవ్యాప్తంగా 32, తెలంగాణలో మూడు కేసులున్నాయి. గత ఏడాది నవంబరులో చోటుచేసుకున్న ఓ డిజిటల్ అరెస్టు కేసులో దర్యాప్తు ప్రారంభించిన హైదరాబాద్ సిటీ క్రైమ్ పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో ఈ ముఠాను గుర్తించారు. గత మంగళవారం శ్రీనివాసరావు, జీవన్‌కుమార్, రఘువీర్‌ను అరెస్టు చేశారు. రితికను శనివారం అరెస్టు చేసినట్లు డీసీపీ వివరించారు.

రిజర్వేషన్లపై బీసీ సంఘాలతో చర్చించాలి

» సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ ఆర్.కృష్ణయ్య లేఖ

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రిజర్వేషన్ల అంశంపై చర్చించడానికి అఖిలపక్షం, బీసీ సంఘాలతో చర్చలు జరపాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖ వివరాలను బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. స్థానికసంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఆ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొంది దేశవ్యాప్తంగా అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాష్ట్రానికి అధికారం ఉందని సీఎంకు లేఖలో వివరించామన్నారు. ఇప్పటికే బిహార్, తమిళనాడుల్లో అమలు జరుగుతోందన్నారు. జనాభా లెక్కల ప్రకారం విద్య, ఉద్యోగ రంగాల్లో అన్ని వర్గాలకు సమాన వాటా ఇవ్వాలన్నారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షం, బీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి తగిన సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళ్లాలన్నారు.

'సిస్కో' నుంచి రవీంద్రారెడ్డి ఔట్!

» ఏపీ ప్రాజెక్టుల నుంచి పక్కన పెట్టిన సంస్థ

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీడీపీ నేతలపై అసభ్యకర పోస్టులతో చెలరేగిపోయిన ఇప్పాల రవీంద్ర రెడ్డిని సిస్కో యాజమాన్యం రాష్ట్ర ప్రాజెక్టుల నుంచి పక్కన పెట్టింది. గత నెల 25న ఏపీ ప్రభుత్వం సిస్కోతో ఒప్పందం చేసుకుంది. ఆ సమయంలో రవీంద్ర రెడ్డి కూడా అక్కడ ప్రత్యక్షమయ్యారు. సిస్కోలో టెరిటరీ సేల్స్ మేనేజర్‌గా చేస్తున్న రవీంద్రరెడ్డి సదరు సమావేశం సమన్వయ బాధ్యతలు చూశారు. లోకేశ్‌తో కలిసి ఫొటోలు దిగారు. ఈ వ్యవహారంపై టీడీపీ కార్యకర్తలు సామాజిక మాధ్యమాల వేదికగా భగ్గుమన్నారు. రవీంద్రారెడ్డి నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తూ.. ఆయన వైసీపీ హయాంలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, పలువురు పార్టీ నేతలపై పెట్టిన అసభ్యకరమైన పోస్టులను లోకేశ్ 'ఎక్స్' ఖాతాకు ట్యాగ్ చేశారు. దీంతో లోకేశ్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే సిస్కో ప్రతినిధులతో మాట్లాడి, రవీంద్రారెడ్డి ఇకపై ఏపీకి సంబంధించిన ప్రాజెక్టుల్లో పాల్గొనకుండా చూడాలని తన పేషీ అధికారులను ఆదేశించారు. లోకేశ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన మంత్రి ఐటీ విభాగం ఓఎస్‌డీ వినాయకసాయి చైతన్య సిస్కో యాజమాన్యానికి ఘాటుగా లేఖ రాశారు. గతంలో టీడీపీ నేతల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా రవీంద్ర రెడ్డి పెట్టిన అసభ్యకరమైన పోస్టుల ను ఆ లేఖకు జత చేశారు. "రవీంద్ర రెడ్డికి ఏపీలో సిస్కో చేపట్టిన ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం ఉందని మేం భావించడం లేదు. ఏపీలో చేపట్టబోయే ఏ ప్రాజెక్టులోనూ ఆయనను భాగస్వామి చేయవద్దు"అని సిస్కో యాజమాన్యాన్ని ఆ లేఖలో కోరారు. దీనిపై స్పందించిన సిస్కో యాజమాన్యం రవీంద్ర రెడ్డిని ఏపీ ప్రాజెక్టుల నుంచి తప్పించినట్లు లోకేశ్ పేషీకి సమాచారం ఇచ్చింది.

భోజనం చేస్తుండగానే గొంతు కోశారు!

» బావమరిది, మామ, మరో ముగ్గురి ఘాతుకం

» యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుని సరిగా ఏలుకోవడంలేదని దారుణం

» తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో దారుణం


పేరం శివ(ఫైల్)

నల్లజర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బావమరిది అంటే బావ బతుకు కోరేవాడని అంటారు!. కానీ.. యువతిని ప్రేమ పెళ్లి చేసుకుని సక్రమంగా ఏలుకోవడంలేదని బావను సొంత బావమరిది, అతడి తండ్రి (మామ).. మరో ముగ్గురు కలిసి అత్యంత పాశవికంగా హత్య చేశారు. గొంతులో ముద్ద దిగుతుండగానే గొంతుకోశారు. పోలీసులు, ఇరు కుటుంబాల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన పేరం శివ(27) తన ఇంటి పక్కనే ఉన్న రేగుల వెంకటేశు కుమార్తె భానుని నాలుగేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల పాప ఉంది. తరచూ దంపతుల మధ్య గొడవలు జరగడం పెద్దల్లో పెట్టి మళ్లీ రాజీ చేస్తూ వస్తున్నారు. శివ తరచూ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడేవాడు. పెళ్లయినప్పటి నుంచి ఇదే తంతు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట భార్యభర్తల మధ్య మళ్లీ గొడవ జరగడంతో ఆమె పాపను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం తన భార్యను పంపించాలని శివ అత్తింటికి వెళ్లి కోరగా వారు నిరాకరించారు. దీంతో శివ తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం సాయంత్రం శివ మామ రేగుల వెంకన్న, బావమరిది శ్రీరామ్, బంధువులు మంగయ్య, రత్తయ్య, రాజు ఆయిల్ పాం గెలలు కోసే రెండు కత్తులు పట్టుకుని శివ ఇంటికి వెళ్లారు. భోజనం చేస్తున్న శివను వెనక నుంచి పట్టుకుని బావమరిది, మిగిలిన వారు ఒక్కసారిగా కత్తులతో పీక కోసి అత్యంత పాశవికంగా హతమార్చారు. రక్తపు మడుగులో గిలగిలలాడుతూ శివ అక్కడికక్కడే మృతిచెందాడు. శివ మృతదేహాన్ని చూసిన పక్కగదిలో నుంచి వచ్చిన తల్లిదండ్రులు భీతిల్లిపోయారు. బోరుమని రోదించారు. స్థానికులు రావడంతో దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. శివను ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణం వదిలాడు. సీఐ వై.రాంబాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెట్టింగ్ కేసులు.. సీఐడీ చీఫ్ పర్యవేక్షణలో సిట్

» ఐజీ రమేశ్ సహా ఐదుగురి నియామకం

» నేడు డీజీపీ కార్యాలయంలో సిట్ భేటీ

» 3 నెలల్లో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్‌పై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసింది. సీఐడీ చీఫ్ పర్యవేక్షణలో సిట్ పనిచేసేలా డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీ (పీ అండ్ ఎల్) ఎం.రమేశ్ నేతృత్వంలోని సిట్‌లో.. ఇంటెలిజెన్స్ ఎస్పీ సింధు శర్మ, సీఐడీ ఎస్పీ వెంకటలక్ష్మి, అదనపు ఎస్పీ చంద్రకాంత్, సీఐడీ డీఎస్పీ ఎం.శంకర్ సభ్యులుగా ఉంటారు. సిట్ భవిష్యత్ అవసరాల మేరకు ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ), న్యాయ, ఫోరెన్సిక్ నిపుణులు, ఇతర విభాగాల నుంచి సహాయసహకారాలు పొందేలా ఉత్తర్వుల్లో వెసులుబాటు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులను సిట్ విచారించనుంది. దీంతోపాటు.. ప్రస్తుతం అమలవుతున్న చట్టాలను నిక్కచ్చిగా అమలు చేయడం, బెట్టింగ్ యాప్‌లను నిర్మూలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం జరిపి, పలు సూచనలతో ప్రభుత్వానికి మూడు నెలల్లో సమగ్ర నివేదికను అందజేయనుంది. సిట్ బృందం మంగళవారం డీజీపీ కార్యాలయంలో తొలి సమావేశాన్ని నిర్వహించనుంది. ఇప్పటి వరకు పంజాగుట్ట, మియాపూర్ పోలీస్‌స్టేషన్లతోపాటు.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బెట్టింగ్ యాప్‌లపై నమోదైన కేసులను ఈ సందర్భంగా విశ్లేషించనుంది.



సైదాబాద్‌లో ప్లకార్డులతో ముస్లింల నిరసన ప్రదర్శన

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

సైదాబాద్/మదీన, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ చట్టం సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం సైదాబాద్‌లో ముస్లింలు నిరసన ప్రదర్శన చేశారు. ఈద్ ప్రార్థనల అనంతరం చేతులకు నల్లబ్యాండులు కట్టుకుని, పకార్డులు పట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిల్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం మతాలవారీగా చిచ్చు పెట్టాలని చూస్తుందని విమర్శించారు. వక్ఫ్ భూములను కాజేయడానికి కుట్ర పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మీరాలం ప్రాంతంలోనూ ముస్లింలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రార్థనల కన్నా ముందు మీరాలం ఈద్గాలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పలువురు నినాదాలు చేశారు.

ఈ మూడు నెలలూ మంటలే!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి సోమవారం భారత వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. మూడు నెలల సీజన్‌లో దక్షిణ భారతంలో పడమర ప్రాంతాలు, తూర్పు భారతం, దానికి ఆనుకుని మధ్య భారతంలో కొన్ని ప్రాంతాలు తప్ప.. దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఉత్తర, మధ్య, తూర్పు భారతం, దానికి ఆనుకుని దక్షిణాది రాష్ట్రాల్లో వడగాడ్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడుల్లోని ఉత్తర ప్రాంతంలో సగటు కంటే ఎక్కువగా వడగాడ్పులు వీస్తాయి. సాధారణంగా ఈ సీజన్‌లో నెలకు ఐదు నుంచి ఆరు రోజులు వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీస్తాయి. అటువంటిది ఈ ఏడాది ఈ మూడు నెలల సీజన్‌లో ఐదు నుంచి ఎనిమిది రోజులు గాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఏప్రిల్ వరకు చూస్తే పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇంకా వడగాడ్పులు తీవ్రంగా ఉండడంతోపాటు సాధారణం కంటే ఎక్కువ రోజులు కొనసాగుతాయి. ఏప్రిల్‌లో దక్షిణ, పడమర, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా, దేశంలోని మిగతా ప్రాంతాల్లో తక్కువగా వర్షపాతం నమోదుకానుంది. ఏప్రిల్‌లో దేశంలో 39.2 మి.మీ. వర్షపాతం నమోదుకావాలి. గడచిన రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షం జాడ లేకపోడంతో నేల పొడిగా మారిందని, దాంతో ఎండలు, గాడ్పులు పెరిగాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల మేరకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలో హీట్‌వేవ్ కోర్ జోన్‌లో 10 అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు. మార్చిలో అనేకచోట్ల 40 డిగ్రీలు దాటి పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే మూడు నెలల కాలంలో అనేకచోట్ల 45 డిగ్రీలు, అక్కడక్కడా మరింత ఎక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న మూడు నెలల్లో ఎండలు, వడగాడ్పుల ప్రభావం నుంచి తట్టుకునేలా కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యేకించి వేసవి ఉపశమన ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్‌లో పేర్కొంది. వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు, ఆరోగ్యపరంగా ఇబ్బందులుపడే వ్యక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఎక్కువగా చలువ కేంద్రాల ఏర్పాటుతోపాటు ఆరోగ్యశాఖను అప్రమత్తం చేయాలని, ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇవ్వడం, ఎండలు, గాడ్పుల వల్ల ఇబ్బందులపై హెచ్చరికలు జారీచేయడం, నగరాల్లో అర్బన్ హీట్ ఐలాండ్స్‌ను గుర్తించి చలువ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటివి చేయాలని భారత వాతావరణ శాఖ సూచించింది.



ఇలా చేస్తే మేలు

వచ్చే మూడు నెలలు ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు తీవ్రమయ్యే అవకాశం ఉందన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది.

- వేడి నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్, కూలర్లు, ఏసీలు వినియోగించాలి.
- తరచూ నీరు తాగాలి. సాయంత్రం, రాత్రి వేళ చన్నీటితోనే స్నానం చేయాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ నీళ్లు, కొబ్బరి నీరు తీసుకోవాలి.
- ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే.. తెల్లటి కాటన్ వస్త్రాలు ధరించాలి. తలకు టోపీ పెట్టుకోవాలి.
- ఎండలో వెళ్లినప్పుడు వాంతులైతే.. వడదెబ్బగా గుర్తించాలి. వైద్యులను సంప్రదించాలి.
- బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు బయట తిరగరాదు.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే తేనె, పంచదార వంటి తీపి పదార్థాలు తీసుకోకూడదు.
- బయటకు వెళ్లినప్పుడు శీతలపానీయాలు, ఐస్‌లు, ఆల్కహాల్, టీ, కాఫీ తాగడం మానుకోవాలి.

నేడు, రేపు వర్ష సూచన

రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. చాలాచోట్ల గంటకు 40- 50 కి.మీల వేగంతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు పడతాయని తెలిపింది. అక్కడక్కడ వడగళ్లతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. రెండు రోజుల క్రితంతో పోల్చితే రాష్ట్రంలో సోమవారం కొంత మేర ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆదిలాబాద్ జిల్లా పిప్పిలదారిలో, ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్, పెంచికల్ మండలాల్లో 41.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.5 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదైంది.

బసవతారకం ట్రస్ట్ కేసులో లక్ష్మీపార్వతికి ఎదురుదెబ్బ

» విల్లును నిరూపించడంలో కోర్టు ప్రొసీజర్ పాటించలేదు: హైకోర్టు

» దిగువ కోర్టు ఆదేశాలు కొట్టివేత

హైదరాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): 'బసవతారకం ట్రస్టు'కు తనను మేనేజింగ్ ట్రస్టీగా నియమించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌లో లక్ష్మీపార్వతికి ఎదురుదెబ్బ తగిలింది. 1995, నవంబరు 18న నందమూరి తారకరామారావు ఎగ్జిక్యూట్ చేసినట్లుగా పేర్కొంటున్న సప్లిమెంటరీ విల్లుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విల్లును నిరూపించే క్రమంలో సిటీ సివిల్ కోర్టు(దిగువ కోర్టు) చట్టం నిర్దేశించిన ప్రొసీజర్‌ను అనుసరించలేదని స్పష్టం చేసింది. సప్లిమెంటరీ విల్లుపై సాక్షి సంతకం చేసిన జె. వెంకటసుబ్బయ్య వారసుడు.. జేవీ ప్రసాద్‌రావును సాక్షి(పీడబ్ల్యూ-3)గా గుర్తిస్తూ దిగువ కోర్టు 2018లో ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు కొట్టేసింది. విల్లుపై సాక్షి సంతకాలు చేసిన జె.వెంకటసుబ్బయ్య, వై తిరుపతిరావుకు సమన్లు ఇవ్వకుండా.. వారు ఇద్దరూ చనిపోయినట్లు ఎలాంటి ఆధారాలు లేకుండా వారి వారసులను సాక్షులుగా స్వీకరించడం చెల్లదని పేర్కొంది. విల్లుపై సాక్షి సంతకం చేసిన వెంకట సుబ్బయ్య మరణించినట్లు నోటి మాట ఆధారంగా ఆయన కుమారుడు జేవీ ప్రసాద్‌రావును పీడబ్ల్యూ-3గా గుర్తించడం చెల్లదని పేర్కొంది. 1995లో రామారావు రాసినట్లు పేర్కొంటున్న సప్లిమెంటరీ విల్లు ప్రకారం బసవతారకం ట్రస్టుకు తనను మేనేజింగ్ ట్రస్టీగా నియమించాలని 2009లో లక్ష్మీపార్వతి సిటీ సివిల్ కోర్టులో(ట్రస్టు ఓపీ(పిటిషన్) దాఖలు చేశారు. సప్లిమెంటరీ విల్లులో సంతకం చేసిన వెంకట సుబ్బయ్య మరణించిన నేపథ్యంలో ఆయన కుమారుడు ప్రసాద్‌రావును విట్‌నెస్‌గా గుర్తించాలని పిటిషనర్ లక్ష్మీపార్వతి కోరారు. అలాగే, తన తండ్రి వెంకట సుబ్బయ్య మరణించారని.. రామారావు విల్లు రాసిన విషయం నిజమేనని, తన తండ్రి తనకు సమాచారం ఇచ్చారని జేవీ ప్రసాద్‌రావు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీంతో దిగువ కోర్టు పీడబ్ల్యూ-3గా ప్రసాద్‌రావును విచారించేందుకు అంగీకరించింది. అయితే.. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ.. బసవతారకం ట్రస్ట్, నందమూరి బాలకృష్ణ, నందమూరి హరికృష్ణ 2019లో హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.

ఆచార్య తుమ్మల రామకృష్ణ

కన్నుమూత

» ద్రవిడ విశ్వవిద్యాలయం వీసీగా సేవలు

» తెలుగు సాహిత్యంలో వృత్తి కథలకు నాంది

» నేడు లింగంపల్లిలో అంత్యక్రియలు


తుమ్మల రామకృష్ణ

హైదరాబాద్ సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు, ప్రముఖ సాహిత్య విమర్శకుడు, రచయిత ఆచార్య తుమ్మల రామకృష్ణ(67) ఇక లేరు. కొద్దిరోజులుగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం లింగంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. రామకృష్ణ స్వస్థలం చిత్తూరు జిల్లా ఆవులపల్లి. ఆయన శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 'తెలుగులో హాస్యనవలలు'అనే అంశంపై పరిశోధన చేసి 1988లో పీహెచ్‌డీ అందుకున్నారు. తర్వాత ఏడాది కర్నూలులోని ఎస్వీయూ పీజీ సెంటరులో తెలుగు లెక్చరర్‌గా చేరారు. అక్కడ పని చేస్తున్న కాలంలోనే మిత్రులతో కలిసి 'తుంగభద్ర ప్రచురణలు' పేరుతో 'పల్లెమంగలి కథలు' సంకలనాన్ని 1996లో ప్రచురించారు. తెలుగు సాహిత్యంలో వృత్తికథల ప్రయోగాలకు నాంది పలికిన వ్యక్తిగా రామకృష్ణ గుర్తింపు పొందారు. 'ఫ్యాక్షన్ కథలు', 'హైంద్రావతి కథలు' తదితర సంకలనాలకు సంపాదకత్వం వహించారు. రామకృష్ణ రాసిన కథానికలు 'మట్టిపొయ్యి' సంపుటిగా వెలువడింది. 'తెల్లకాకులు' కథ విమర్శకుల ప్రశంసలు పొందింది. ఆధునిక తెలుగుసాహిత్య వ్యాసాలు, సమీక్షలు, ప్రసంగాలు ..'పరిచయం', 'బహుముఖం', 'అభిచందనం', 'అవగాహన', 'బారిస్టర్ పార్వతీశం - ఒక పరిశీలన' తదితర పుస్తకాలుగా ప్రచురించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 2004నుంచి 2020 వరకు తెలుగు ఆచార్యుడిగా, ఆ శాఖ అధ్యక్షుడిగా పనిచేశారు. ద్రవిడ వర్సిటీ వీసీగా 2020 నవంబరు నుంచి మూడేళ్లు సేవలందించారు. రామకృష్ణ మృతికి హెచ్‌సీయూ తెలుగు శాఖాధ్యక్షుడు పిల్లలమర్రి రాములు, సాహితీవేత్తలు సంగిశెట్టి శ్రీనివాస్, దార్ల వెంకటేశ్వరరావు, పులికొండ సుబ్బాచారి, ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య లక్ష్మీనారాయణ, తెలుగు వర్సిటీ పూర్వ వీసీ ఎన్వీ సత్యనారాయణ సంతాపం తెలిపారు. తుమ్మల రామకృష్ణ అంత్యక్రియలు మంగళవారం లింగంపల్లిలోని శ్మశానవాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

కామారెడ్డి జిల్లాలో రైతు ఆత్మహత్య

రాజంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పంట దిగుబడి రాలేదని కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం పొందుర్తి గ్రామంలో ఓ రైతు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. పొందుర్తి గ్రామానికి చెందిన తిరుగుడు స్వామి(36) గ్రామ శివారులో రెండు ఎకరాల్లో వరి సాగు చేయగా దిగుబడి రాలేదు. ఆర్థిక ఇబ్బందులకు తోడు పంట దిగుబడి రాలేదని తీవ్ర మనస్తాపం చెందిన స్వామి ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

దండిగా ఎన్‌హెచ్‌ఎమ్ నిధులు

తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారి రూ.వెయ్యి కోట్లకుపైగా విడుదల

» 2024-25లో రూ.1,114 కోట్లు ఇచ్చిన కేంద్రం

» కేటాయింపులకన్నా 18 % అదనం

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జాతీయ ఆరోగ్య విషన్ (ఎన్‌హెచ్‌ఎమ్) కార్యక్రమాలకు కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగా నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా రూ.1,000 కోట్లకుపైగా నిధులు వచ్చాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.938 కోట్లు కేటాయించగా.. తొలిసారిగా కేటాయించిన దానికంటే ఎక్కువగా (రూ.1,114.91 కోట్లు) విడుదల చేసింది. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి గత ఆర్థిక సంవత్సరం వరకు ఎన్‌హెచ్‌ఎమ్ నిధుల విషయంలో కేంద్రం చిన్నచూపు చూసింది. కేటాయింపుల కంటే తక్కువగా నిధులు విడుదల చేసింది. రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి 2024 వరకు కేంద్రం ఎన్‌హెచ్‌ఎం కింద రూ.7,010 కోట్లు కేటాయించింది. అయితే ఇందులో రూ.5,952 కోట్లే విడుదల చేసి రూ.1,058 కోట్లను పెండింగ్‌లో పెట్టింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరాన్ని కూడా కలిపితే రాష్ట్రానికి మొత్తం రూ.7,950 కోట్లు కేటాయించగా, అందులో రూ.7,076 కోట్లనే విడుదల చేసింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గతేడాది వరకు ప్రతి ఏటా కేటాయింపుల కంటే తక్కువగా నిధులను కేంద్రం విడుదల చేస్తూ వచ్చింది. అందుకు అనేక కారణాలున్నాయి. గత బీఆర్ఎస్ సర్కారు కేంద్రం ఇచ్చే ఎన్‌హెచ్‌ఎమ్ నిధులను రాష్ట్ర ఆరోగ్య పథకాల కింద ఉపయోగించింది. దాంతో కేంద్రం నిధుల విడుదల పూర్తిస్థాయిలో చేయలేదు. కేంద్ర నిధులను రాష్ట్ర సర్కారు సొంత పథకాలకు వాడుకుంటోందనే అభిప్రాయం కేంద్రంలో ఏర్పడింది. గతంలో ఎన్‌హెచ్‌ఎమ్ ఎండీలు నిధుల కోసం గట్టిగా ప్రయత్నించలేదు. గత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రానికి మధ్య సఖ్యత లేకపోవడమూ నిధుల విడుదలకు అడ్డంకిగా మారింది. 2023-24లో రాష్ట్రానికి ఎన్‌హెచ్‌ఎమ్ కింద రూ.888 కోట్లు కేటాయించినా రూ.564 కోట్లే ఇచ్చింది. అంతకు ముందు ఏడాది రూ.172కోట్లు తక్కువ ఇచ్చింది.

సంవత్సరం	కేంద్రం వాటా	విడుదలైన మొత్తం	కోత పెట్టిన మొత్తం
2020-21	రూ.745 కోట్లు	రూ.671 కోట్లు	రూ.76 కోట్లు
2021-22	రూ.825 కోట్లు	రూ.725 కోట్లు	రూ. 100 కోట్లు
2022-23	రూ.856 కోట్లు	రూ.683 కోట్లు	రూ.172 కోట్లు
2023-24	రూ.888 కోట్లు	రూ.564 కోట్లు	రూ.323 కోట్లు
2024-25	రూ.938 కోట్లు	రూ. 1114 కోట్లు	రూ.176 కోట్లు (అదనం)

కాంగ్రెస్ వచ్చాక నిధులపై ప్రత్యేక దృష్టి..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్‌హెచ్‌ఎమ్ నిధులపై ప్రత్యేక దృష్టిసారించింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కేంద్రానికి పలుమార్లు లేఖలు రాయగా.. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి రావాల్సిన ఎన్‌హెచ్‌ఎమ్ నిధులను విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. తర్వాత ఎన్‌హెచ్‌ఎమ్ ఎండీ కర్ణన్ ఫాలో అప్ చేశారు. దాంతో నిధుల విడుదలను కేంద్రం వేగవంతం చేసింది. ఎన్‌హెచ్‌ఎమ్ కార్యక్రమాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పకడ్బందీగా అమలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా అసాంక్రమిత వ్యాధులైన (ఎన్‌సీడీ) బీపీ, షుగర్ పరీక్షలను దేశంలో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో బాగా చేస్తున్నారు. ఎన్‌హెచ్‌ఎమ్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఇతర రాష్ట్రాల కంటే వేగంగా, మెరుగ్గా రాష్ట్రంలో నిర్వహిస్తుండటంతో కేంద్రం దృష్టి పడింది. ఈ నేపథ్యంలో ఎన్‌సీడీపై నేషనల్ కాన్ఫరెన్స్‌ను ఢిల్లీలోకాకుండా తొలిసారి హైదరాబాద్‌లో గత జనవరి 8, 9 తేదీల్లో నిర్వహించింది. ఈ సమావేశానికి కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, అన్ని రాష్ట్రాల ఎన్‌హెచ్‌ఎమ్ ఎండీలు, ఇతర అధికారులు హాజరయ్యారు. వెరసీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రోగ్రామ్‌పై కేంద్రానికి సానుకూల దృక్పథం ఏర్పడింది. ఎన్‌హెచ్‌ఎమ్ నిధులను ఈసారి దండిగా విడుదల చేసింది.

కూల్ డ్రింక్స్ యమా డేంజర్!

» అధిక సుక్రోజ్‌తో అనారోగ్యమే

» మధుమేహం, ఊబకాయం ముప్పు

» మెటబాలిజంపై తీవ్ర ప్రభావం

» శరీర వ్యవస్థ అస్తవ్యస్థం

» టాటా ఇన్‌స్టిట్యూట్ పరిశోధనలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి.. హాయిగా.. కూల్‌కూల్‌గా ఓ కూల్‌డ్రింక్ తాగేద్దామనుకుంటున్నారా? ఆ చర్య వల్ల తాత్కాలికంగా శరీరానికి చల్లదనం లభించినా.. తీపి శీతల పానీయాల్లో ఉండే అధిక సుక్రోజ్‌తో ఆరోగ్యానికి చేటు అని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్(టిఫ్-హైదరాబాద్, ముంబై)లోని అడ్వాన్స్ రిసెర్చ్ యూనిట్ ఆన్ మెటబాలిజం, డెవలప్‌మెంట్ అండ్ ఏజింగ్(అరుమ్డా) శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. ఈ పరిశోధన వివరాలు 'న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. టిఫ్ శాస్త్రవేత్తలు ఎలుకలపై తమ పరిశోధనలను చేశారు. 10% మేర సుక్రోజ్ ఉండే నీటిని పరగడపున, ఏదైనా తిన్న తర్వాత వేర్వేరుగా ఎలుకలకు ఇచ్చారు. సుక్రోజ్ కారణంగా.. మనం తినే ఆహార పదార్థాల్లోని అమైనో ఆమ్లాలు, కొవ్వు కంటే ఎక్కువగా శరీరంలో అసమతుల్యంగా మారిన గ్లూకోజ్(హెక్సోస్ షుగర్) శోషణ జరుగుతుందని, దీంతో చిన్నపేగుల మీద అత్యంత వేగంగా దుష్ప్రభావం పడుతుందని ఈ పరిశోధనలో తేలింది. అంతేకాదు.. ఆహారంలోని ప్రొటీన్లను కండరాలను పెంచేందుకు దోహదపడే నిర్మాణాత్మక జీవక్రియ(అనబాలిక్), కొవ్వు, గ్లూకోజ్‌ను శక్తిగా మార్చే విచ్ఛిన్నాత్మక జీవక్రియ(క్యాటబాలిక్)పై దుష్ప్రభావాలకు శీతల పానీయాల్లో అధిక మోతాదులో ఉండే సుక్రోజ్ కారణమవుతుందని వెల్లడైంది. మెటబాలిజానికి దోహదపడే కాలేయంపై సుక్రోజ్ చూపే దుష్ప్రభావం కారణంగా పలు రుగ్మతలు వస్తాయని, క్లోమం ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసినా.. మెటబాలిజంపై పడే ప్రభావం కారణంగా గ్లూకోజ్‌ను శక్తిగా మార్చలేదని, దాంతో మధుమేహం, ఊబకాయం వచ్చే ప్రమాదాలున్నాయని హెచ్చరించింది. శీతల పానీయాల్లోని అధిక సుక్రోజ్ వల్ల శరీరంలోని జీర్ణ వ్యవస్థ అస్తవ్యస్థమవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.